# క్రాంతి

లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| అయిదు రాష్ట్రాల ఎన్నికలు | ......... 6 |
| పశ్చిమ బెంగాల్ ఎన్నికలు | ......... 9 |
| లాడెన్ హత్యను ఖండిద్దాం | .........14 |
| ఫుకుషిమా అణు ప్రమాదం | .........18 |
| సిద్ధాంత వ్యాసం | ......మధ్య పేజీలో |
| కామ్రేడ్ ఆజాద్ హత్యకేసు | ......... 26 |
| చైనా ల్లో ఉద్యమం | ......... 28 |
| సిసి ప్రకటన | ......... 31 |
| బ్రిక్స్ సమావేశం | ......... 35 |
| కామ్రేడ్ అంజిత చరిత్ర | ......... 36 |
| పోరాట వార్తలు | ......... 37 |



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎన్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 35 సంచిక: 3 మే - జూన్ 2011 వెల: పది రూపాయలు


# మార్గంలో మలుపులనధిగమిస్తూ ప్రజా యుద్ధ మార్గంలో పురోగమిస్తున్న ఎ.ఒ.బి. ఉద్యమానికి పది వసంతాలు

2001 ప్రారంభంలో విముక్తి ప్రాంత లక్ష్యంతో ఏర్పడిన ఆంధ్రా – ఒడిశా సరిహద్దు జోన్‌కు పది సంవత్సరాలు నిండాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మే 7 అల్లూరి జయంతి దినం నుండి జూన్ 7 వరకూ ఉత్సవాలు జరపుకోవాలని, మరొక్కసారి గతాన్ని మననం చేసుకొని, మరింత దృఢ దీక్షతో లక్ష్యం యెడల పునరంకితం కావాలని ఆంధ్రా – ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ తన శ్రేణులకూ, విప్లవ ప్రజానీకానికీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా ఎస్.జడ్.సి.కీ, అన్ని శ్రేణులకూ, నిర్మాణాలకూ, విప్లవ ప్రజానీకానికీ 'క్రాంతి' విప్లవాభినందనలు తెలుపుతోంది. కర్తవ్య నిర్వహణలో భాగంగా అసువులు బాసిన కామ్రేడ్స్ అందరికీ పేరు పేరునా వినమ్ర నివాళినర్పిస్తోంది. ఇదే సందర్భంగా ఎ.ఒ.బి. ఉద్యమ చరిత్రను పాఠకులకు సంక్షిప్తంగా పరిచయం చేస్తోంది.



స్వాధీనం చేసుకొన్న భూముల్లో ఆదివాసీ రైతాంగం

## తూర్పు కనుమల పోరాట వారసత్వం

ఈ ప్రాంతం సర్వసంపదలకు నిలయుమే కాకుండా, ఆ సంపదలను దోపిడీ వర్గాల నుండి కాపాడుకునేందుకు వీరోచితమైన పోరాటాలు నిర్వహించిన ఎందరో భూమి పుత్రులకు, పుత్రికలకు కూడా నిలయుమే. ఆంధ్రా – ఒడిశా రాష్ట్రాలను కలుపుతున్న ఈ సరిహద్దు ప్రాంతం ఎత్తయిన కొండలతో దట్టమైన అడవులతో, అపారమైన జలవనరులను కలిగి వున్నది. ఇక్కడ, పెట్టుబడిదారులకు కాసుల పంట పండించే వెదురు, తునికాకు, కలప, ఔషధ మొక్కలు విస్తారంగా వున్నాయి. ఇక్కడ ఖనిజ సంపదకు కొదువ లేదు. ఇది కాఫీ, పండ్ల తోటల వంటి వ్యాపార పంటలకు అనువైన ప్రాంతం కూడా. ఈ ప్రాంతానికి వున్న ఈ ప్రత్యేకతలరీత్యానే, శతాబ్దాలుగా పరాయి రాజులు, బ్రిటీష్

వలసవాదులు, ఈ ప్రాంతంపై పట్టు సంపాదించి ఇక్కడి సంపదను దోచుకునేందుకు, స్థానిక ఆదివాసీ ప్రజానీకంపై అనేక పర్యాయాలు క్రూరమైన దాడులు నిర్వహించారు. అయితే స్వేచ్ఛా ప్రియులైన ఇక్కడి ఆదివాసీ రైతాంగం ఈ దాడులను గొప్ప తిరుగుబాట్లతో ఎదుర్కున్నారు.

1947 అగస్టు 15 అర్ధరాత్రి స్వతంత్రం తర్వాత కూడా సహజంగానే ఇక్కడ దోపిడీ పరిస్థితిలో ఎటువంటి మార్పులేదు. బ్రిటీష్ సామ్రాజ్య వాదుల నుండి కుట్ర పూరితంగా అధికారాన్ని పొందిన దేశంలోని నిరంకుశ దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాలు తమ యజమానులైన సామ్రాజ్యవాదులకు దేశాన్ని దోచిపెడ్తూ, తమ బొక్కసాలు నింపుకునేందుకు దేశ ప్రజలపై తమ దోపిడీ పీడనలను యథాతథంగా కొనసాగించాయి. ఈ నేపథ్యంలోనే 1947 తరువాత కూడా ఇక్కడి ఆదివాసీ ప్రాంతాలపై రాజ్యంతో పాటు, బహుళ జాతి సంస్థల, ఆదివాసేతర భూస్వాముల దోపిడీ పీడనలు యధేచ్ఛగా కొనసాగుతూ వచ్చాయి. ఈ వైరుధ్యాల తీవ్రత ఫలితంగానే నక్సల్‌బరీ నిప్పు రవ్వ పుట్టి దావానలంలా దేశమంతా వ్యాపించింది. ఆ ప్రేరణతోనే శ్రీకాకుళ ఆదివాసీ రైతాంగం తిరుగుబాటు జెండా ఎగరేసింది. అయితే ఆనాడు రాజ్యం అమలు చేసిన క్రూర నిర్బంధం కారణంగా శ్రీకాకుళ ఉద్యమం వెనుకపట్టు పట్టింది. వాళ్లకు పోరాటంలో గెలుపు, ఓటములు మాత్రమే వుంటాయని తెలుసు. లొంగుబాట్లు, దిగజారుళ్లు అనే పదాలు వాళ్ల నిఘంటువులో లేవు. అందుకే తిరిగి 1980లలో జగిత్యాల రైతాంగ జైత్రయాత్రకు బాసటగా తూర్పుకనుమలు పోరాట బాట పట్టాయి.

## దోపిడీ పీడనలను నేలమట్టం చేస్తూ పెల్లుబికిన ప్రజా పోరాటాలు

ఈసారి ఉద్యమం నాటి సి.పి.ఐ. (ఎం.ఎల్) (పీపుల్స్‌వార్) నాయకత్వంలో తూర్పు గోదావరి, విశాఖ జిల్లాలలో ప్రారంభమై క్రమంగా శ్రీకాకుళం, విజయనగరం, ఒడిశాలోని అవిభక్త కోరాపుట్ జిల్లాలకు వ్యాపించింది. పార్టీ, దళాలు ప్రజలతో మమేకమవుతూ వారి విశ్వాసాన్ని చూరగొన్నాయి. ప్రజలపై కొనసాగుతున్న సకల దోపిడీ రూపాలకు వ్యతిరేకంగా వీరిని సంఘటితపరిచాయి. ఫలితంగా ఆదివాసీ రైతాంగం తమ జీవితంలోని సకల పార్శ్వాలను క్రూరంగా శాసిస్తోన్న దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా తిరుగుబాటును ప్రకటించింది. అప్పటిదాకా అటవీ చట్టాల పేరుతో తమ జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న ఫారెస్టు అధికారులను మొదటగా బోనులో నిలబెట్టారు. వారి నుండి అక్రమంగా వసూలు చేసిన వేలాది రూపాయల లంచాలను, జరిమానాలను తిరిగి రాబట్టారు. ఫారెస్టు పనులలో వెట్టి చేయించినందుకు గార్డులను, వాచర్లను పంచాయితీలలో నిలబెట్టి దేహశుద్ధులు చేయడమే కాకుండా తాము చేసిన శ్రమకు విలువను కట్టించారు, వెట్టి చాకిరీనీ, మేకపుల్లర, అరక పుల్లరలను రద్దు చేశారు. తాము చేసుకుంటున్న కొండపోడుల తెరువు రాకుండా ఫారెస్టు అధికారులను కట్టడి చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే అడవిలో ఫారెస్ట్ అధికారుల దోపిడీ ఆధిపత్యాలను కూకటి వేళ్లతో పెళ్లగించారు. ఆనాటి ఫారెస్టు అధికారుల దోపిడీ పీడనల గురించి కొత్త తరానికి చెబితే కానీ అర్థం కానీ పరిస్థితి వుందంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా ఆదివాసీల ప్రధాన జీవనోపాధి అయిన భూమిని ప్రభుత్వం, బహుళ జాతి సంస్థలూ, ఆదివాసేతర భూస్వాములు కబ్జా చేయడాన్ని రైతు కూలీ సంఘాల నాయకత్వంలో అడ్డుకున్నారు. ప్రభుత్వం, ఒక వైపున ఆదివాసీలు చేస్తున్న పోడు వ్యవసాయం వలన పర్యావరణం దెబ్బతింటున్నదని గగ్గోలు పెడ్తూ, మరోవైపు బహుళజాతి సంస్థల ప్రయోజనాలకు అడవిని నరికించి లక్షలాది ఎకరాల్లో జామాయిల్, సిల్వర్ ప్లాంటేషన్లను వేయిస్తున్నది. ఈ కుట్రలను అర్థం చేసుకున్న ఆదివాసీ రైతాంగం వేలాది ఎకరాల ప్లాంటేషన్లను నరికి సాగుభూమిగా చేసుకున్నారు. నాటి నుండి నేటి వరకు ఇలా స్వాధీనం చేసుకున్న అటవీ భూమి ఒక లక్షా యాభై వేల ఎకరాలకు పైగా వుంటుంది. మరోవైపు ప్రపంచబ్యాంకు మార్గ దర్శకత్వంలో బహుళజాతి సంస్థల ప్రయోజనాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ముందుకు తెస్తున్న ఉమ్మడి అటవీ యాజమాన్య పథకం, వన సంరక్షణ సమితులు వంటి పథకాలను రైతాంగం తిప్పికొట్టారు. అంతే కాకుండా అడవిపైన వారసత్వంగా వస్తున్న తమ హక్కును దెబ్బతీసే కుట్ర ఈ పథకాల్లో దాగి వుందని అర్థం చేసుకుంటున్నారు.

ఇక మైదానాల నుండి వచ్చిన ఆదివాసేతర భూస్వాములు రకరకాల పద్ధతుల్లో ఆదివాసీలను మోసం చేసి, వేలాది ఎకరాల సాగుభూమిని ఆక్రమించారు. అంతే కాకుండా, వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని చింతచెట్ల వంటి అడవి సంపదపై కూడా అదుపు సంపాదించారు. చివరికి వారిని భూమి నుండి దూరం చేసి కూలీలుగా మార్చి శ్రమశక్తిని దోపిడీ చేయడమే కాకుండా, దండుగలు, శిక్షలు, మహిళలపై అత్యాచారాలు వంటి అమానవీయమైన పద్ధతుల ద్వారా పీడించారు. 1/70 (ఏ.పి.), 2/52 (ఒడిశా) వంటి చట్టాలు కూడా కాగితాలకే పరిమితమైనాయి. ఈ పరిస్థితుల్లో వేలాది మంది ఆదివాసీ రైతాంగం సంఘం నాయకత్వంలో ఉప్పెనలా కదిలారు. వేలాది ఎకరాల మొఖాసా, మిగులు, బంజర్లు, బినామి, మఠం భూములను ఆక్రమించారు. ముఠాదారీ వ్యవస్థను ధ్వంసం చేసారు. ఈ పోరాటంలో అడ్డు

వచ్చిన క్రూరమైన భూస్వాములను ఖతం చేసి కదం తొక్కారు. ఒక్క తూర్పు డివిజన్‌లోనే 700 గ్రామాల ప్రజలు 17 వేల ఎకరాల భూముల్ని ఆక్రమించారు. శ్రీకాకుళంలో 34 గ్రామాల ప్రజలు వెయ్యి ఎకరాలదాకా ఆక్రమించారు. బాశధార డివిజన్‌లో వేలాదిమంది రైతాంగం భూస్వాముల పంట పొలాలపై దాడి చేసి, వందలాది ఎకరాలలో పంటలను స్వాధీనం చేసుకున్నారు. కోరాపుట్ జిల్లా బందుగాం, నారాయణ పట్నా బ్లాక్‌లలోని 11 పంచాయితీలకు చెందిన ప్రజలు, భూస్వాముల నుండి షావుకార్ల నుండి నాలుగు వేల ఎకరాల దాకా భూమిని స్వాధీనం చేసుకున్నారు. మల్కన్‌గిరి జిల్లా కలిమెల బ్లాక్‌లో కూడా భూస్వాముల భూములు రైతాంగానికి స్వాధీనం అయ్యాయి. పార్టీ నాయకత్వంలో ఇక్కడ జరిగిన సాయుధ వ్యవసాయిక విప్లవ పోరాటంలో మెజారిటీ రైతులు భూములకు హక్కుదారులయ్యారు. ఈ క్రమంలోనే భూముల పంపకంలో జరిగిన అవకతవకలను సరిదిద్దేందుకు ఈస్ట్ డివిజన్‌లోని అనేక గ్రామాలలో విప్లవ సంస్కరణలు చేపట్టారు.

పార్టీ ఇచ్చిన చైతన్యంతో ఆదివాసీ రైతాంగం ఒక్క చోటేమిటి, ఒక్క సమస్యేమిటి, ఎక్కడ దోపిడీ వుంటే అక్కడ తిరగబడ్డారు. గత 30 సంవత్సరాలుగా చేసిన పోరాట ఫలితంగా, తునికాకు కట్టకు 5 పైసలున్న రేటును, నేడు 1.40 రూ.లకు పెంచుకున్నారు. నిర్బంధంగా వసూలు చేస్తున్న వెట్టి కట్టలను రద్దు చేసారు. ఆదివాసీ రైతాంగం ఇచ్చిన మద్దతుతో, తునికాకు కల్లాలలో పనిచేసే వాచర్లు, కల్లేదార్లు సంఘటితపడి, తమ జీతాలను 200 రూపాయల నుండి 3,500 రూపాయల దాకా పెంచుకున్నారు. జోన్ పరిధిలోని పేపర్‌మిల్లులైన ఐటిసి, థాపర్ మొదలగు బహుళజాతి సంస్థలకు, నిరంకుశ దళారీ బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా వేలాదిమంది వెదురు కూలీలు సంఘటిత పడి వెదురు కూపుల్లో సమ్మెలకు దిగారు. మిలిటెంట్ పోరాటాలు చేపట్టారు. ఫలితంగా ప్రారంభంలో 4 రూపాయలుగా వున్న రోజు కూలీ, నేడు 66 రూపాయల దాకా పెరిగింది. ఇంకా డ్రాగింగ్, లోడింగ్, అన్‌లోడింగ్‌లకు కూడా కూలీ రేట్లు పెరిగాయి. స్త్రీ, పురుషుల కూలీరేట్లలో వివక్ష రద్దు అయింది. ప్రభుత్వ కాఫీ ప్లాంటేషన్లలో గోతులు తవ్వినందుకు, కాఫీ పండ్లు ఏరినందుకు ఇస్తున్న కూలీని పెంచుకునేందుకు ప్రారంభమైన పోరాటాలు నేడు కాఫీ ప్లాంటేషన్ల ఆక్రమణ పోరాటాలుగా మారాయి. ఈ సంవత్సరం బలపం పంచాయితీలో 33 గ్రామాల ప్రజలు కదిలి 110 హెక్టార్ల కాఫీ ప్లాంటేషన్‌ను ఆక్రమించారు.

ఇంకా ఈ 30 సంవత్సరాల కాలంలో గిట్టుబాటు ధరల సాధన కోసం విద్యా, వైద్యం సాగునీరు, తాగునీరు వంటి కనీస అవసరాల కోసం, కరువు, అనారోగ్య మరణాలకు వ్యతిరేకంగా అనేక సందర్భాలలో పోరాటాలు చేపట్టి విజయాలు సాధించారు. ఒక్క సీలేరు నది పైనే ఏడు జల విద్యుత్ ప్రాజెక్టులు నిర్మించి వందల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ, అతి చౌకగా పెట్టుబడిదార్లకు సరఫరా చేస్తున్న ప్రభుత్వాలు స్థానిక ఆదివాసీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. ముఖ్యంగా మల్కన్‌గిరి జిల్లాలోని కట్ ఆఫ్ ఏరియాలోని ప్రజలకు విద్యుత్‌తో పాటు కనీస అవసరాలను కూడా సమకూర్చలేకపోయాయి. ఈ పరిస్థితుల్లో 2009లో ఒకసారి 2010లో ఒకసారి అనేక పంచాయితీల గ్రామాల నుండి చిత్రకొండకు వేలాదిమంది పెద్ద ఎత్తున కదిలి 15 రోజుల చొప్పున రెండు సార్లు ధర్నాలు నిర్వహించారు. ప్రజల సంఘటిత శక్తి ముందు లొంగి వచ్చిన జిల్లా కలెక్టర్, ప్రజల సమస్యల పరిష్కారానికి హామీ పడక తప్పలేదు. 2000 నుండి 2009 లోపు విశాఖలో బాక్సైట్ గనులను ఏర్పాటు చేస్తున్న జిందాల్ అల్ ఖైమా బహుళజాతి సంస్థలకు, వాటికి అనుమతినిచ్చిన తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలకు వ్యతిరేకంగా గొప్ప మిలిటెంట్ పోరాటం నిర్వహించారు. ఈ పోరాటాల ఫలితంగా రెండు సందర్భాలలోను దోపిడీ పాలక వర్గాలు తమ ప్రయత్నాలను విరమించుకోక తప్పలేదు. మాలి, దేవ్‌మాలి పర్వతాలలో కూడా నవీన్ ప్రభుత్వం బాక్సైట్ గనులకు అనుమతినిచ్చి స్థానిక ఆదివాసీలను నిర్వాసితులను చేయ ప్రయత్నిస్తే ప్రజలు మిలిటెంట్‌గా పోరాడుతున్నారు. ఆదివాసీ ప్రాంతాలపై రాజకీయ స్వయం ప్రతిపత్తి కావాలని వేలాది మంది కదిలి సెమినార్లు, ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించారు.

ఒక వైపున నిత్య జీవితంలో తాము ఎదుర్కుంటున్న సమస్యలపై పోరాటాలు చేపడ్తూనే మరోవైపు నిర్బంధానికి, గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో వేలాది మంది కదిలారు. జైళ్లల్లో వున్న తమ నాయకుల కోసం, సహచరుల కోసం అనేక సందర్భాలలో ర్యాలీలు రాస్తారోకోలు నిర్వహించారు.

ఈ అన్ని పోరాటాల్లోనూ మహిళల పాత్ర చురుకైనదీ, క్రియాశీలకమైనది. 90లలో ఆంధ్రప్రదేశ్‌ను కుదిపేసిన సారా వ్యతిరేక పోరాటంలో మిలిటెంట్ పాత్రను పోషించిన తూర్పు కనుమల ఆదివాసీ మహిళల వారసత్వాన్ని కొనసాగిస్తూ నేడు కోరాపుట్ డివిజన్‌లో మహిళల నాయకత్వంలో జరిగిన సారా వ్యతిరేక పోరాటం విజయవంతం అయింది. మహిళలపై పోలీసుల అత్యాచారాలకూ, వాకపల్లి వంటి ఘటనలకూ వ్యతిరేకంగా పలు ఆందోళనలకు నాయకత్వం వహించారు.

ఈ పోరాటాల ద్వారా ప్రజలు మరింత చైతన్యవంతమైనారు. తమ సంపూర్ణ విముక్తి ప్రజల రాజ్యాధికారంతోనే ముడిపడి వుందనే విషయాన్ని గ్రహించగలిగారు. అందుకు సాయుధం కావాలనే

స్వీయ అనుభవాన్ని పొందారు. అందుకే జల్, జంగల్, జమీన్‌లపై సర్వాధికారాలనే రాజకీయ నినాదం తూర్పు కనుమల్లో మారు మోగింది.

## పురోగమిస్తున్న విప్లవోద్యమం - పాలక వర్గాల దమనకాండ

తూర్పు కనుమల్లో తిరిగి ప్రారంభమైన విప్లవోద్యమాన్ని పాలకవర్గాలు మొగ్గలోనే తుంచేయాలని ప్రయత్నించాయి. నక్సలైట్లే దేశభక్తులంటూ ఎపిలో అధికారంలోకి వచ్చిన ఎన్.టి.ఆర్. నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం, 1985 నాటికి మొదటి అణచివేత నిర్మూలనా కేంపెయిన్ ప్రారంభించింది. అప్రకటిత యుద్ధం మొదలైంది. ముఖ్యంగా ఈస్ట్ డివిజన్‌పై నిర్బంధం విరుచుకుపడింది. ఎక్కడికక్కడ పోలీసు క్యాంపులు పెట్టి దళాలపై, గ్రామాలపై దాడి చేసి హత్యాకాండకు పాల్పడ్డం, అరెస్టులూ, చిత్రహింసలూ, మహిళలపై అత్యాచారాలూ, గ్రామాలను తగుల బెట్టడం విచ్చలవిడిగా కొనసాగింది.

1991 నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో రెండవ అణచివేత నిర్మూలనా కేంపెయిన్ ప్రారంభమైంది. ఈసారి దాడి మరింత క్రూరంగా అమలు జరిగింది. ఈ దాడి ఈస్టు డివిజన్‌తో పాటు శ్రీకాకుళానికి కూడా విస్తరించింది.

1992 మేలో (పీపుల్స్‌వార్) పార్టీతో పాటు ఏడు విప్లవ ప్రజా సంఘాలను కాంగ్రెస్ పార్టీ నిషేధించింది. బూటకపు ఎదురు కాల్పులతో పార్టీ నాయకత్వం మొదలు, సాధారణ ప్రజల వరకు అనేక మందిని కాల్చి చంపారు. సాయుధ దాడిని ప్రధానం చేస్తూనే, ఆర్థిక సంస్కరణలు, మానసిక యుద్ధం వంటి ఇతర దాడి రూపాలను చేపట్టారు. ఇన్‌ఫార్మర్లూ, కోవర్టులు వంటి కుట్ర పద్ధతులకు పాల్పడ్డారు. ముఖ్యంగా ఆర్థిక సంస్కరణల ద్వారా ప్రజలలో ఒక సెక్షన్‌ను చీల్చి వారిని తమకు అనుకూలంగా వుండే సాంఘీక పునాదిగా మార్చుకున్నారు. ఈ బహుముఖ దాడి 1997 నాటికి ఎ.పి.లో ఒక సమగ్ర రూపం తీసుకొని క్రమంగా తీవ్రతరం అవుతూ వచ్చింది. 2002 నాటికే ఒడిశా ప్రభుత్వం కూడా ఆపరేషన్ కన్‌సరక్ట్ పేరుతో బహుముఖ దాడిని ప్రారంభించింది.

2004 సెప్టెంబర్ 21న సి.పి.ఐ. (మావోయిస్టు) ఆవిర్భవించడంతో పాలక వర్గాలు మరింతగా బెంబేలెత్తిపోయాయి. పార్టీ, విప్లవోద్యమం దేశ అంతర్గత భద్రతకు పెను ముప్పు అని మన్‌మోహన్ సింగ్ గగ్గోలు పెట్టాడు. అప్పటి నుండి కేంద్ర ప్రభుత్వమే దేశంలోని ఉద్యమ ప్రభావిత రాష్ట్రాలను సమన్వయిస్తూ విప్లవోద్యమ అణచివేతకు ప్రత్యక్షంగా నేతృత్వం వహిస్తూ వచ్చింది. ఎ.పి.లో అమలు చేసిన ఎల్.ఐ.సి. వ్యూహాన్ని మరింత పదును పెట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహుముఖ దాడిని తీవ్రతరం చేసాయి. 2008లో సామ్రాజ్యవాద ద్రవ్య ఆర్థిక వ్యవస్థ మహా సంక్షోభంలోకి కూరుకుపోయిన నేపథ్యంలో భారత పాలకవర్గాలు, రెండవ దశ ఆర్థిక సంస్కరణల పేరుతో దేశ సంపదను సామ్రాజ్యవాదులకు దోచిపెట్టే కార్యక్రమాన్ని తీవ్రతరం చేసాయి. ముఖ్యంగా భారత దేశంలోని, విశాల అటవీ ప్రాంతంలో నిక్షిప్తమై వున్న ఖనిజ సంపదతో పాటు ఇతర వనరులను కొల్లగొట్టేందుకు బహుళ జాతి సంస్థలతో భారత పాలక వర్గాలు అనేక ఎం.ఒ.యు.లను కుదుర్చుకున్నాయి. వాటి ఫలితంగా పెద్ద ఎత్తున నిర్వాసితులవుతున్న ఆదివాసీ రైతాంగం పార్టీ నాయకత్వంలో సంఘటితపడి దోపిడీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సాయుధంగా తిరగబడుతున్నారు.

ఈ ప్రతిఘటనను దెబ్బతీసేందుకు, ముఖ్యంగా పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించేందుకు ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో 2009 ఆగస్టు, సెప్టెంబర్‌ల నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ సైనికదాడిని ప్రారంభించాయి. ఈ దాడి ఎ.ఒ.బి. జోన్‌లోని ఆంధ్ర, ఒడిశా ప్రాంతమంతటా తీవ్రంగా కొనసాగుతోంది. కార్పెట్ సెక్యూరిటీ పేరుతో గతంలో ఖాళీ చేసిన పోలీసు స్టేషన్లను తిరిగి కొత్తగా ప్రారంభించడమే కాకుండా దాదాపు పది కొత్త పోలీసు క్యాంపులను పెట్టారు. స్థానిక కమాండో బలగాలైన గ్రేహౌండ్స్, ఎస్.ఒ.జి. పోలీసులతో పాటు అయిదు బెటాలియన్ల బి.ఎస్.ఎఫ్.పోలీసులను, సి.ఆర్.పి.ఎఫ్.ను పెద్ద ఎత్తున మోహరించారు. ఉపాధి కల్పన పేరుతో వందలాది మంది ఆదివాసీ యువకుల్ని ఎస్.పి.ఒ.లు గానూ, పోలీసులుగానూ భర్తీ చేసుకొని, ఆదివాసీలను ఆదివాసీలతోనే నిర్మూలించే కుటిల పథకాలను రూపొందిస్తున్నారు. సంస్కరణల పేరుతో ఎ.ఒ.బి.జోన్‌లోని ఒక్కొక్క జిల్లాకు 25 కోట్ల చొప్పున కేటాయించారు. ఇన్‌ఫార్మర్ల వ్యవస్థను ఏర్పాటు చేయడానికీ, కోవర్టు కుట్రలకు లక్షలాది రూపాయల ప్రజా ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ నాయకత్వ నిర్మూలనకు ప్రత్యేకంగా కేంద్రీకరిస్తున్నారు. విప్లవోద్యమంపైన, విప్లవ సిద్ధాంతం పైన, నాయకత్వం పైన పెద్ద ఎత్తున అసత్య ప్రచారానికి పూనుకున్నారు. ఈ రకమైన మానసిక యుద్ధానికి ప్రత్యేకమైన విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎ.పి., ఎన్.టి. ఉద్యమాలు తీవ్రంగా దెబ్బతిన్న పరిస్థితులలో, ఎ.ఒ.బి.లో విశాఖ, ఈస్టు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో ప్రభుత్వ దాడి మునుపెన్నడూ లేనంత స్థాయిలో తీవ్రతరం అయింది. రెండు సంవత్సరాలలో ఎ.పి.ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా చేస్తామని 2006లోనే డి.జి.పి. నుండి కింది స్థాయి పోలీసు అధికారుల వరకు ప్రకటించారు. అయితే పార్టీ నాయకత్వంలో

ప్రజలు, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం, దోపిడీ వర్గాల దాడిని వీరోచితంగా తిప్పికొడ్తూ, దోపిడీ ప్రభుత్వాల అంచనాలను తలకిందులు చేస్తున్నారు.

## పురోగమిస్తున్న ప్రజాయుద్ధం

దోపిడీ పాలక వర్గాలు విప్లవోద్యమ పురోగమనాన్ని నిరోధించాలని, ప్రారంభం నుండి ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ, అది రాజ్యాధికార లక్ష్యంతో అలలు, అలలుగా పురోగమిస్తున్నది. ప్రజలు తాము పోరాడి సాధించుకున్న హక్కుల్ని, విజయాల్ని పరిరక్షించుకోవడానికి సాయుధమవుతున్నారు. ప్రజా సైన్యం లేకుండా ప్రజలకు ఒరిగేది ఏమీ లేదనే చారిత్రక సత్యాన్ని తమ స్వీయ అనుభవం నుండి గ్రహించిన ఆదివాసీ రైతాంగం, మిలీషియాగా సంఘటిత పడుతున్నారు. గెరిల్లా దళాలలో చేరుతున్నారు. సాయుధ బలగాలకు వ్యతిరేకంగా ఎన్నో ప్రతిఘటనా చర్యలు చేపట్టారు. గ్రామాలపైకి దాడులకు వచ్చిన ఖాకీ మూకలను తన్ని తరిమారు. పదులకొలది గ్రామాలలో ప్రజలు సామూహికంగా తిరగబడి పోలీసు అఘాయిత్యాలకు బుద్ధి చెప్పడమే కాకుండా, తమ సంఘ నాయకత్వాన్ని రక్షించుకున్నారు. గెరిల్లా దళాలు ప్రజల మద్దతుతో వందలాది మంది ఇన్‌ఫార్మర్లను, ప్రజా శత్రువుల్ని ఖతం చేసాయి. ప్రభుత్వ సాయుధ బలగాలను నిర్మూలించి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాయి.

గత దశాబ్ద కాలంలో పి.ఎల్.జి.ఎ.ని అభివృద్ధి చేయడంలో భాగంగా సైన్యంలోకి భర్తీని పెంచాము. కేంద్ర రీజనల్ కమాండ్ బలగాలతో పాటు స్థానిక బలగాలు అనేక యుద్ధ చర్యల్లో పాల్గొన్నాయి. కొన్ని చర్యలను స్వతంత్రంగా నిర్వహించాయి. ఈ పదేళ్ల కాలంలో ఉమ్మడిగానూ, విడివిడిగానూ అనేక రెయిడ్లు, ఆంబుష్‌లను నిర్వహించాయి. మారేడుమిల్లి, చింతవారి పాలెం, బెజ్జంకివాడ, తెల్లరాయి, బలిమెల, పాలూరు, మంత్రియాంబ, గొట్లభద్ర, పోతకల్, పోలవరం, గునికిరాళ్ల, లక్ష్మీ పురం, చిన అంటిజ్వాల తదితర ఆంబుష్‌లలో 123 మంది శత్రు సాయుధ బలగాలను నిర్మూలించి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాము. బలిమెల, కలిమెల ఆంబుష్‌లు శత్రుదూకుడును అదుపు చేయడమే కాకుండా, ప్రజల్లో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించాయి. ఈ విజయోత్సాహంతో ఈస్టు డివిజన్‌లో వందలాది మంది ప్రజలు కదిలి ఆర్.వి.నగర్ ప్రాంతంలోని కాఫీ ప్లాంటేషన్‌ను ఆక్రమించారు. జూలై 28 అమరవీరుల వారోత్సవాల సందర్భంగా వందలాది స్థూపాలను నిర్మించారు. ఈ ఆంబుష్‌లతో పాటుగా కలిమెల, మోటు, ఉప్పలాడ, సాలూరు, అనకాపల్లి, చోడవరం, కోరాపుట్, ఎం.వి.-79, సీలేరు, కూనేరు, ఆర్. ఉదయగిరి, నయాగఢ్, దామన్‌జోడి, సీలేరు, పాటేర్‌లలో రెయిడ్లు నిర్వహించి శత్రు సాయుధ బలగాలకు చెందిన 46 మందిని నిర్మూలించి, 969 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. కోరాపుట్, నయాగఢ్ రెయిడ్లు దేశ విప్లవోద్యమ చరిత్రలోనే అతిపెద్ద సాహసిక దాడులుగా నిలిచిపోయాయి. గత పది సంవత్సరాలుగా ప్రజలూ, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం చేపట్టిన పోరాటాలు, సైనిక దాడులతో దోపిడీ వ్యవస్థలు బీటలు వారాయి. ప్రజాస్వామ్యం దిశగా సామాజిక సంబంధాలలో నూతన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. స్వావలంబన లక్ష్యంగా విప్లవకర ప్రజా కమిటీలు నిర్మితమవుతున్నాయి. ముఖ్యంగా ప్రజల భాగస్వామ్యంతో కూడిన ప్రజాస్వామ్యం దిశగా విప్లవోద్యమం ముందుకు అడుగులు వేస్తున్నది.

## మార్గమధ్యంలో అవరోధాలు - అపజయాలు

ఈ సుదీర్ఘ క్రమంలో విప్లవోద్యమం కొన్ని విజయాలను సాధించింది. ఆ మేరకు ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక జీవితంలో విప్లవకర మార్పులను తెచ్చింది. మరో వైపు బలమైన శత్రువు తమ అధికారాన్ని ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి చేసిన ప్రయత్నాలలో మనం కొన్ని నష్టాలకు గురైనాము. ఓటములను చవిచూసాము. ఆమేరకు మన పురోగమనం మరిన్ని కష్టాలతోను త్యాగాలతోను నిండి వుంటుంది. ముఖ్యంగా ఎ.పి.లో శత్రువు ఎల్.ఐ.సి. వ్యూహంలో భాగంగా తలపెట్టిన బహుముఖ దాడిని తిప్పికొట్టడంలో విఫలమైనాము. దోపిడీ ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో ప్రజలను విప్లవోద్యమం నుండి పక్కదారి పట్టించేందుకు ముందుకు తెస్తున్న సంస్కరణలు, సంక్షేమ పథకాలను ప్రజలకు లోతుగా అర్థం చేయించలేక పోయాము. ఇన్‌ఫార్మర్లు, కోవర్టులు, కౌన్సిలింగ్‌లు, మానసిక యుద్ధం వంటి పలురూపాలలో జరుగుతున్న ప్రభుత్వ దాడులను, బహుముఖంగా తిప్పికొట్టలేకపోయాము. శత్రువు ప్రధానంగా కౌంటర్ ఇన్‌సర్జన్సీ సిద్ధాంతంపై ఆధారపడి తీవ్రతరం చేస్తున్న సైనిక దాడిని శక్తివంతంగా తిప్పికొట్టడంలో కొన్ని వైఫల్యాలను ఎదుర్కొన్నాము. ఫలితంగా స్వీయాత్మక శక్తులను నష్టపోయాము. ఉద్యమ ప్రాంతాన్ని కొంత కోల్పోవలసి వచ్చింది. ఈ పరిస్థితిని సమీక్షించుకుని 2007లో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లో ఉద్యమం తాత్కాలికంగా వెనకపట్టు పట్టిందని విశ్లేషించుకున్నాము. అయితే ఈ అపజయాలు, అవరోధాలు మన సుదీర్ఘమైన ప్రయాణంలోని 'మార్గంలోని కఠినమైన మలువుల' వంటివని దృష్టిలో వుంచుకోవాలి. అందుకే కామ్రేడ్ మావో 'ప్రజా యుద్ధ మార్గం గెలుపు, ఓటమి; గెలుపు, ఓటమి; అంతిమంగా గెలుపు' అంటూ విశ్లేషించాడు.

# ప్రభుత్వ వ్యతిరేకతను వెల్లడిస్తున్న అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు

నాలుగు రాష్ట్రాలూ, ఒక కేంద్ర పాలిత ప్రాంతం–పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరి–లో అసెంబ్లీలకు జరిగిన ఎన్నికలలో అసోం మినహా మిగతా నాలుగు చోట్లా అధికారం చేతులు మారింది. అధికార పార్టీలను గద్దె దించి ప్రజలు ప్రభుత్వ వ్యతిరేకతను చాటారు. 65 యేళ్ల 'స్వతంత్ర పాలన'లో ప్రజలు రోజు రోజుకూ పార్లమెంటరీ వ్యవస్థ పట్ల భ్రమల్ని కోల్పోతున్నారు. అధికారంలోకి ఏ పార్టీ వచ్చినా తమకు ఒరిగేది ఏమీ లేదని స్పష్టంగానే గ్రహించారు. మావోయిస్టు పార్టీ బలంగా వున్న చోట ఎన్నికలను బహిష్కరిస్తున్నారు. విప్లవ పార్టీ బలహీనంగా వున్న చోట ప్రస్తుత ప్రభుత్వం పట్ల ఆగ్రహాన్ని ప్రతిపక్షానికి ఓటు వేయడం ద్వారా చాటుకుంటున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కూడా ప్రధానంగా ఈ ధోరణే కనబడింది. ఈ ఎన్నికల్లో విశేషంగా చెప్పుకోవాల్సినది పశ్చిమ బెంగాల్లో రివిజనిస్టుల పాలన కుప్పకూలడం.

1977లో పశ్చిమ బెంగాల్లో సి.పి.ఐ.(ఎం) అధికారంలోకి వచ్చింది. అప్పటి నుండి నిరంతరాయంగా 34 యేళ్ల పాటు చెలాయించిన అధికారం కుప్పకూలింది. అయితే ఇందులో ఊహించనిదీ, ఆశ్చర్యకరమైనది ఏమీ లేదు. పశ్చిమ బెంగాల్లో రోజు రోజుకూ పెరుగుతూ వచ్చిన సోషల్ ఫాసిజం బుద్ధదేవ్ పాలనలో పరాకాష్టకు చేరింది. ఈ కారణంగా ఈసారి సి.పి.ఎం. ఓటమి, మమత గెలుపు ఖాయమని అందరూ ఊహించినదే.

త్రుణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్, ఎస్.యు.ఎస్.ఐ., లతో ఏర్పడిన త్రుణమూల్ కాంగ్రెస్ కూటమి 294 అసెంబ్లీ స్థానాల్లో, 227 స్థానాలను గెలుచుకుంది. ఇందులో త్రుణమూల్ కాంగ్రెస్ 184 స్థానాలను గెలుచుకొని స్వతంత్రంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీని సాధించింది. కాగా సిపిఐ (ఎం) కూటమి 62 స్థానాల్లో మాత్రమే గెలుపొంది ఘోర పరాజయం పాలయింది. ఇందులో సిపిఐ (ఎం)కు స్వతంత్రంగా దక్కినవి 40 సీట్లు మాత్రమే. విశేషంగా చెప్పుకోవాల్సిన విషయం ఏంటంటే బుద్ధదేవ్ వ్యక్తిగతంగా కూడా ఓడిపోవడం. ముఖ్యమంత్రి కుర్చీలో వుండగానే ఓడిపోవడం అనేది ఒక అరుదైన విషయం. దీన్ని బట్టి బుద్ధదేవ్ వ్యక్తిగతంగా కూడా ఎంత ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకున్నాడో అర్థం చేసుకోవచ్చు. బుద్ధదేవే కాదు ఇద్దరు మంత్రులు మినహా మిగతా మంత్రులంతా ఓడిపోయారు. వ్యవసాయం, ఆర్థికం, పరిశ్రమలు మొదలైన కీలక శాఖలను నిర్వహించిన మంత్రులందరూ ఓడిపోవడాన్ని బట్టి పాలక విధానాలను ప్రజలు ఎంతగా వ్యతిరేకించారో అర్థం చేసుకోవచ్చు.

తమిళనాడులో 84 నుండి ప్రతి అయిదేళ్లకోసారి అధికారం డీఎంకే, ఏఐడీఎంకేల మధ్య మారుతూ వస్తోంది. 2006లో మాత్రమే ఈ క్రమం తప్పి, డిఎంకె రెండవసారి అధికారంలోకి వచ్చింది. ఈసారి కూడా పాత సాంప్రదాయం కొనసాగి ప్రతిపక్షంలో ఎఐడిఎంకె అధికారంలోకి వచ్చింది. అయితే గత పదేళ్లుగా అధికారం వెలగబెట్టిన డిఎంకె ప్రతిపక్ష అర్హతను కూడా కోల్పోయేంత ఘోర పరాజయం పాలయింది.

234 స్థానాలు వున్న తమిళనాడు అసెంబ్లీలో 202 స్థానాలను ఏఐడీఎంకే గెలుచుకోగా, డి.ఎం.కె. 31 స్థానాలకు మాత్రమే పరిమితమైంది. 165 స్థానాలకు సొంతంగా పోటీ చేసిన ఏఐడీఎంకే 150 స్థానాలను తన ఖాతాలో వేసుకోగా, సొంతంగా 123 స్థానాలకు పోటీ చేసిన డీఎంకే 23 స్థానాలను మాత్రమే గెలుచుకొని ప్రతిపక్ష హోదాకు కూడా అర్హతను కోల్పోయింది. 41 స్థానాలకు పోటీచేసిన ఏఐడీఎంకే కూటమిలోని డీఎండీకే 29 స్థానాలను గెలుచుకొని ప్రతిపక్ష హోదాను సంపాదించింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకే కూటమికి చెంది వుండడం ఇక్కడ విశేషం. 2జి స్పెక్ట్రమ్ ప్రకంపనల నేపథ్యంలో ఈ ఫలితాలు ఆశ్చర్యమేమీ కాదు.

---

నేడు ప్రపంచంలోని మౌలిక వైరుధ్యాలు రోజు రోజుకూ తీవ్రమవుతున్నాయి. అరబ్ ప్రపంచంలో సామ్రాజ్యవాదులకూ, వారి తైనాతీలకు వ్యతిరేకంగా జరుగుతున్న గొప్ప ప్రజా తిరుగుబాట్లు నేటి విప్లవ పరిస్థితిని ప్రతిబింబిస్తున్నాయి. ఈ వస్తుగత స్థితిని అందుకోవడానికి మరింత తెగించి పోరాడాలి. అందుకు ఈ దశాబ్ది వార్షికోత్సవాల సందర్భంగా అమర వీరులు మనకందించిన స్ఫూర్తితో విప్లవ విజయానికి పునరంకితం కావాలి.

అయితే ఇక్కడ మన 'ప్రజాస్వామ్యపు' 'గొప్పతనం' గురించి కొంత చెప్పుకోవాల్సి వుంటుంది. అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నప్పటికీ మరోసారి మాకే అధికారం కట్టబెట్టమని కోరుతూ ప్రజల ముందుకు కరుణానిధి నిస్సిగ్గుగా రాగలిగాడు. వాగ్దానాలు కురిపించి మరోసారి తేలిగ్గా ప్రజలను మోసం చేయొచ్చని భావించాడు. అందుకే తను కురిపించని వాగ్దానం లేదు. విద్యార్థులందరికీ ఉచితంగా ల్యాప్‌టాప్‌లూ, ప్రతి ఇంటికీ ఉచితంగా కలర్ టీవీ, ప్రతి గృహిణికి మిక్సీ, గ్రైండర్, గర్భిణులకు 10 వేల ప్రసూతి ఖర్చులూ, మహిళా ఉద్యోగినులకు ఆరు నెలల ప్రసూతి సెలవు, రూపాయికే కిలో బియ్యం, నిరుపేదలకు ఉచితంగా 30 కిలోల బియ్యం, వృద్ధులకు ఉచిత బస్‌పాస్‌లు ఇలా అన్ని సెక్షన్ల వారికీ తాయిలాల ఆశ చూపిస్తే మరోసారి తనకు అధికారం కట్టబెడతారనుకున్నాడు. జయలలిత కూడా వాగ్దానాలలో ఏమాత్రం తీసిపోలేదు. దాదాపు వీటన్నింటితో పాటు పేద యువతులకు వివాహ సమయంలో అరతులం బంగారంతో మంగళసూత్రాలనూ, ఉచిత కేబుల్ టీవీ ప్రసారాలను కూడా ఆశచూపింది. జయ వాగ్దానాలు నెరవేరాలంటే ఖజానాపై 50 వేల కోట్ల నుండి 2 లక్షల 50 వేల కోట్ల భారం పడుతుందని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. డీఎంకే అవినీతిలో కూరుకుపోయి తీవ్రంగా అపఖ్యాతి పాలయి వున్న స్థితిలో దాని అవినీతిని వేలెత్తి చూపి ఓట్లడిగి వుండవచ్చు జయలలిత. కానీ ఆమె ఆ పని చేయకపోగా మరిన్ని వాగ్దానాలు కురిపించింది. కారణం ఎదుటి వాళ్ల అవినీతిని ఎత్తి చూపేంత సచ్ఛరిత ఆమెకు కూడా లేకపోవడం, అవినీతి కేసులో జైలు జీవితం గడిపిన అనుభవం వుండడం. వాగ్దానాల ఎర చూపి కరుణానిధి మళ్లీ ఓట్లడిగే ధైర్యం ఎలా చేశాడు? వాగ్దానాల జోలికి పోకుండా ఓట్లడిగే ధైర్యం జయలలిత ఎందుకు చేయలేకపోయింది? ఈ ప్రశ్నలు వేసుకుంటే మన ప్రజాస్వామ్యపు దుస్థితి భూతద్దంలో కనిపిస్తుంది. ప్రజాస్వామ్యం మీద వాళ్లిద్దరికీ విశ్వాసం లేదు. ప్రజలు ఎన్నికలను తమ జీవితాల్లో మార్పు తీసుకురాగల ఒక ముఖ్యమైన ప్రక్రియగా భావించడం లేదని వాళ్లిద్దరికీ తెల్సు, ఆ మాటకొస్తే అందరికీ తెల్సు. లేకుంటే అవినీతితో ఇంతగా భ్రష్టు పట్టిన పాలకులకు మరోసారి ప్రజలు పట్టం కడతారని అనుకోరు. కనుక తాత్కాలిక ప్రయోజనాలు చేకూర్చే కొన్ని తాయిలాలను ఎరచూపి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నారు. రాగలమని కూడా ధీమా ప్రదర్శిస్తున్నారు. ఇక్కడ మన 'ప్రజాస్వామ్యం' అభాసుపాలవుతున్న మరో అంశం కూడా వుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా డబ్బులో, వస్తువులో పంచితే ఎన్నికల నియమావళి ప్రకారం అది నేరం. కానీ ఎన్నికల సమయంలో పంచకుండా గెలిచాక పంచుతామని హామీలివ్వడం, గెలిచాక పంచడమూ మాత్రమూ ఏ నేరమూ కాకపోవడం ఆశ్చర్యకరం. ప్రజాస్వామ్యంలోని ఈ తిరకాసును ఎలా అర్థం చేసుకోవాలో!

దేశంలోనే అతి పెద్దదైన 2జి స్పెక్ట్రమ్ కుంభకోణాన్ని తమిళనాడు ప్రజలు తీవ్రంగానే పరిగణించారు. అవినీతికి పాల్పడిన డిఎంకె కేంద్ర మంత్రి ఎ.రాజాకు కొమ్ము కాసి కరుణానిధి మరింత ఏవగింపుకి గురయ్యాడు. కరుణానిధి కుటుంబ సభ్యులు అవినీతికి పాల్పడ్డానికీ, ఆస్తులు పెంచుకోవడానికీ అధికారాన్ని అడ్డం పెట్టుకోవడం, దీనికి పరాకాష్టగా 2జి స్పెక్ట్రమ్ కుంభకోణంలో, కనిమొళి ప్రమేయం కూడా బహిర్గతం కావడం డిఎంకె విజయావకాశాలను మరింత దెబ్బతీసింది. యుపిఎ రెండవ సారి అధికారంలోకి వచ్చినప్పటి నుండీ రోజు రోజుకూ బయట పడుతున్న అవినీతి కుంభకోణాలూ, ప్రజా సమస్యలనేవీ పట్టించుకోకపోవడం వల్ల యుపిఎ మీదా, అందులో ప్రధాన పార్టీ అయిన కాంగ్రెస్ మీద పెరుగుతున్న వ్యతిరేకత కూడా డిఎంకె కూటమికి నష్టం చేసింది. 63 స్థానాలకు పోటీ చేసి 5 స్థానాలను మాత్రమే గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ డీఎంకే కూటమి ఘోర పరాజయానికి శాయశక్తులా దోహదం చేసినట్టు.

గెలుపు అవకాశాల పట్ల పెద్దగా నమ్మకం లేని డిఎంకె సగాని కంటే ఒక్క స్థానం మాత్రమే అధికంగా తాను వుంచుకొని మిగతా స్థానాలన్నింటినీ మిత్రపక్షాలకే ఇచ్చింది. ఈ ఎత్తుగడ కూడా ఫలించలేదు.

మొత్తంగా డీఎంకే పట్ల కలిగిన విరక్తి జయలలితకు విజయాన్ని చేకూర్చింది. సినీ నటుడు విజయ్‌కాంత్ పార్టీ డీఎండీకేతో జయలలిత పొత్తు పెట్టుకోవడం కూడా ఆమెకు కలిసి వచ్చింది. ప్రజలకు మరో ప్రత్యామ్నాయం లేకపోవడం వలన డీఎంకే పాల్పడిన తాజా అవినీతి, జయలలిత పాత అవినీతిని తాత్కాలికంగా కనుమరుగుచేసింది.

అవినీతితో భ్రష్టు పట్టిన రెండు కూటములు ఇక్కడ పోటీ పడుతుండగా, ఈ రెండింటికీ వ్యతిరేకంగా, అవినీతి వ్యతిరేక పార్టీనని చెప్పుకునే లోక్‌సత్తా 50 స్థానాల్లో పోటీ చేసింది. కానీ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేక పోయింది. ఎన్నికల 'ప్రజాస్వామ్యం'లో ధన, కండబలాలే నిర్ణయాత్మక పాత్రను వహిస్తాయని లోక్‌సత్తా ఇప్పటికైనా తెలుసుకుంటే మంచిది.

ప్రతి అయిదేళ్లకోసారి అధికారం మారే సాంప్రదాయం ఈసారి కూడా కేరళలో కొనసాగింది. 140 స్థానాలకు గాను బొటాబొటిగా 72 స్థానాలను గెల్చుకున్న యుడిఎఫ్ అధికారంలోకి వచ్చింది.

బెంగాల్లో చిత్తుగా ఓడిపోయిన లెఫ్ట్ కూటమి కేరళలో మాత్రం 68 స్థానాలతో గెలిచి గట్టి పోటీనివ్వగలగడం విశేషమే. ఇలా గట్టి పోటీనిచ్చి బలమైన ప్రతిపక్షంగా నిలవడంలో వామపక్షాల గొప్పదనం కన్నా ఇప్పటిదాకా ముఖ్యమంత్రిగా పనిచేసిన అచ్యుతానందన్‌కు వున్న ప్రజాదరణే కారణం.

మిగతా నాలుగు చోట్ల అధికారాలు మారినా అసోంలో మాత్రం అధికార కాంగ్రెస్ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. తరుణ్ గొగోయ్ వరసగా మూడోసారి ముఖ్యమంత్రి అయ్యాడు. మొత్తం 126 స్థానాల్లో 78 స్థానాలను కాంగ్రెస్ గెల్చుకోగలిగింది. గత అయిదేళ్ల పాలనలో అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ, ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ తిరిగి అధికారంలోకి రాగలిగాడు. తరుణ్ గొగోయ్ అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్రంలో అశాంతి నెలకొని వుంది. అభివృద్ధిలో చాలా వెనుకబడి వుంది. శాంతిని నెలకొల్పాడనీ, ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దాడని అతనికి పేరుంది. ఉల్ఫాతో చర్చలకు పిలుపునివ్వడం, బోడో ల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్‌తో ఏర్పరుచుకున్న మైత్రి కూడా అతనికి సానుకూల పరిస్థితిని కలిపించాయి. వీటికి తోడు అవినీతి, అనైక్యతల కారణంగా ప్రతిపక్షం అయిన అసోం గణ పరిషత్ బద్‌నాం అయి ప్రజాదరణను కోల్పోవడం, గతంలో కూటమిగా ఏర్పడి పోటీ చేసిన ఎ.జి.పి., బి.జె.పి.లు ఈసారి అనైక్యత వల్ల విడివిడిగా పోటీ చేయడం మొదలైనవన్నీ కాంగ్రెస్‌కు కలిసి వచ్చాయి.

పుదుచ్చేరిలో రంగస్వామి నేతృత్వంలో ఎన్నికల ముందే ఆవిర్భవించిన ఆలిండియా నమదు రాజ్యం కాంగ్రెస్ (ఎ.ఐ.ఎన్.ఆర్.సి.) అధికారంలోకి వచ్చింది. మొత్తం 30 స్థానాల్లో ఎ.ఐ.ఎన్.ఆర్.సి. 15 స్థానాలు గెల్చుకోగా, దాని మిత్ర పక్షం ఎ.ఐ.డి.ఎం.కె. అయిదు స్థానాలను గెల్చుకుంది. కాంగ్రెస్, డి.ఎం.కె.ల కూటమి తొమ్మిది స్థానాలను మాత్రమే గెల్చుకొని ప్రతిపక్షంలో కూర్చుంది. గతంలో కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రిగా పనిచేసిన రంగస్వామిని రెండేళ్ల క్రితం కాంగ్రెస్ అధిష్టానం దించేసింది. ఈసారి అభ్యర్థిగా కూడా ఆయనకు అవకాశం ఇవ్వకపోవడంతో ఎన్నికల ముందు కాంగ్రెస్ నుండి చీలిపోయి కొత్త పార్టీని స్థాపించి మాతృపార్టీని చావు దెబ్బతీసాడు. తమిళనాడులో వలెనే ఇక్కడ కూడా కాంగ్రెస్, డి.ఎం.కె.ల కూటమిని ప్రజలు వ్యతిరేకించారు. ఈ కూటమి మీద వున్న వ్యతిరేకత కాంగ్రెస్ పార్టీపై తిరగబడిన రంగస్వామికి అనుకూలించింది. నిరాడంబరుడిగా ఆయనకున్న పేరు కూడా దోహదపడింది.

ఆంధ్రప్రదేశ్‌లో కడప లోక్‌సభ, పులివెందుల అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఊహించినట్లుగానే వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు, అది కూడా భారీ మెజారిటీతో. కడప జిల్లాపై జగన్‌కు వున్న పట్టు, కుమ్మరించిన డబ్బు సంచులకు సానుభూతి కూడా తోడయింది. దీనికి తోడు కాంగ్రెస్, టిడిపిలపై పెరుగుతున్న అసంతృప్తులు కూడా జగన్ పార్టీకి ఉపయోగపడ్డాయి.

ఏ వొక్క మినహాయింపు లేకుండా అన్ని పార్టీలు కూటములుగా ఏర్పడి ఎన్నికలకు దిగడం అనే సాంప్రదాయం కేంద్రంలోనే కాకుండా అన్ని రాష్ట్రాల్లోనూ ఒక సర్వసాధారణ అంశంగా ఎప్పుడో మారిపోయింది. జాతీయపార్టీలుగా చెప్పుకుంటున్న పార్టీల పరిస్థితి మరింత దీనంగానే వుంది. బెంగాల్, తమిళనాడుల్లో, పుదుచ్చేరిలలో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగినంత మెజారిటీ ప్రాంతీయపార్టీలు సాధించాయి గానీ, జాతీయపార్టీలు ఈ విషయంలో చాలా వెనుకబడి వున్నాయి. అయిదు చోట్ల జరిగిన ఎన్నికల్లో మూడు చోట్ల తమ కూటమే అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ బయటకి సంతృప్తిని వ్యక్తం చేస్తోంది గానీ, అది నిజంగా నిలబెట్టుకోగలిగింది అసోంలో మాత్రమే. కేరళలో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ అది సాధించింది బొటాబొటి మెజారిటీనే. ఇంకా చెప్పాలంటే ఓడిపోయిన ఎల్.డి.ఎఫ్.లోని ప్రధాన పక్షం సి.పి.ఎం. 45 స్థానాలు గెల్చుకోగా, కాంగ్రెస్ 38 స్థానాలను మాత్రమే గెల్చుకొని స్థానాల పట్టికలో రెండో స్థానంలోనే వుంది. 2001లో అధికారంలోకి వచ్చినపుడు అది 68 స్థానాలను గెలుచుకుందని గుర్తు తెచ్చుకుంటే, ఈసారి ఎంత బలహీనపడిందో అర్థం చేసుకోవచ్చు. బెంగాల్లోనూ, తమిళనాడులోనూ సొంతంగా ప్రతిపక్ష పాత్ర వహించే స్థానాన్ని కూడా అది కోల్పోయింది. బెంగాల్లో ఇటీవలి కాలంలో త్రుణమూల్ ప్రతిపక్షంగా వ్యవహరిస్తుండగా, తమిళనాడులో రెండు ప్రధాన ప్రాంతీయ పార్టీలైన డి.ఎం.కె., ఎ.ఐ.డి.ఎం.కె.లే సుదీర్ఘకాలంగా అధికార, ప్రతిపక్ష పార్టీలుగా వ్యవహరిస్తున్నాయి. తమిళనాడులో 1967లో అన్నాదురై అధికారంలోకి వచ్చినప్పటి నుండి కాంగ్రెస్ కోలుకోలేదు. ఇలా కొన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయపార్టీలకు తోకగానే కాంగ్రెస్ మారిపోయింది. ఈ పరిస్థితి సమీప భవిష్యత్‌లో మారే అవకాశాలేమీ లేవు. త్రుణమూల్ పుణ్యమాని బెంగాల్లో గెలుపు కూటమిలో స్థానం పొందగలిగినా, కాంగ్రెస్ దుస్థితి ఎన్నికల ముందే బయటపడింది. మమత విదిల్చిన స్థానాలకు మాత్రమే అది పరిమితమయింది. కాంగ్రెస్ దేబిరించడమే తప్ప అదనంగా ఒక్క సీటును కూడా డిమాండ్ చేయగలిగే స్థితిలో లేదు. కాంగ్రెస్ ఏ చిన్న పేచీ పెట్టినా మమత సొంతంగా పోటీ చేయడానికే సిద్ధపడింది. అంటే కాంగ్రెస్ వల్ల తమకు పెద్ద ఒరిగేదేమీ లేదని ఆమె ఉద్దేశం. కానీ కాంగ్రెస్ మాత్రం త్రుణమూల్ అండను కోల్పోదలుచుకోలేదు.

# సోషల్ ఫాసిస్టు పాలనను గద్దె దించిన పశ్చిమ బెంగాల్ ప్రజలు

పశ్చిమ బెంగాల్లో కొనసాగిన వామపక్షాల నిరంకుశ పాలన కుప్పకూలడానికి వున్న చారిత్రక ప్రాధాన్యతరీత్యా ఈ ఘోర పరాజయానికి దారితీసిన పరిస్థితులను వివరంగా విశ్లేషించుకోవాల్సి వుంటుంది.

2006లో ఆల్‌టైం రికార్డ్ మెజారిటీతో బుద్ధదేవ్‌కు అధికారాన్ని కట్టబెట్టిన బెంగాల్ ప్రజలు ఈ ఎన్నికల్లో కనీసం అతన్ని ప్రతిపక్ష నేతగానో, శాసన సభ్యుడిగానో కూడా అంగీకరించలేదు.

బుద్ధదేవ్ మూల సిద్ధాంతాలకు తిలోదకాలు ఇవ్వడం వలన సిపిఐ (ఎం) ఓటమి పాలయిందని పలువురు విశ్లేషించారు. కానీ ఈ పార్టీ కొత్తగా బుద్ధదేవ్ పాలనలోనే మూల సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చిందేమీ లేదు. అది ఎన్నడో ఆ పనిచేసింది. అది మూల సిద్ధాంతాలకు తిలోదకాలివ్వడం వల్లనే దేశంలో నక్సలైట్ ఉద్యమం చారిత్రక రంగం మీదికి రావల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

1977లో అధికారంలోకి వచ్చిన సిపిఐ (ఎం) భూసంస్కరణలను ఒక మేరకు అమలు చేసి ప్రజల్లో కొన్ని భ్రమలను కల్పించగలిగింది. మూడంచెల పంచాయితీ వ్యవస్థ ద్వారా అధికార వికేంద్రీకరణను అమలు చేసి స్థానిక ప్రభుత్వాలకు ప్రాధాన్యతను ఇవ్వడం కూడా ప్రజల ఆమోదాన్ని పొందింది. అయితే సిపిఐ (ఎం) ప్రవేశపెట్టిన ఈ విధానాలేవీ ప్రజల జీవితాల్లో మౌలిక మార్పులను తీసుకురాలేక పోయాయి. ప్రభుత్వ గణాంకాలే ఈ విషయాన్ని చాటుతున్నాయి.

34 యేళ్ల 'కమ్యూనిస్టు' పాలన తర్వాత కూడా ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలో 24.7 శాతం ప్రజలు దారిద్ర్యరేఖ కింద బతుకులీడుస్తున్నారు. నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం ప్రతి ఏటా కొన్ని నెలల పాటు గ్రామీణ కుటుంబాలకు ఆహారం

---

జాతీయపార్టీగా తన ప్రాభవాన్ని ఎన్నడో కోల్పోయిన బి.జె.పి. పరిస్థితి ఈ ఎన్నికలలోనూ ఏమీ మారలేదు. మూడవ పెద్ద జాతీయ పార్టీగా గుర్తింపు వున్న సి.పి.ఎం. పరిస్థితి ఈ ఎన్నికల్లో ఘోరంగా దిగజారింది.

ఈ అయిదుచోట్లా మొత్తంగా 824 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 170 స్థానాలను, అంటే 20 శాతాన్ని కాంగ్రెస్ గెల్చుకోగా, బిజెపి ఒక్క అసోంలో కేవలం అయిదు సీట్లను గెల్చుకోగల్గింది. అంటే ఒక్క శాతం సీట్లను కూడా పొందలేకపోయింది.

ఈ ఎన్నికలు ప్రజాభిప్రాయాన్ని సంపూర్ణంగా ప్రతిబింబించేవేమీ కాదు. ధనబలం, కండబలం, ఓటర్లను భ్రమలు, ప్రలోభాల్లో ముంచెత్తడం ఇవన్నీ ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసేవే. ఎన్నికల తంతును నిర్వహించడమే ప్రజాస్వామ్యానికి నిర్వచనంలా పాలకులు చెప్తుంటారు. కానీ ఈ ఎన్నికల ప్రక్రియ అడుగడుగునా ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తూనే వుంటుంది.

ఈ ఎన్నికలను సక్రమంగా నిర్వహించి 'ప్రజాస్వామ్యాన్ని' కాపాడ్డానికి ప్రభుత్వం 800 కంపెనీల పారా మిలిటరీ బలగాలను దించింది. ఒక్క పశ్చిమ బెంగాల్‌లోనే 600 కంపెనీల బలగాలను దించింది. కొన్ని కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. పోటీ చేసిన పార్టీలు మరెన్నో కోట్లను మంచి నీళ్ల ప్రాయంగా ఖర్చు చేశాయి.

ఈ 'ప్రజాస్వామ్యం' పట్లా, దాని ఏకైక లక్షణంగా మిగిలున్న ఎన్నికల పట్లా గణనీయ శాతపు ప్రజలు నిరాసక్తతను చూపుతున్నారు. 50,60 శాతం ఓట్లు పోలవడమే గొప్పగా పరిగణించబడుతోంది. ఎక్కువ శాతం చూపుతున్న ఓటింగ్, రిగ్గింగ్ తదితర పద్ధతుల ద్వారా పెంచుకున్నదే. ఉద్యమ ప్రాంతాల్లో ప్రజలు ఎన్నికలను బహిష్కరిస్తున్నారు. ఈ బహిష్కార హక్కును కాలరాయడం కోసం పోలీసులను ప్రయోగించి భయానక వాతావరణాన్ని కల్పిస్తున్నారు. ఇదంతా ప్రజాస్వామ్య పరిరక్షణే! అయినా ప్రజలు నిర్బంధాన్ని ధిక్కరించి బూటకపు ఎన్నికలను బహిష్కరిస్తున్నారు.

బెంగాల్‌లో నిరంకుశ పాలనకు తమిళనాడులో అవినీతికి వ్యతిరేకంగా ప్రజల తీర్పు చూస్తే ప్రజలు పాలక వర్గాల విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం అవుతూ, ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని అర్థం అవుతోంది. అందుకే దేశంలో ఒకవైపు పెద్ద ఎత్తున ప్రజాందోళనలు మిలిటెంట్ రూపం తీసుకుంటున్నాయి.

ఇలా పోరాడుతున్న ప్రజలు దేశంలో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో భూస్వాములకూ, దళారీ నిరంకుశ బూర్జువాలకూ, సామ్రాజ్యవాదులకూ వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ఐక్యం కావాలి. ఈ బూటకపు ప్రజాస్వామ్యాన్ని కాలదన్ని నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించుకోవాలి.

అందుబాటులో లేకపోవడంలో బెంగాల్‌దే అగ్రస్థానం. బాగా వెనుకబడిన రాష్ట్రంగా పేరుపొందిన, కలహండి వంటి కరువు, ఆకలి బాధిత జిల్లాలను కల్గి వున్న ఒడిశాలో ఇటువంటి కుటుంబాలు 4.8 శాతం వుండగా, భూ సంస్కరణలను అమలుచేశామని గొప్పలు చెప్పుకునే ఈ కమ్యూనిస్టుల 'కంచుకోట'లో అటువంటి కుటుంబాలు 10.6 శాతం వున్నాయి. 1995 నుండి వ్యవసాయ వృద్ధి రేటు 2.67 శాతానికి పడిపోయింది. 49 శాతం భూములు వర్షాధారంగా వుండడం దీనికి ప్రధాన కారణం. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సరాఫరా చేయడంలోనూ లెఫ్ట్ పాలన విఫలమైంది. దేశంలో సగటు ఉపాధి రేటు 2.5 శాతం వుండగా బెంగాల్లో 0.9 శాతమే వుంది. విద్యా, వైద్యం పరిస్థితి కూడా ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. మధ్యలో బడిమానేసే వారి సంఖ్య ఇక్కడ అధికంగానే వుంది. గణాంకాల ప్రకారం దేశంలో 2,083 మంది రోగులకు ఒక డాక్టర్ అందుబాటులో వుండగా, పశ్చిమ బెంగాల్లో 3,964 మందికి ఒక డాక్టర్ అందుబాటులో వున్నారు. ఇలా సంక్షేమ రంగంలో సి.పి.ఎం. ప్రభుత్వం ఎంతో వెనుకబడి వుంది.

రెండు లక్షల కోట్ల అప్పుతో ఆర్థిక పరిస్థితి ఘోరంగా వుంది. మొత్తం రెవెన్యూ రాబడుల్లో 93 శాతం జీతాలూ, వడ్డీలకే పోతున్న పరిస్థితి వుంది.

సామాజిక రంగంలోకి తొంగి చూస్తే రాష్ట్రంలో 30 శాతం వున్న దళితుల పరిస్థితి, మొత్తం దేశంలోని దళితుల పరిస్థితికి ఏ మాత్రం భిన్నంగా లేదు. అంతే కాదు దాదాపు దేశమంతా సఫాయి కర్మచారి వ్యవస్థను రద్దు చేసినా కానీ, పశ్చిమబెంగాల్లో మాత్రం అది అమల్లో వుంది. లక్షల సంఖ్యలోని దళితులు ఈ అవమానకరమైన, దుర్భరమైన పనిలో మగ్గుతున్నారు.

లౌకిక పార్టీగా గొప్పలు చెప్పుకునే సిపిఐ (ఎం) పాలనలో మైనారిటీల పరిస్థితి కూడా మొత్తం దేశంలోని పరిస్థితితో పోల్చితే ఏ మాత్రం భిన్నంగా లేదు. సచార్ కమిటీ నివేదిక కూడా ఈ విషయాన్ని బహిర్గతం చేసింది. పశ్చిమ బెంగాల్లో ముస్లింల పరిస్థితి గుజరాత్‌లో కన్నా దారుణంగా వుందని సచార్ కమిటీ సభ్య కార్యదర్శి అబూసలే షరీఫ్ వ్యాఖ్యానించడాన్ని బట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గుజరాత్‌లో వలే ముస్లిం మతస్తుల మీద భౌతిక దాడులు జరగక పోవచ్చు, కానీ ఆర్థిక, విద్యా, సామాజిక రంగాల్లో వారి పాత్ర ఘోరంగా వుంది. జనాభాలో 25 శాతం వున్న ముస్లింల ప్రాతినిధ్యం ప్రభుత్వంలో 2.1 శాతం మాత్రమే వుండడాన్ని బట్టి వారి పట్ల అమలవుతున్న వివక్ష అర్థం అవుతుంది. నందిగ్రాంలో 32 శాతం, సింగూర్లో 9 శాతం ముస్లింలు వున్నారు. నందిగ్రాంలో, సింగూర్లో భూములు గుంజుకునే ప్రయత్నం చేయడం, తీవ్ర నిర్బంధం ప్రయోగించడం... ఇదంతా ఇతర వర్గాలతో పాటు ముస్లింలలోనూ తీవ్ర వ్యతిరేకతను పెంచింది. ఇలా క్రమంగా ఈ సెక్షన్ ప్రజలు దూరమయ్యారు.

నిజానికి ఈ పరిస్థితులను చక్కదిద్దడానికీ, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని సాధించడానికి వామపక్ష ప్రభుత్వానికి ఎన్నో సానుకూలాంశాలు వున్నాయి. ముఖ్యంగా 34 యేళ్లు సుస్థిరంగా పరిపాలించే అవకాశం వుండింది. కానీ ప్రజా ప్రయోజనాల పట్ల విధానపరంగానే చిత్తశుద్ధి కొరవడిన ఆ పార్టీ దానికనుగుణంగానే వ్యవహరించింది.

ఒకప్పుడు పారిశ్రామికంగా పురోగతిలో వున్న రాష్ట్రం వామపక్షాల పాలనలో బాగా వెనకబడి పోవడం వలన ముఖ్యంగా యువతలో చాలా కాలంగా అసంతృప్తి పేరుకుపోయి వుంది. అయితే పారిశ్రామికంగా వెనుకబడి వుందనే విమర్శ నుండి బయటపడ్డానికి, సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలను అనుసరించడం వలన పరిస్థితి మరింత దిగజారింది. రాష్ట్ర ప్రజలకు ప్రయోజనకరంగా వుండే వ్యవసాయ రంగంపై ఆధారపడిన పారిశ్రామికీకరణ గురించి ఆలోచించకుండా బహుళజాతి కంపెనీల, దళారీ పెట్టుబడిదారుల ప్రయోజనాలను నెరవేర్చే పారిశ్రామికీకరణకు పూనుకున్నాడు.

బుద్ధదేవ్ 2006లో అధికారంలోకి రాగానే 'కమ్యూనిస్టులు ఇక పాత పిడివాదాలను విడిచిపెట్టాలి. ప్రపంచం మారుతోంది. మనం సంస్కరణల బాట పట్టాలి. లేదంటే కనుమరుగైపోతాం', 'నేను బంద్‌లకు వ్యతిరేకం దురదృష్టవశాత్తు బంద్‌లకు పిలుపునిచ్చే పార్టీలో వున్నా. ఇంతకాలం వీటిపై మౌనంగా వున్నా. ఇకపై అలా వుండను', 'మేం సామ్యవాద విధానాల్నే కాకుండా పెట్టుబడిదారీ విధానాల్నీ ఆచరిస్తున్నాం. పోరాటం పేరుతో కర్మాగారాల్ని మూసేయాలనుకోవడం లేదు' అంటూ వ్యాఖ్యానాలు చేశాడు. అలా తన విధానాలను ప్రకటించాడు. అంతే కాదు బుద్ధదేవ్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే, రతన్ టాటా రైటర్స్ బిల్డింగ్ (ముఖ్యమంత్రి కార్యాలయం)లో ప్రత్యక్షమయ్యాడు.

నిజానికి జ్యోతిబసు పాలనలోనే రాష్ట్రంలో నూతన ఆర్థిక విధానాల వైపు మొగ్గుచూపడం ప్రారంభమైంది. బుద్ధదేవ్ పాలనలో అదివేగవంతమైంది. సిపిఐ (ఎం) అధికారంలో లేని చోట్ల మాత్రం సెజ్‌లను విమర్శిస్తుంది. అంతరించిపోయిన జమీందారీ వ్యవస్థ సెజ్‌లతో తిరిగి ప్రాణం పోసుకుంటున్నదనీ, సెజ్‌లలో కార్మిక హక్కులు హరించిపోతాయనీ మాట్లాడుతుంది. కానీ కేంద్ర సర్కార్ సెజ్ మార్గ దర్శకాలు వెలువరించడానికన్నా ముందే, 2003లోనే బుద్ధదేవ్ ప్రభుత్వం సెజ్ చట్టాన్ని తీసుకువచ్చింది. సెజ్‌లకు

అనుమతులిచ్చింది. సెజ్‌లకు వ్యవసాయ భూములను కేటాయించకూడదనీ, అయిదు వేల ఎకరాలకు మించి సెజ్‌లకు భూమిని ఇవ్వకూడదని ఇతర రాష్ట్రాల్లో మాట్లాడుతుంది. కానీ నందిగ్రాంలో కెమికల్ హబ్ కోసం సెజ్ ఏర్పాటుకు గాను సలీం గ్రూపుకు పదివేల ఎకరాల వ్యవసాయ భూములను కట్టబెట్టడానికి ప్రయత్నించింది. ఇంకా సింగూర్‌లో కార్ల కంపెనీ కోసం టాటాలకూ, పశ్చిమ మిడ్నాపూర్ ప్రాంతంలో ఉక్కు కర్మాగారం కోసం జిందాల్‌కూ వందలాది ఎకరాల వ్యవసాయ భూములను కట్టబెట్టడం కోసం రైతుల భూములను గుంజుకోవడానికి సిద్ధపడ్డాడు. ఇది రైతుల్లోనూ, రైతు కూలీల్లోనూ తీవ్ర వ్యతిరేకతకూ, వీరోచిత పోరాటాలకు దారితీసిన తీరు మనమెరిగినదే. ఈ పోరాటాలను అణచడానికి బుద్ధదేవ్ ప్రయోగించిన హింసాకాండ మరింతగా వ్యతిరేకతకు దారితీసింది. పోలీసుల అత్యాచారాలకు వ్యతిరేకంగా మొదలైన పోరాటం చారిత్రాత్మక లాల్‌గఢ్ పోరాటంగా రూపుదిద్దుకుంది. లాల్‌గఢ్ పోరాటాన్ని అణచడానికి కూడా తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించాడు.

మేధావి వర్గంలోనూ ఈ హింసాకాండ పట్ల, మొత్తంగా పెట్టుబడిదారులకు ఎర్రతివాచీ పరుస్తున్న 'ఎర్ర' ప్రభుత్వ విధానాల పట్ల తీవ్ర వ్యతిరేకత పెరిగింది. పోరాడుతున్న ప్రజలకు సంఘీభావం తెలుపడానికి వచ్చిన మేధాపాట్కర్ లాంటి వారిపై సిపిఐ (ఎం) చేసిన దౌర్జన్యాలూ, అవమానాలు వ్యతిరేకతను మరింత పెంచినయి. నందిగ్రాం హింసాకాండ తర్వాతి నుంచీ పలువురు మేధావులు తమకు ప్రభుత్వం ఇచ్చిన అవార్డులను తిరిగి ఇచ్చివేయడం, ఇవ్వజూపిన అవార్డులను తిరస్కరించడం ఒక ఉద్యమం వలెనే మొదలైంది.

సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న డార్జిలింగ్ సమస్యను పరిష్కరించకపోవడం వలన కూడా ఆ ప్రాంతంలో సిపిఐ (ఎం) పట్ల వ్యతిరేకత పెరిగింది.

ఇక సర్వత్రా ప్రజల్లో వ్యతిరేకత వెల్లువెత్తిన మరో విషయం నిరంతరాయమైన అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆ పార్టీ సంతరించుకున్న నిరంకుశ స్వభావం. సోషల్ ఫాసిజంగా ఏవగించుకునేంతగా ఆ పార్టీ ప్రజా జీవితాలతో వ్యవహరించింది. రాష్ట్రంలో ప్రతిపక్షం అనేది లేకుండా చేయడానికి బెదిరింపులూ, దౌర్జన్యాలూ,ఆస్తి ధ్వంసాలూ, హత్యలూ, అత్యాచారాలూ ఒకటేమిటి అది పాల్పడని దుర్మార్గం లేదు. ప్రతి పదిమందికి ఒకరు చొప్పున పౌరులపై ప్రజాసంఘాల నిఘా వుంటుందంటే ప్రజల వ్యక్తిగత జీవితంలో అది ఎంతగా జోక్యం చేసుకుందో అర్థం చేసుకోవచ్చు. పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన హర్మద్ వాహిని ప్రైవేటు పోలీసు సంస్థ వలె వ్యవహరించింది. గత 34 యేళ్ల వామపక్ష పాలనలో 75 వేల మంది సిపిఐ(ఎం) చేతిలో హత్యకు గురయ్యారు. 2006లో అసెంబ్లీ ఎన్నికల తర్వాత దాదాపు 500 రాజకీయ హత్యలు జరిగాయి. ఇటీవల ఎన్నికల తర్వాత తృణమూల్ ప్రభుత్వం జరుపుతున్న సోదాల్లో సిపిఐ(ఎం) కార్యకర్తల ఇండ్ల నుండి, కార్యాలయాల నుండి వందలాది మారణాయుధాలు బయటపడుతున్నాయి. సాయుధ పోరాటాన్ని ఎన్నడో వదిలేసిన వీరికి తుపాకులతో ఏం అవసరం? తుపాకులే కాదు పుర్రెలు కూడా బయటపడుతూ వారి హత్యా రాజకీయాలను వెల్లడిస్తున్నాయి. అంతేకాదు స్థానిక సంస్థల అభివృద్ధి నిధుల్లో 50 శాతం సీపీఎం కోటాగా కేటాయిస్తారు. అవెలా ఖర్చు పెట్టాలో పార్టీయే నిర్ణయిస్తుంది. ఇదంతా తమ ఏక ఛత్రాధిపత్యాన్ని బలవంతంగా నిలబెట్టుకోవడానికే.

ఇవన్నీ ఈ రివిజనిస్టుల పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరగడానికి కారణమయ్యాయి. అంతేకాదు పశ్చిమ బెంగాల్లో మావోయిస్టు పార్టీ నేతృత్వంలో రోజు రోజుకూ పెరుగుతున్న విప్లవోద్యమ చైతన్యం కూడా సిపిఐ (ఎం) పట్ల ప్రజల్లో వ్యతిరేకత తీవ్రస్థాయికి చేరడానికి ఒక ముఖ్య కారణం. సిపిఐ (ఎం) పాలక విధానాలు భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాదుల దోపిడీకి మరెంతగా మార్గాన్ని సుగమం చేస్తున్నాయో ఎప్పటికప్పుడు మావోయిస్టు పార్టీ బహిర్గతం చేస్తూ వచ్చింది. దాని రివిజనిస్టు స్వభావాన్ని ఎప్పటికప్పుడు ఎండగట్టింది. పీడిత ప్రజల సమస్యలకు నాయకత్వం వహిస్తూ నందిగ్రాం, లాల్‌గఢ్ వంటి చారిత్రక పోరాటాలను నిర్మించి, ప్రజా యుద్ధ రాజకీయాలే సరైన ప్రత్యామ్నాయం అనే విశ్వాసాన్ని బెంగాల్ ప్రజల్లోనే కాదు దేశవ్యాప్తంగా ప్రజల్లో పాదుకొల్పగలిగింది. పోరాటంలో కలిసి వచ్చే శక్తులను, సంస్థలను కలుపుకొని వచ్చి ఉమ్మడి శత్రువును ఏకాకిని చేయగల్గింది. ఎదుగుతున్న విప్లవోద్యమం తన ఉనికికి ఎంతగా ప్రమాదకరమో స్పష్టంగా గ్రహించగల్గిన సిపిఐ(ఎం), విప్లవోద్యమంపైనా, ఉద్యమ ప్రాంతాల్లోని ప్రజలపైనా ప్రయోగించిన నిర్బంధం ప్రజల్లో మరింత వ్యతిరేకతను పెంచింది.

ఇలా గతకొంత కాలంగా సి.పి.ఎం. పట్ల పెరుగుతూ వస్తోన్న అసంతృప్తి బుద్ధదేవ్ పాలనలో గెంతు రూపం తీసుకుంది.

సిపిఐ(ఎం) పట్ల ప్రజల్లో పెరిగిన ఈ వ్యతిరేకతను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా రాజ్యాధికారంగా మలచగలిగే భౌతిక పరిస్థితి ప్రస్తుతం విప్లవోద్యమానికి లేకపోవడం అనేది మమతా బెనర్జీకి అనుకూలంగా మారింది. గత కొంత కాలంగా ఆమె సిపిఐ(ఎం)ను కూలగొట్టడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకుని అందుకు అనుగుణమైన

ఎత్తుగడలను ప్రయోగిస్తూ వచ్చింది. ముఖ్యంగా నందిగ్రాం, సింగూరు పోరాటాల్లో ప్రముఖ పాత్ర వహించింది. సింగూరు పోరాటం సందర్భంగా 25 రోజుల పాటు నిరాహార దీక్ష చేసింది. లాల్‌గఢ్ పోరాటానికి సంఘీభావం ప్రకటించింది. విప్లవోద్యమం పట్ల ప్రయోగిస్తున్న నిర్బంధాన్ని ప్రశ్నిస్తూ వచ్చింది. కామ్రేడ్ ఆజాద్ ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. రైల్వే మంత్రిగా బెంగాల్‌కు పెద్ద పీట వేసి, బెంగాల్ జాతి ప్రయోజనాలకు కట్టుబడిన మనిషిగా పేరు తెచ్చుకుంది. ఇవన్నీ ఆమె పట్ల ప్రజల్లో ఒక సానుకూల వైఖరిని కల్గించాయి. ఆమె నిరాడంబర జీవన శైలి, పోరాట పటిమ కూడా ఇందుకు దోహదపడ్డాయి. ఫలితంగా 'మా, మాటి, మానుష్', 'పరివర్తన' నినాదాలకు ప్రజలు జైకొట్టారు.

వామపక్షాల ఘోరపరాజయం పశ్చిమ బెంగాల్‌నే కాక దేశ రాజకీయాలను ప్రభావితం చేసే విషయం. దేశంలో గత కొన్నాళ్లు ్లగా జాతీయ స్థాయిలో మూడో ప్రత్యామ్నాయం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొన్ని ప్రాంతీయ పార్టీలతో పాటు, జాతీయ పార్టీగా గుర్తింపు వున్న సి.పి.ఎం. ఇందులో చురుకైన పాత్ర వహిస్తున్నది. ఇప్పుడు ఈ ఓటమి మూడో ప్రత్యామ్నాయంపై కొన్ని రాజకీయ పార్టీలు పెట్టుకున్న ఆశలను వమ్ముచేస్తుంది. రెండు జాతీయ కూటములతో విసిగిపోయి వున్నప్పటికీ ప్రత్యామ్నాయ కూటమిపై కూడా ప్రజలకు ఎటువంటి భ్రమలూ లేవని అర్థం అవుతుంది.

సి.పి.ఎం. పాలనతో విసిగిపోయిన బెంగాల్ ప్రజలు తృణమూల్‌కు పట్టం కట్టారు. అయితే నిన్నటి సిపిఐ(ఎం) పాలనకూ రేపటి తృణమూల్ పాలనకూ మౌలికంగా ఏ తేడా వుండబోదన్నది స్పష్టాతిస్పష్టం. మమత నేడు 'మా మాటి మానుష్' అని నినాదం ఇస్తుండవచ్చు. ఈ నినాదాలు అధికార పీఠాన్ని అందుకోవడానికి గాను ప్రజలను ఆకర్షించే సాధనాలే గానీ నిజంగా ఆ నినాదాలకు ఆమె కట్టుబడి వుండలేదు. ఆమె మధ్య తరగతి నుండి వచ్చి వుండవచ్చు గానీ, దోపిడీ వర్గ ప్రయోజనాలకే కట్టుబడి వుంటుందనే దాంట్లో సందేహం లేదు. దోపిడీ వర్గాలకు సేవచేసే కాంగ్రెస్ పార్టీ నుండి ఆమె వచ్చింది. ఆ పార్టీ నుండి బయటకు వచ్చేసింది సైద్ధాంతిక విభేదాల వల్ల కాదు, ఆచరణలో వచ్చిన సమస్యల వల్లనే. అధికారాన్ని పొందడం కోసం ఏ పార్టీతోనైనా పొత్తు పెట్టుకోవడానికి ఆమె సిద్ధమే. మొన్నటి దాకా మతోన్మాద బి.జె.పి.తో మిత్ర వైఖరిని అనుసరించిన ఆమె నేడు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. భ్రష్టు పట్టిన యు.పి.ఎ.-2 పాలనలో భాగస్వామిగా వుంది. కనుక ప్రస్తుతం ప్రజలపై జరుగుతోన్న యుద్ధంలో తృణమూల్‌కు కూడా భాగస్వామ్యం వుంది. ఇటువంటి తృణమూల్ నుండి ఎక్కువగా ఆశించడం అమాయకత్వమే అవుతుంది. ప్రజల్లో తన పునాదిని దృఢపరుచుకోవడానికి కొంత కాలం ప్రజా ప్రయోజనాలు చేకూర్చే పథకాలను చేపట్టవచ్చు. కానీ ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించడం దానికి స్వభావరీత్యానే సాధ్యం కాదు. క్రమంగా తృణమూల్ తన వర్గ స్వభావాన్ని చాటుకుంటుంది.

కనుక దోపిడీ పాలక విధానాలకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ప్రజలు చేపట్టిన పోరాటం ఇకముందు కూడా కొనసాగించాల్సే వుంటుంది. విప్లవోద్యమంతో మరింతగా మమేకమవుతూ నూతన ప్రజా స్వామిక విప్లవ మార్గంలో ముందుకు సాగినపుడే ప్రజాస్వామిక పాలన నుండి వారు నిజమైన విముక్తిని పొందుతారు. ○

**ఒక విప్లవ పార్టీ ఎందుకుండాలి? ప్రజలను అణచివేసే శత్రువులు ప్రపంచంలో వున్నారు కాబట్టి, శత్రువు పీడనను వదిలించుకోవాలని ప్రజలు కోరుకుంటారు కాబట్టి, విప్లవ పార్టీ తప్పనిసరిగా వుండాలి. పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద శకంలో సరిగ్గా కమ్యూనిస్టు పార్టీలాంటి విప్లవ పార్టీ అవసరం. ఇటువంటి పార్టీ లేకుండా శత్రువు పీడనను వదిలించుకోవడం ప్రజలకు అసాధ్యం. మనం కమ్యూనిస్టులం. శత్రువును కూలదోయడానికి మనం ప్రజలకు నాయకత్వం వహించాలని అనుకుంటాం. అందుకని మనం మన శ్రేణుల్ని సక్రమంగా వుంచుకోవాలి. మనం ముందుకుసాగాలి. సమర్థులైన సైనికులను ఎంచుకోవాలి. మంచి ఆయుధాలుండాలి. ఈ పరిస్థితులేవీ లేకుండా శత్రువుని కూలదోయలేం.**

# తొలితరం పౌరహక్కుల ఉద్యమనేత పత్తిపాటి వెంకటేశ్వర్లు

# మృతికి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిద్దాం!



పౌర హక్కుల సంఘం వ్యవస్థాపక నేతల్లో ఒకరైన పత్తిపాటి వెంకటేశ్వర్లు జూన్ 11న హైదరాబాద్‌లో మరణించారు. ఊపిరి తిత్తులకు ఇన్ఫెక్షన్ కారణంగా అనారోగ్యానికి గురై నిమ్స్‌లో చేరి చికిత్స పొందుతూ అక్కడే తుది శ్వాస వదిలారు. ఆయన మృతికి 'క్రాంతి' ప్రగాఢ సంతాపం ప్రకటిస్తోంది. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతోంది.

పత్తిపాటి వెంకటేశ్వర్లు 1934, జూలై 1న ప్రకాశం జిల్లా టంగుటూరులో జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన చాలా కాలం పాటు హైకోర్టులో ప్రాక్టీసు చేసారు. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలు ఆంధ్ర ప్రదేశ్‌లోని మేధావి వర్గంపై తీవ్ర ప్రభావాన్ని వేసిన నేపథ్యంలోనే విరసం, పౌరహక్కుల సంఘాలు ఏర్పడ్డ విషయం మనమెరిగినదే.

1973లో ఏర్పడిన పౌర హక్కుల సంఘం వ్యవస్థాపకుల్లో పత్తిపాటి వెంకటేశ్వర్లు ఒకరు. ఈ సంస్థకు తొలి అధ్యక్షుడు శ్రీశ్రీ కాగా, తొలి ప్రధాన కార్యదర్శి పత్తిపాటి వెంకటేశ్వర్లు. పౌరహక్కుల ఉద్యమంలో ఆయన నాడు చురుకైన పాత్ర వహించాడు. ఎమెర్జెన్సీకి ముందు 1974లో భూమయ్య – కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షను రద్దు చేయాలంటూ పెద్ద ఎత్తున ఉద్యమం నడిచింది. అంతర్జాతీయ స్థాయిలో సంఘీభావాన్ని పొందిన ఈ ఉద్యమానికి శ్రీశ్రీతో పాటు పత్తిపాటి సారధ్యం వహించారు. 1971లో 'మార్చ్', 'ఝంఝ' కవితా సంకలనాలు నిషేధానికి గురైనపుడు రాష్ట్ర హైకోర్టులో ఆ నిషేధాన్ని సవాలు చేస్తూ ఆయన వాదించారు. 1970 నుంచి ఎమెర్జెన్సీ దాకా ఆయన ప్రజా ఉద్యమాలలో చురుకైన పాత్ర వహించారు.

1975లో ఎమెర్జెన్సీ ప్రకటించిన వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమంపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించారు. ఆ నిర్బంధంలో అరెస్టయిన మొదటి నాయకుడు పత్తిపాటి. ఎమెర్జెన్సీ అనంతరం పౌరహక్కుల ఉద్యమంలో ఆయన క్రియాశీలకంగా పని చేయనప్పటికీ, ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచారు. కమ్యూనిస్టులు అందరూ ఏకం కావాలనీ, ఐక్య ఉద్యమం మాత్రమే ప్రజా ప్రయోజనాలను పరిరక్షిస్తుందని నమ్మేవారు. గత కొద్ది సంవత్సరాలుగా పని హక్కు వేదికను ప్రారంభించి పని హక్కు కల్పించడమే మిగిలిన అన్ని హక్కులకు హామీ ఇస్తుందని వాదించేవారు. ఆయన మంచి ఉపన్యాసకుడు, రచయిత. ఆయన రచించిన ఒక కవితా సంపుటం, ఆత్మకథ అచ్చయ్యాయి.

***(27వ పేజీ తరువాయి..)***

అనివార్యతకు గురై కేసు నమోదు చేసినప్పటికీ నిజమైన దోషులను రక్షించడానికే అది ప్రయత్నిస్తున్నదని స్పష్టంగా తెలుస్తున్నది.

కనుక పౌర హక్కుల సంఘాల, ప్రజాస్వామిక వాదుల కృషి ఇంతటితో ఆగిపోకూడదు. అసలు దోషులపై కేసు నమోదు అయ్యేలా శిక్షలు పడేలా వత్తిడి పెంచాలి. కేసు నమోదయినా, కేసు నమోదుకూ శిక్ష విధింపుకు నడుమ చేయవలసిన ప్రయాణం సుదీర్ఘమైనది. ముఖ్యంగా లొసుగులతో కూడినది. కనుక దోషులకు శిక్షలు పడేలా గట్టి కృషి చేయాలి. 1970లో కేరళలో ఇలాగే ఎన్‌కౌంటర్ పేరుతో వర్గీస్ అనే విప్లవకారుడిని పోలీసులు హత్యచేసారు. 40 యేళ్ల తర్వాత సి.బి.ఐ. కోర్టు, నాడు ఐ.జి.గా వున్న కె.లక్ష్మణ్‌కు జీవిత ఖైదు విధించింది. హైకోర్టు కూడా దీన్ని నిర్ధారించింది. షొహ్రాబుద్దీన్ హత్యకేసులో డైరక్టర్ జనరల్ స్థాయిలోని పోలీసు అధికారులూ, హెూం మంత్రి కూడా జైలు పాలయ్యారు.

ఇటువంటి శిక్షలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని తమ ఇష్టానుసారం విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్న పోలీసు అధికారులకు చిరు హెచ్చరికలుగానైనా వుంటాయి. కనుక అటువంటి దిశలో పౌరహక్కుల సంఘాలూ, ప్రజాస్వామిక వాదులు తమ వత్తిడిని పెంచాలి.

అయితే ఇటువంటి దోషులకు నిజమైన శిక్షలు పడాల్సింది ప్రజా న్యాయ స్థానంలోనే!

# అమెరికన్ సామ్రాజ్యవాదుల్ని గడగడలాడించిన ఒసామాబిన్ లాడెన్ హత్యను ఖండిద్దాం!

సామ్రాజ్యవాద శక్తులకు సింహస్వప్నంగా నిలిచిన ఆల్‌ఖైదా వ్యవస్థాపక నేత ఒసామాబిన్ లాడెన్‌ను అమెరికా సి.ఐ.ఎ. కుట్ర పూరితంగా హత్య చేసింది. పాకిస్తాన్ ఐ.ఎస్.ఐ. సహకారంతోనే ఈ పథకం అమలుచేసింది. ఇస్లామాబాద్‌కు 75 కిలోమీటర్ల దూరంలో అబటాబాద్ హవేలీలో ఈ క్రూర దాడి జరిగింది. ప్రత్యేక శిక్షణగల 'సీల్స్' బలగాలు హెలీకాప్టర్లను వినియోగించి అత్యంత రహస్యంగా ఈ ఆపరేషన్‌ను పూర్తి చేసాయి. లాడెన్‌ను అరెస్టు చేయడానికి అవకాశం ఉన్నా గానీ అలా చేయలేదు. లాడెన్ శవాన్ని ఎక్కడ పూడ్చిపెట్టినా అది ఒక పవిత్ర యాత్రా స్థలం అవుతుందని భయపడి సముద్రంలో పడవేశారు.

ప్రతీ సంవత్సరం అమెరికా నుండి బిలియన్ డాలర్లు ఆర్థిక సహాయం పొందుతున్నది పాకిస్తాన్ ప్రభుత్వం. లాడెన్‌కు రక్షణ కల్పించినట్టు కల్పించి సి.ఐ.ఎ. – ఐ.ఎస్.ఐ.లు ఉమ్మడిగా దీర్ఘకాలిక పథకం పన్ని మట్టుబెట్టాయి. సి.ఐ.ఎ. చీఫ్ ఇదంతా తాము స్వతంత్రంగా చేసామనడం నిజం కాదు.

లాడెన్ హత్య సందర్భంగా అరెస్టు అయిన వారిలో అయిదుగురు సి.ఐ.ఎ.కు సమాచారం ఇచ్చారని, అందులో పాకిస్తాన్‌కు చెందిన సైనిక మేజర్ ఉన్నాడని స్పష్టమయ్యింది. సి.ఐ.ఎ. చీఫ్ ఆఫ్ఘనిస్తాన్‌లోని కాబూల్‌కూ, పాకిస్తాన్‌లోని ఇస్లామాబాద్‌కు వచ్చి తిరిగి వెళ్లిన మూడు రోజులకే లాడెన్ హత్య జరిగింది. సి.ఐ.ఎ., ఐ.ఎస్.ఐ.ల మధ్య సంబంధం గురించి రాసినందుకే రిపోర్టర్ పాజాద్‌ను హత్యచేసారు.

లాడెన్‌ను హత్య చేసి ఘన విజయం సాధించినట్టు చెప్పుకుంటున్న ఒబామా, ఈ విజయంతో రేపు జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలవగలనని కలలు కంటున్నాడు. కానీ మరణించేనాటికి లాడెన్ పూర్తి విశ్రాంతిలో వున్నాడు. లాడెన్ ఒక ఉద్యమాన్ని నడిపి, ఆ మార్గంలో నడిచే శక్తుల్ని తయారు చేసి, బాధ్యతలను ఇతరులకు అప్పగించిన తర్వాత ఈ ఘటన జరిగింది. కనుక ఇప్పుడు లాడెన్‌ను హత్య చేసిన ఒబామాకు, అమెరికాకు జరిగే మేలు శూన్యం. లాడెన్ హత్య తర్వాత ఉద్యమం ఆగదని చెబుతూ ప్రతీకారంగా అనేక చర్యలు చేస్తూ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం కొనసాగుతుందని లాడెన్ స్ఫూర్తినిచ్చి నడిపిన శక్తులు ప్రకటిస్తున్నాయి. పాకిస్తాన్ పోర్ట్ సిటీగా పేరుగాంచిన కరాచీలో నేవీ బేస్ మీద దాడి చేసి లాడెన్ హత్యకు ప్రతీకార చర్యగా ప్రకటించారు. ఒబామాను హత్య చేసిన అమెరికా గెలిచినట్లు కాదు, లాడెన్ ఓడినట్లూ కాదు. అరెస్టు చేయగలిగే అవకాశాలూ వున్నా హత్య చేసిన, శవాన్ని పూడ్చితే కూడా ఆ స్థలం పవిత్ర యాత్రా స్థలమవుతుందని భయపడిన అమెరికా ఎప్పటికీ గెలవదు.

లాడెన్ అమెరికన్ సామ్రాజ్యవాదానికి, ప్రపంచ సామ్రాజ్యవాద దేశాలకు లక్ష్యంగా ఎందుకు మారాడో చూద్దాం. 2001 సెప్టెంబర్ 11న న్యూయార్క్ మహా నగరంలో వున్న ప్రపంచ వాణిజ్య కేంద్ర భవనాలను కూల్చి వేసిన పెద్ద సంఘటనకు లాడెన్ సూత్రధారి కావడంతో ప్రపంచ ప్రజలందరి దృష్టి లాడెన్ మీద నిలిచింది.

ఒక చిన్న కూరగాయల కత్తితో అమెరికన్ విమానాన్ని స్వాధీనం చేసుకొని, అత్యంత వేగంగా నడిపి జంట భవన సముదాయాన్ని గుద్ది వేయడంతో అవి నేలకూలాయి. ఈ ఘటనలో పైలెట్లు, సహాయకులు మొత్తం 19 మంది మిలిటెంట్లు చనిపోయారు. వారంతా అమెరికా సామ్రాజ్యవాదాన్ని ధిక్కరించిన సమరశీల పోరాట యోధులు. వారికి ప్రధాన శత్రువులు అమెరికా, ఇజ్రాయిల్‌లు. ద్వితీయ శ్రేణి శత్రువులు ఆయా దేశాల పాలక ప్రభుత్వాలు.

ఈ చర్యను ప్రపంచం సంభ్రమాశ్చర్యాలతో ఆహ్వానిస్తే, సామ్రాజ్యవాద దోపిడీ వర్గాలు లాడెన్‌ను ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన టెర్రరిస్టుగా ప్రకటించాయి. టెర్రరిజాన్ని ఓడించే పేరుతో యుద్ధాన్ని ప్రకటించాయి. ఆ యుద్ధం ప్రపంచం నలుమూలలకు విస్తరించింది. 109 దేశాలలో వివిధ రూపాల్లో అమెరికా ఈ యుద్ధాన్ని నడుపుతూంది. అమెరికా చేపట్టిన ఈ దాడులూ, దుష్ప్రచార, అణచివేత విధానాల ఫలితంగా 50 దేశాలకు లాడెన్ నిర్మించిన ఆల్‌ఖైదా సంస్థ విస్తరించింది. ముస్లిం దేశాల్లో ఇస్లామిక్ తీవ్రవాదాన్ని పెంచింది. అమెరికాకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితపడుతూ మిలిటెంట్ ఉద్యమాలనూ, సాయుధ పోరాటాలను చేపట్టారు.

పది సంవత్సరాల పాటు దాడులూ, మారణహోమాలతో అమెరికా సామ్రాజ్యవాదం, సి.ఐ.ఎ. ప్రపంచ దేశాల్లో పీడిత ప్రజలపై చెప్పలేనంత హింసను ప్రయోగించాయి. లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసాయి. లక్షల మంది ప్రజల్ని హతమార్చాయి. గ్వాంటినామా,

అబూగ్రెహెబ్ లాంటి చిత్రహింసా శిబిరాల్లో వేలమందిని అమానుషంగా హింసించారు. అనేక వందల మందిని ఉరికంబాలెక్కించారు. అంతర్జాతీయ టెర్రరిస్టు వ్యతిరేక చట్టాలు తెచ్చారు. అనేక ఆంక్షలు విధించారు. నిషేధాలు అమలు చేసారు. అనేక నిర్మాణాలు పెట్టి, చర్యలు చేపట్టి, సమన్వయించి, సమీక్షలు చేసి ఒక దశాబ్దకాలం ప్రపంచాన్ని అల్లకల్లోలం చేసారు. అంతర్జాతీయ టెర్రరిస్టుగా అమెరికన్ సామ్రాజ్యవాదం తన నగ్న స్వరూపాన్ని బహు విధాలుగా చాటి చెప్పుకున్నది. కానీ లాడెన్‌ను పట్టుకోలేక పోయింది. లాడెన్‌ను పట్టుకోవడానికే ఆఫ్ఘనిస్తాన్‌పై దాడి చేసింది. ఆఫ్ఘనిస్తాన్ సామ్రాజ్యవాదులకు స్మశాన వాటిక అవుతుందని లాడెన్ హెచ్చరించాడు. అదే నిజమయ్యింది.

లాడెన్‌ది సౌదీ అరేబియా దేశం. ఒక సంపన్న కుటుంబంలో పుట్టి, సివిల్ ఇంజనీరింగ్ చదివాడు. విద్యార్థిగా వున్నప్పుడే రాజకీయాల్లోకి ప్రవేశించాడు. ఆనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలు లాడెన్‌ను రాజకీయాల్లోకి ఆకర్షించాయి. మార్కెట్ విస్తరణ కోసం సరఫరా మార్గంగా తవ్విన సూయజ్ కాలువ నిర్మాణం ఈజిప్ట్‌ను వలసగా మార్చివేసింది. పాలస్తీనా భూ భాగాన్ని ఖాళీ చేయించి ఇజ్రాయిల్ దుష్ట శక్తిని అక్కడ స్థాపించింది. దేశం లేని ప్రజల కోసం (యూదులకు) ప్రజలున్న దేశాన్ని (పాలస్తీనాను) ఖాళీ చేయించి అమెరికాకు ఒక బలమైన ఏజెంట్ (తొత్తు)ను పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొల్పింది.

ఈజిప్ట్‌లోని సూయజ్ కాలువపై ఈజిప్ట్ హక్కులను కాపాడుకున్నందుకు, అరబ్ దేశాలు తమ స్వతంత్రతను ప్రకటించుకున్నందుకు బ్రిటన్, అమెరికాలు ఆ దేశాలపై దాడులు చేసాయి. లొంగ దీసుకున్నాయి. అలా జరిగిన యుద్ధాలు అక్కడి ప్రజలపై ముఖ్యంగా యువతరంపై బలమైన ముద్రలు వేసాయి.

ప్రపంచంలో ముస్లింలు 15 శాతం. ముస్లిం దేశాల్లో అధికంగా వున్న చమురు, సహజ వాయువు, ఖనిజాలు, మానవ శ్రమలను కొల్లగొట్టి దోచుకుపోవడంతో పాటు, సూయజ్ కాలువ సంక్షోభాన్ని, పాలస్తీనా విధ్వంసాన్ని సృష్టించిన సామ్రాజ్యవాదం వారికి ప్రధాన శత్రువుగా మారింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మరీ ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయిల్‌ల దాడులు పెరిగిన తర్వాత ప్రతిఘటన తప్పనిసరి అయిపోయింది. అరబ్‌దేశాలపై ఇజ్రాయిల్ ప్రముఖంగా నాలుగు యుద్ధాలు చేసింది. మూడవసారి 1967లో జరిగిన యుద్ధం భయంకరమైన విషాదాన్ని మిగిల్చితే, 1973లో నాలుగవసారి జరిగిన పదిహేడు రోజుల యుద్ధం చాలానే నష్టాన్ని, కష్టాల్ని చవిచూపింది. దీని కన్నా, 1979 నాటి క్యాంపు డేవిడ్ ఒప్పందం అరబ్ ప్రజలను చాలా అవమానపరిచింది. రీగన్ హయాంలో అరబ్ ప్రపంచానికి వ్యతిరేకంగా ఈ ఒప్పందం చేయించిన అమెరికన్ సామ్రాజ్యవాదం ఇజ్రాయిల్, ఈజిప్ట్ దేశాధినేతలకు శాంతి బహుమతిని (నోబుల్) ప్రదానం చేయించి ప్రపంచాన్నే ఆశ్చర్యపరిచింది.

ఈ ప్రాంతంలో అమెరికా సైనిక జోక్యాలను పెంచింది. జాతి విద్వేషాలు రెచ్చగొట్టింది. ఇవన్నీ అక్కడి సహజ వనరుల లూటీ కోసమూ, ఆధిపత్యం కోసమూ చేసినవే. అరబ్ పాలకులైన అమీర్‌లు, నవాబ్‌లు, షేక్‌లు సామ్రాజ్యవాదానికి అనుకూలురుగా, అరబ్ ప్రపంచాన్ని దోచిపెట్టే దళారులుగా, దోపిడీ శక్తులుగా మారిపోయారు. అప్పటికి ఇరాన్, అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని ఒంటరిగానే ఎదిరిస్తున్నది. అది పర్షియన్ దేశం అయినా అక్కడి ఇస్లామిక్ విప్లవం అరబ్ యువతరానికి ఆదర్శమయ్యింది. అమెరికాను ఎదిరించే పోరాట మార్గదర్శకం అయ్యింది. అలా యువత ఇస్లామిక్ తీవ్రవాదం వైపు వెళ్లింది. ఈ క్రమంలో లాడెన్ రహస్య రాజకీయ కార్యకలాపాలను ప్రారంభించి ఒక నాయకుడిగా ఎదిగి యువతను కూడగట్టాడు. లాడెన్ రాజకీయాలకు ఈ నేపథ్యం వుంది.

అక్టోబర్ విప్లవం, మూడవ ఇంటర్నేషనల్ కృషి ఫలితంగా అన్ని దేశాలలో ముఖ్యంగా ఆసియా దేశాల్లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. భారత దేశం, చైనాలతో పాటు ఇరాన్, ఇరాక్, సిరియా, ఈజిప్ట్, లెబనాన్, కుర్దిస్తాన్, ఇండోనేషియా దేశాలలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. ఈ దేశాల్లో విప్లవోద్యమం బలంగా విస్తరించింది. 1956 తర్వాత వచ్చిన రివిజనిస్టు కృశ్చేవ్ 'శాంతి యుత' విప్లవాలు, ఆఫ్ఘనిస్తాన్‌పై రష్యా దురాక్రమణదాడి, 1976 మావో మరణానంతరం చైనాలో పెరిగిన రివిజనిస్టు ప్రభావం మొదలైన పరిణామాలు అరబ్ యువత కమ్యూనిస్టు రాజకీయాలను స్వీకరించకుండా అడ్డుపడ్డాయి.

1979లో సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం ఆఫ్ఘనిస్తాన్ మీద దాడిచేసినపుడు, అమెరికన్ సామ్రాజ్యవాదం అరబ్ దేశాల్లోని పాలకుల ద్వారా యువతరాన్ని కూడగట్టి రష్యాకు వ్యతిరేకంగా గెరిల్లా పోరాటాన్ని ప్రోత్సహించింది. పాకిస్తాన్‌లో ఐ.ఎస్.ఐ. ద్వారా సి.ఐ.ఎ. ఈ కార్యకలాపాలను సమన్వయించింది. అక్కడ రష్యా వ్యతిరేక గెరిల్లా పోరాటం మొదలైన తర్వాత, రెండేళ్లకు లాడెన్ పాకిస్తాన్ మీదుగా ఆఫ్ఘన్ సరిహద్దులకు చేరి గెరిల్లా దళాలతో కలిసిపోయాడు. అరబ్ దేశాల నుండి ఆఫ్ఘనిస్తాన్‌కు వచ్చి గెరిల్లా పోరాటం చేస్తున్న అరబ్ యువతరం లాడెన్ చుట్టూ సమీకృతులయ్యారు. ఆనాటి పోరాటం ప్రజల సంపూర్ణ మద్దతుతో విజయం సాధించింది. రష్యన్ సామ్రాజ్యవాదం తీవ్రమైన నష్టాలతో

తిరోగమించింది. అయితే ఈ తిరోగమనం కుట్ర పద్ధతుల్లో జరగడంతో, రష్యా కీలుబొమ్మ నజీబుల్లా ప్రభుత్వం పోయి, అమెరికా కీలుబొమ్మ రబ్బానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి వరకు పోరాడిన మొజాహిద్దీన్‌లను వాళ్ల లెక్కలోకి తీసుకోలేదు.

ఓటమి పాలైన వాడితో ఒప్పందం ఏమిటి? ఇందులో అమెరికా జోక్యం ఎందుకు? జీవితాలను ఫణంగా పెట్టి పోరాడుతున్న ఆఫ్ఘన్ విమోచనా శక్తులతో చెప్పకుండా జరిగిన ఏకపక్ష నిర్ణయాలను పోరాడుతున్న అరబ్, ఆఫ్ఘన్ యువతరం వ్యతిరేకించింది. పాతతరం నాయకులు రబ్బానీ, మసూద్, దోస్తుంల పిలుపును (రాజీని) అంగీకరించలేదు. దానితో మొజాహిద్దీన్ సంస్థలో చీలిక వచ్చింది. అరబ్ దేశాల పాలకులు అన్ని రకాలుగా ఒత్తిడి తెచ్చినా యువత లొంగలేదు. యువత లాడెన్ నాయకత్వాన్ని విశ్వసించారు. పోరాటాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. మొజాహిద్దీన్‌లో చీలిక వచ్చి తాలిబన్ సంస్థ పోరాటాన్ని కొనసాగిస్తూ ముందుకొచ్చింది. ఇప్పుడు రష్యన్ సామ్రాజ్యవాదంతో పోరాడినట్లే అమెరికన్ సామ్రాజ్యవాదంతో పోరాడాలని గుర్తించారు. ఒక చిన్న దేశంలో మాత్రమే పోరాడి అమెరికాను ఓడించలేమని గుర్తించిన లాడెన్ యువతకు అర్థం చేయించి, వాళ్లకు ఆఫ్ఘన్ బాధ్యతనిచ్చి, తను సౌదీ అరేబియాకు వెళ్లాడు. అక్కడి నుండి అన్ని దేశాల యువతను కూడగట్టాడు. అరబ్ దేశాల పాలకుల ప్రోద్బలంతో వెనక్కి వచ్చిన వారిని, అక్కడి ఆఫ్ఘన్ పోరాటంలో రాటుదేలిన వారిని తిరిగి కూడగట్టాడు. వారందరినీ సమీకరించడానికి ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపాడు. రాజకీయ ప్రచారం చేసాడు. సాహిత్యం విస్తృతంగా ప్రచురించాడు. నాలుగు సంవత్సరాల పాటు రహస్య రాజకీయ ప్రచారం చేస్తూ విశాల రాజకీయ దృక్పథాన్ని పెంచాడు. అందులో ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని ఓడించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పాడు. ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణనూ, అమెరికా ఆధిపత్యాన్ని ఎండగట్టాడు. ఇరాన్ – ఇరాక్‌ల మధ్య యుద్ధాన్ని సృష్టించి, మధ్య ఆసియాలో చమురు నిల్వలను కాజేసే కుట్రలను ఎండగట్టాడు. అమెరికా ప్రోద్బలంతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్ని ఖండించాడు. లిబియాపై విధించిన ఆంక్షలనూ, చేస్తున్న దాడులనూ, దురాక్రమించే పథకాలను వ్యతిరేకించాడు. అమెరికా అనుకూల కీలుబొమ్మ ప్రభుత్వాల విద్రోహ చర్యలను వ్యతిరేకించాడు. భావ సమైక్యత కల్గిన శక్తులను కూడగట్టాడు. ఈ క్రమంలో దృఢ సంకల్పం, పోరాడే ఉత్సాహం గల యువతరంతో 1988లో ఆల్‌ఖైదా సంస్థను స్థాపించాడు.

ఆ తర్వాత లాడెన్‌పై తీవ్రమైన నిర్బంధం అమలయ్యింది. 1994లోనే సౌదీ అరేబియా లాడెన్ పౌరసత్వాన్ని నిషేధించింది. 1996లో సూడాన్‌పై ఒత్తిడి తెచ్చి అక్కడి నుండి కూడా బహిష్కరించేలా చేసారు. అంతకంటే ముందే లాడెన్ వ్యాపార కార్యకలాపాలను నిషేధించారు. లాడెన్‌పై దేశ బహిష్కారాన్ని యు.ఎన్.ఒ. కూడా ఆమోదించేలా చేసారు. ఇది యు.ఎన్.ఒ.కు సిగ్గుచేటైన విషయం. నిషేధాలు బహిష్కరణలు ఎన్ని వున్నా లాడెన్ ప్రయాణం యథావిధిగానే సాగింది. తర్వాత ఆఫ్ఘనిస్తాన్ తనకి రక్షణ కల్పించింది. పాలస్తీనాకు వ్యతిరేకమైన ఒస్లో ఒప్పందాన్ని, సౌదీ అరేబియాలోకి రక్షణ పేరుతో అమెరికన్ సైన్యం చొరబడడాన్ని ఆల్‌ఖైదా ఖండించింది. అల్జీరియాలో ఎన్నికైన ప్రభుత్వాన్ని అధికారం చేపట్టకుండా అమెరికా అడ్డుకోవడాన్నీ, సోమాలియాలో సైనిక జోక్యాన్ని ఇస్లామిక్ దేశాలన్నీ ఖండించాయి, ప్రతిఘటించాయి. 1998 ఆగస్టులో నైరోబీ, దార్ ఎస్ సలామ్‌లలోని అమెరికా రాయబార కార్యాలయాల మీద ఆల్‌ఖైదా బాంబులతో దాడులు చేసింది. ఇటువంటి అనేక రకాల మిలిటెంట్ చర్యలతో అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేకతను బహిర్గత పరుస్తొంది.

అమెరికా, ఇజ్రాయిల్ దురాక్రమణల నుండి ఇస్లామిక్ దేశాలను విముక్తి చేయడం ప్రధాన లక్ష్యంగా ఆల్‌ఖైదా తన ప్రణాళికలో చెప్పుకుంది. సాయుధ పోరాట మార్గాన్ని ఎంచుకుంది. క్షతగాత్రులు, బాధితులు, పీడితులు ప్రతిఘటనకు వెళ్లకుండా నిరోధించే, మోసపుచ్చే మితవాదాన్ని అవకాశవాదాన్ని ఖండించింది. అయితే ఈ సంస్థలో మత భావనలు, విశ్వాసాలు బలంగా వున్నాయి. అల్లా అండదండలతో ఉద్యమం నడుస్తుందని జీహాద్ (పవిత్ర యుద్ధం) ప్రతీ ముస్లిం కర్తవ్యం అని చెప్పింది.

ఆఫ్ఘనిస్తాన్‌లో రెండవ దశ పోరాటానికి లాడెన్ సర్వసన్నద్ధం చేసాడు. గెరిల్లా దళాలను నిరాయుధం చేసే ఐ.ఎస్.ఐ. అధికారుల ప్రయత్నాలను ఎదిరించాడు. అత్యధిక గ్రామీణ ప్రాంతాల గెరిల్లా దళాలను కూడగట్టి ముందుకు నడిపాడు. పాకిస్తాన్‌లోని తీవ్రవాద సంస్థల మద్దతు కూడగట్టగలిగాడు. ఆదివాసీ పెద్దలతో చర్చించి అమెరికా అనుకూల, నజీబుల్లా అనుకూల శక్తుల్ని చీల్చగలిగాడు. ఉత్తరాన తజక్, ఉజ్బెక్, తుర్క్‌మెన్ వంటి మైనారిటీ జాతులలో చీలిక తెచ్చి, అమెరికా ఏజెంట్లు మసూద్, దోస్తుంలను అనుసరించే విధానాన్ని వ్యతిరేకించాడు. వందలాది అరబ్ యువతను స్వదేశాలకు వెళ్లకుండా నిలబెట్టాడు. అలా వెళ్లిన వారిని తిరిగి వచ్చేలా విస్తృతంగా కృషి చేసాడు.

ముఖ్యంగా ఆఫ్ఘన్ ప్రజల నుండి పునాది వర్గాల నుండి అంచనాలకు మించి నూతన గెరిల్లా పోరాట యోధులు, నాయకత్వం ఎదిగివచ్చింది. రాజకీయ భావాలతో, సామ్రాజ్యవాద

వ్యతిరేక చైతన్యంతో ముల్లా ఉమర్ లాంటి వారి నాయకత్వం ఎదిగిరావడం మంచి పరిణామం. ఈ రెండో దశ పోరాట నాయకత్వం కింది నుండి అభివృద్ధి చెందింది.

1988 నుండే మొదలైన రెండవ దశ పోరాటం ఎన్నో కష్టనష్టాల మధ్య నడిచింది. ఆయుధాల కొరత, నిధుల కొరత, సప్లయిల సమస్యలున్నా ప్రజల అండదండలతో, విస్తృతమైన స్థానిక ప్రజల రిక్రూట్‌మెంటుతో గెరిల్లా పోరాటం సహజ సిద్ధంగానే వేగంగా అభివృద్ధి చెందింది. 1992 నాటికి దక్షిణ ఆఫ్ఘనిస్తాన్ కొండ ప్రాంతాలు విముక్తి జరిగి తర్వాత కాందహార్ విముక్తి జరిగింది. 1996లో కాబూల్ స్వాధీనం కావడంతో ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ ప్రభుత్వం ఏర్పడింది. తాలిబన్ల రాజ్యం నెలకొంది. అమెరికన్ సామ్రాజ్యవాద తొత్తు ప్రభుత్వం కూలింది. అనేక ఆటంకాలు కల్పించి ఆఫ్ఘన్ పోరాటాన్ని అడ్డుకున్న అమెరికా, నాటకీయంగా ఐ.ఎస్.ఐ. సహకారంతో దౌత్యం నడిపింది. అమెరికా తొత్తులైన సౌదీ అరేబియా, పాకిస్తాన్, కతార్, కువైట్ దేశాలు అమెరికా సలహా మేరకు తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించాయి. తాలిబన్ ప్రభుత్వాన్ని చీల్చి, లాడెన్‌ను దూరం చేయాలని కుట్రలు పన్నింది. కానీ అమెరికా కుట్రలు ఫలించలేదు. ప్రజలు లాడెన్‌ను బలంగా విశ్వసించారు.

1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తర్వాత, మధ్య ఆసియా దేశాలు రష్యన్ యూనియన్ నుండి బయటకొచ్చి అమెరికాకు దగ్గరయ్యాయి. అక్కడి సహజ వనరుల సరఫరాకు రోడ్డు మార్గంలో పైపులైన్ల నిర్మాణానికి తాలిబన్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది, రాయల్టీని డిమాండ్ చేసింది. తమ సార్వభౌమత్వాన్ని గుర్తు చేసింది. దీనిని అమెరికా అవమానంగా భావించి మళ్లీ దాడులకూ, కుట్రలకు పాల్పడింది. 2001 ఘటన తర్వాత ఆ కుట్రలను ఆచరణలోకి తీసుకుపోవడానికి సాకు దొరికింది. ఆఫ్ఘనిస్తాన్‌పై దాడి చేసి లాడెన్ కోసమే చేసానని, టెర్రరిస్టు వ్యతిరేక యుద్ధమని అబద్ధాలు చెప్పుకుంది. యుద్ధాన్ని రుద్ది దేశాన్ని స్మశాన వాటికగా మార్చింది. దుర్మార్గంగా ఆర్థిక దిగ్బంధనాన్ని విధించింది. కొత్త ప్రభుత్వపు సమస్యల్ని పెంచి రెండున్నర కోట్ల ప్రజలను ఆకలితో మాడ్చివేసింది.

లాడెన్ హత్యానంతరం అమెరికా విధానాల్లో మార్పులు కనబడుతున్నాయి. పాక్‌కు ఇచ్చే 800 మిలియన్ డాలర్ల సహకారాన్ని ఆపివేసే ఆలోచన చేస్తున్నది. తాలిబన్లతో చర్చలు చేయడానికి ప్రయత్నిస్తున్నది. యు.ఎన్.ఒ.తో మాట్లాడి తాలిబన్‌పై నిషేధాన్ని ఎత్తివేయించడానికి ప్రయత్నిస్తున్నది. ఆఫ్ఘనిస్తాన్‌ను తిరిగి తన ఆధీనంలో వుంచుకోవడానికి యు.ఎ.ఇ. కన్సల్టేటివ్‌గా చేరవచ్చు అని, ఆ విధంగా అమెరికా తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించవచ్చని చూస్తున్నది.

2014 నాటికి అమెరికా బలగాలను ఉపసంహరించుకుంటానని అంటున్నది. మిలాన్ ప్రాంతంతో పాటు మిలిటెంట్స్ బలంగా వుండే మరో ప్రాంతాన్ని ఇప్పటికే వదులుకుంది. ఇదంతా నాటకీయంగానే చేస్తున్నది. బలగాలను తరలించి సరిహద్దులో మోహరించడానికి ప్రయత్నిస్తూ తాలిబన్‌ల ప్రమాదం తగ్గిందని, ఆల్‌ఖైదా, లాడెన్ ప్రభావం లేదని చెప్పేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నది. ఇప్పటికే 120 అమెరికన్ మిలిటరీ విభాగాలు ఆఫ్ఘన్ – పాక్ సరిహద్దుల్లో వున్నాయి.

లాడెన్ పాకిస్తాన్‌లోనే హత్య గావించబడడంతో ఇండియా కూడా టెర్రరిస్టులపై దాడులు చేస్తానని హెచ్చరిస్తున్నది. ఆఫ్ఘన్‌కు పోయి వ్యాపార లావాదేవీలు నడుపుతున్నది. అమెరికాకు అనుకూలంగా వ్యవహరిస్తూ లాభపడే విధానాన్ని కొనసాగిస్తున్నది. ఈ విధానాన్ని నిరసించాల్సి వుంది.

ఇప్పుడు ఈజిప్టుకు చెందిన డాక్టర్ అల్‌జవహరి ఆల్‌ఖైదాకు నూతన నాయకుడుగా వున్నాడు. ఆల్‌ఖైదా కార్యకలాపాలు కొనసాగుతూనే వున్నాయి. ఆఫ్ఘనిస్తాన్ నుండి యెమెన్ వరకు విస్తరించాయి. ఇరాక్, సిరియాలలోని బాత్‌పార్టీలు, ఈజిప్టులోని ముస్లిం బ్రదర్ హుడ్, పాలస్తీనా హమాస్, లెబనాన్ హిజ్‌బుల్లాలు ఆయా దేశాల్లో పనిచేసే సంస్థలు కాగా ఆల్‌ఖైదా 50 దేశాలలో పనిచేసే సంస్థగా అభివృద్ధి చెందింది.

సామ్రాజ్యవాదంకు వ్యతిరేకంగా అనేక స్రవంతులుగా పోరాటాలు నడుస్తున్నాయి. అందులో ఆల్‌ఖైదా వంటి సంస్థల ప్రవాహం ఒకటి. ఇది బలమైనది. ప్రపంచ సోషలిస్టు విప్లవ పురోగమనంలో భాగంగా అన్ని రకాల సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలు ఏకం కావాలి. ఆల్‌ఖైదా వంటి ఉద్యమాలు మతవాద భావనల నుండి అతివాద ప్రభావాల నుండి బయటపడాల్సి వుంది. ప్రజలకు నష్టం కలిగే చర్యలను విడనాడాల్సి వుంది.

సామ్రాజ్యవాదం ఉన్నంతవరకు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి రష్యన్, అమెరికన్ సామ్రాజ్యవాదాలను ఓడించిన, తాలిబన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన, ఆల్‌ఖైదా సంస్థను ఏర్పరిచిన లాడెన్ శక్తివంతుడు. పీడిత ప్రజల్లో ముఖ్యంగా, ముస్లిం ప్రజల్లో సామ్రాజ్యవాద వ్యతిరేక స్ఫూర్తిగా చిరకాలం నిలుస్తాడు.

# ఫుకుషిమా అణు ప్రమాదం - మానవాళికి పెను హెచ్చరిక

మార్చి నెలలో సంభవించిన భూకంపమూ, సునామీ జపాన్‌ను కుదిపివేసాయి. ఈ విపత్తులో దాదాపు పదివేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఆస్తి నష్టానికి అంతులేదు. అనేకులు సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఉండడానికి వసతి లేక, తినడానికి తిండి లేక, తాగడానికి నీళ్లు లేక ఇక్కట్ల పాలయ్యారు. ఈ పరిస్థితి జపాన్ ప్రజానీకాన్ని తీవ్రంగా అతలాకుతలం చేసింది.

అయితే ఈ విపత్తు మరెన్నో రెట్ల అధికమైన ఇంకొక విపత్తుకు దారితీసింది. అది అణు విపత్తు. భూకంపం, సునామీల వలన జపాన్‌లోని ఫుకుషిమా రాష్ట్రంలోని అణు రియాక్టర్లలో సంభవించిన ప్రమాదం మూలంగా కల్గిన ప్రకంపనలు కేవలం జపాన్‌కే పరిమితం కాలేదు, ప్రపంచానికంతటికీ వ్యాపించాయి. ప్రపంచంలో ఇప్పటి దాకా జరిగిన అణు ప్రమాదాల్లో 1986లో ఉక్రేయిన్‌లోని చెర్నోబిల్ అణు కేంద్రంలో జరిగిన ప్రమాదం అతి పెద్దది. రెండో ప్రపంచ యుద్ధ సందర్భంగా హిరోషిమా, నాగసాకిలపై ప్రయోగించిన అణు బాంబుల విధ్వంస ప్రభావానికి మూడు లక్షల మంది ప్రజలు గురయితే, చెర్నోబిల్ ప్రమాదం తొమ్మిది లక్షల ప్రజానీకాన్ని ప్రభావితం చేసింది. అంతర్జాతీయ సూచిపై చెర్నోబిల్ ప్రమాదం ఏడుగా నమోదు కాగా, ఫుకుషిమా ప్రమాదం ఆరుగా నమోదు కావచ్చని భావిస్తున్నారు. అంటే చెర్నోబిల్ తర్వాత జరిగిన పెద్ద ప్రమాదంగా దీనిని గుర్తిస్తున్నారు. హిరోషిమా, నాగసాకీలపై జరిగిన అణు విధ్వంసం తర్వాత జపాన్ ఎదుర్కొంటున్న అతి పెద్ద అణు సంక్షోభంగా దీనిని జపాన్ ప్రభుత్వం పేర్కొనడాన్ని బట్టి కూడా ఈ విపత్తు తీవ్రతను ఊహించవచ్చు.

ఫుకుషిమాలోని రియాక్టర్లను చల్లబరిచే ప్రక్రియ దెబ్బతినడం వలన మూడు రియాక్టర్లు వేడెక్కి కొంతమేరకు కరిగిపోయాయి. మూడు రియాక్టర్లలో పేలుళ్లు సంభవించాయి. నాల్గవ రియాక్టర్‌లో అణు వ్యర్థ పదార్థాలకు మంటలంటుకున్నాయి. దీని వలన అణు మూలకాలు వాతావరణంలో వ్యాపించాయి. ఇది చాలా ప్రమాదకర పరిణామం. వాతావరణంలో కల్సిన అణుధార్మిక శక్తి గాలి, నీరు, ఆహారం ద్వారా మానవుల శరీరాల్లోకి ప్రవేశించి, మానవాళి ఆరోగ్యాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధులకు దారితీస్తుంది. వీర్యకణాలూ, అండ కణాలూ వీటి ప్రభావానికి గురి కావడం వలన వంశపారంపర్యంగా భవిష్యత్ తరాలకు కూడా నష్టం చేస్తుంది. దీని ప్రభావం ఎంత సుదీర్ఘకాలం కొనసాగుతుందంటే, ఒకసారి వాతావరణంలో కల్సిన అణు ధార్మిక పదార్థాలు పూర్తిగా నాశనం కావడానికి కొన్ని సెకన్ల కాలమూ పట్టవచ్చు, కొన్ని లక్షల సంవత్సరాలూ పట్టవచ్చు. అంటే అవి పూర్తిగా నాశనం అయ్యేంత వరకూ మానవాళి వినాశనానికి కారణం అవుతూనే వుంటాయి.

అణుధార్మిక శక్తిని మిలీరెమ్‌లలో కొలుస్తారు. సాధారణంగా ఒక వ్యక్తి ఏడాదికి 620 మిలీరెమ్‌లకు మించి తట్టుకోవడం కష్టం. ఫుకుషిమాలోని ఒక అణుధార్మిక కేంద్రం నుండి గంటకు 620 మిలీరెమ్‌ల అణు ధార్మిక శక్తి వెలువడుతున్నదంటే మనుషులు తట్టుకోగలిగే దానికంటే ఎన్ని వందల రెట్లు అధికంగా అణుధార్మికత వెలువడుతున్నదో అర్థం చేసుకోవచ్చు. మూడు లక్షల 75 వేల నుంచి అయిదు లక్షల మిలీరెమ్‌ల అణుధార్మికత వెలువడితే ఆ ప్రభావానికి గురైన వారిలో కనీసం సగం మంది మూడు నెలల్లోనే మృత్యువాత పడతారని అణు నియంత్రణ సంఘం అంచనా. అందుకే ఈ విపత్తు అనంతరం జపాన్ ప్రభుత్వం పది కిలోమీటర్ల పరిధిలోని మూడు లక్షలకు పైగా ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించింది. పది నుండి ఇరవై కిలోమీటర్ల మధ్య పరిధిలో వున్న ప్రజలు ఇళ్లలోంచి బయటకు రాకూడదనీ, ఎ.సి.లు వాడొద్దనీ, నల్లాల్లో నీరు తాగొద్దనీ, బయట బట్టలు ఆరేయవద్దనీ కూడా ప్రకటనలు చేసింది. ఆవు పాలల్లో కూడా అణు ధార్మిక పదార్థాలు కనబడడంతో పాలను తాగొద్దనే ప్రకటనలు కూడా వచ్చాయి. అణు ధార్మిక పదార్థాల ప్రభావం చాలా దూరం విస్తరించింది. జపాన్ రాజధాని టోక్యో వైపు పయనిస్తున్నాయనే వార్తలు తెలుసుకొని ప్రజలు తీవ్ర ఆందోళనలకు గురయ్యారు. చాలా మంది పట్టణాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయారు. ప్లాంటుకు 60 మైళ్ల దూరంలో ప్రయాణించిన హెలీకాప్టర్లలో సైతం ఈ ప్రభావం కనిపించింది. ఈ అణు ధార్మిక పదార్థాల ప్రభావం సుదీర్ఘ కాలంగా వుంటుంది కనుక ఇప్పుడు ఖాళీ చేసిన ప్రజలు స్వస్థలాలకు ఎప్పుడు వస్తారో చెప్పలేని పరిస్థితి. ఎందుకంటే చెర్నోబిల్ ప్రమాదానంతరం తరలింపుకు గురైన ప్రజలు పాతికేళ్ల తర్వాత కూడా ఇప్పటికీ తమ స్వస్థలాలకు రాలేదు. చెర్నోబిల్ చుట్టూ 30 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతం ఇప్పటికీ నిషిద్ధ ప్రాంతంగానే వుంది.

ఇటువంటి ప్రమాదకర పరిస్థితి ఈ గడ్డు కాలంలో జపాన్‌కు ప్రపంచవ్యాప్తంగా అందవలసిన సాయంపై ప్రభావాన్ని వేస్తోంది. పలు అంతర్జాతీయ సేవా సంస్థలు అణు భయం చేత సాయానికి దూరంగా వుండిపోయాయి. ఫుకుషిమా ప్లాంటు సిబ్బందికి సాయపడేందుకు అక్కడికి చేరుకున్న అమెరికా అణు నిపుణులకు అణు ధార్మికత సోకింది. వీరు ప్రయాణించిన విమానం ప్లాంటులో పేలుడు జరిగిన పొగలోంచి వెళ్లడం

వల్ల ఇది సంభవించింది. దీంతో ప్లాంటు తీరంలోని తమ విమానాలను, యుద్ధ నౌకలను అమెరికా వేరే చోటుకు తరలించింది. ఫ్రాన్స్, జర్మనీ, చైనాలు తమ దౌత్య సిబ్బందిని వెనక్కి పిలుపించుకున్నాయి.

అణు ధార్మిక పదార్థాల వినియోగం పట్ల మన వైఖరి ఎలా వుండాలి అనే చర్చను ఫుకుషిమా విషాదం మరోసారి మనముందుకు బలంగా తెచ్చింది.

సంవత్సరం క్రితం తమ దేశంలో మరిన్ని అణు విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని జర్మనీ ప్రకటించి వుంది. కానీ ఈ ప్రమాదం తర్వాత 2022 నాటికి 17 అణు విద్యుత్ కేంద్రాలను మూసివేస్తామని అది ప్రకటించింది. 'మేం తీసుకున్న ఈ నిర్ణయం ఇతర దేశాలకు మంచి ఉదాహరణగా మారుతుంది' అని కూడా ప్రకటించింది. పరిశ్రమ వర్గాలూ, పాలక పార్టీలోని కొంత మంది నుంచి బలమైన వ్యతిరేకత వచ్చినప్పటికీ అది పట్టించుకోలేదు. స్విట్జర్లాండ్ కూడా ప్రతిపాదనలో వున్న కొన్ని ప్రాజెక్టులను పక్కన పెట్టేసింది.

కానీ భారత్ మాత్రం ప్రస్తుత తన అణు కార్యక్రమం నుండి కొంచెం కూడా వెనక్కు తిరిగి చూడదల్చుకోవడం లేదు. నిన్నటి చెర్నోబిల్, నేటి ఫుకుషిమాలే కాదు, చెర్నోబిల్‌కు ముందూ వెనుకా ప్రపంచవ్యాప్తంగా ఈ స్థాయిలో కాకపోయినా వేల సంఖ్యలో అణు ప్రమాదాలు జరిగాయి. మన దేశంలోనూ జరిగాయి. టెక్నాలజీ పరంగా ఎంతో అభివృద్ధి చెందిన జపాన్‌కు గతంలో కూడా ఎన్నో అణు ప్రమాదాలు జరిగిన చరిత్ర వుంది. అమెరికాలోనూ జరిగాయి. మరి మన దేశంలో జరగడంలో ఆశ్చర్యం ఏముంది? అయితే మన దేశంలో జరిగిన ఎన్నో అణు ప్రమాదాలను ప్రపంచానికి తెలియకుండా జాగ్రత్త పడ్డారు. బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ గణాంకాల ప్రకారం మన దేశంలో గత పదిహేను సంవత్సరాల కాలంలో అణుశక్తి సంస్థల్లో పనిచేస్తున్న 1,930 మంది శాస్త్రజ్ఞులు, ఉద్యోగులు చనిపోయారు. అయితే ఇందులో ఎంతమంది అణు ధార్మికత వలన చనిపోయారో బహిర్గతం కాకుండా జాగ్రత్తపడ్డారు. పలు అణు కేంద్రాల నుండి అణు ధార్మికతకు గురైన కారణంగా వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగించారు.

అణు కేంద్రాల మూలంగా ఇంత విపత్తు జరుగుతున్నా మన్‌మోహన్ సర్కార్ అణు కార్యక్రమానికి గట్టిగా కట్టుబడి వుంది. అభివృద్ధిలో ముందుకు పోవాలంటే అణు విద్యుత్ తప్పనిసరని ఊదరగొడ్తాంది. దీంట్లో భాగంగా 2006లోనే అమెరికాతో అణు ఒప్పందం చేసుకుంది. 2010లో బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా అణు పరిహార బిల్లును తెచ్చింది. రాబోయే పది సంవత్సరాల కాలంలో లక్షల కోట్ల రూపాయల విలువ చేసే అణు రియాక్టర్లు కొనడానికి రంగం సిద్ధమైంది. గత కొన్నేళ్లుగా అమెరికా దగ్గర అణు రియాక్టర్లు గుట్టలు పడివున్నాయి. వాటికి మార్కెట్ కల్పించడానికి మాత్రమే ఈ అభివృద్ధి మంత్రాన్ని జపిస్తోంది. వాటికి మార్కెట్ కల్పించడానికి మానవాళిపై ఎంతటి విపత్తునైనా రుద్దడానికి భారత పాలకులు సిద్ధంగా వున్నారు.

ఈ ప్రమాదం నేపథ్యంలో ప్రజల్లో వచ్చిన అణు వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకొని మన పాలకులూ, పాలకుల వత్తాసు పలికే అణు శాస్త్రవేత్తలు రక్షణ చర్యల గురించే మాట్లాడుతున్నారు తప్ప అణు కార్యక్రమాన్ని సమీక్షించుకుంటామని కనీసం మాట మాత్రంగానైనా చెప్పడం లేదు.

మన దేశంలో ప్రస్తుతం 19 రియాక్టర్లు పనిచేస్తున్నాయి. వీటి సంఖ్యను పెంచాలని పాలకులు గట్టిగా యోచిస్తున్నారు. మొత్తంగా మన దేశ తీర ప్రాంతం పొడుగూతా 55 కిలోమీటర్లకు ఒకటి చొప్పున అణు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భారత అణు ఇంధన శాఖ ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం. మరి కొన్ని చోట్ల నిర్మాణాల కోసం తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. మహారాష్ట్రలోని జైతాపూర్, తమిళనాడులోని కూడంకళం, ఒడిశాలోని సోనేపూర్, గుజరాత్‌లోని మిథివిర్ది, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ ఇందులో ముఖ్యమైనవి. ఫుకుషిమా ప్రమాదం తర్వాత గుంటూరు జిల్లా నిజాంపట్నంలోనూ, కడప జిల్లా పులివెందులలోనూ అణు కేంద్రాలను నెలకొల్పుతామని ప్రకటించారు. మొత్తంగా 2032 నాటికి 60 వేల మెగావాట్ల అణు విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం మాట్లాడుతోంది.

ఈ అణు కేంద్రాలన్నింటిని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం లక్ష్యపెట్టడం లేదు. పదివేల మెగావాట్ల సామర్థ్యంతో జైతాపూర్‌లో తలపెట్టిన అణు విద్యుత్ కేంద్రం ప్రపంచంలోనే అతి పెద్దది అవుతుంది. మన దేశంలో భూకంపాలు వచ్చే అవకాశం వున్న ప్రాంతాల్ని అయిదు విభాగాలుగా విభజించారు. అయిదో విభాగం అత్యంత ప్రమాదకరమైనది. అంటే భూకంపాల తీవ్రత అధికంగా వుండే ప్రాంతం. జైతాపూర్ మూడో విభాగానికి చెందినదని కాబట్టి భూకంపాలు వచ్చినా తీవ్రత సాధారణ స్థాయిలోనే వుంటుంది కనుక భయపడాల్సిన పనిలేదని పాలకులు చెప్తున్నారు. కానీ ఈ కేంద్రాన్ని వ్యతిరేకిస్తున్న ఉద్యమకారులు మాత్రం ఇది నాలుగో విభాగంలోకి వస్తుంది కనుక ప్రమాదకరమని వాదిస్తున్నారు. 1985 నుంచి 2005 వరకు ఈ ప్రాంతంలో దాదాపు 92 సార్లు భూకంపాలు వచ్చాయి. 93లో వచ్చిన భూకంపంలో తొమ్మిది వేల మంది చనిపోయారు. కాబట్టి ప్లాంట్‌ను నిర్మించవద్దని గత మూడు సంవత్సరాలుగా రైతులు పోరాడుతున్నారు. ఈ పోరాటంపై ప్రభుత్వం తీవ్ర అణచివేతకు పాల్పడుతున్నది. ఇక్కడికి సంఘాలకు చెందిన కార్యకర్తలు ఎవరూ రాకూడదనే అప్రజాస్వామిక నిబంధనను విధించింది. ఏప్రిల్ 18న అంటే ఫుకుషిమా ప్రమాదం జరిగిన తర్వాత ఈ ప్లాంటుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఉద్యమకారులపై కాల్పులు జరగడంతో ఇద్దరు రైతులు మరణించారు

ఎనిమిది వేల మెగావాట్ల సామర్థ్యంతో తలపెట్టిన గుజరాత్‌లోని మిథివిర్ది ప్రాంతం కూడా మూడవ విభాగం కిందికి వస్తుంది. 2001లో ఇక్కడ వచ్చిన భూకంపంలో వేల మంది చనిపోయారు. అయితేనేం సామ్రాజ్యవాదుల సేవే తప్ప ప్రజల ప్రాణాల పట్ల ఏ మాత్రం లక్ష్యం లేని పాలకులు ఇటువంటి సున్నితమైన ప్రాంతాల్లో ప్రాణాంతక కేంద్రాలను నిర్మించడానికి పూనుకుంటున్నారు.

శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ ప్రాంతంలో పదివేల మెగావాట్ల సామర్థ్యంతో 2,350 ఎకరాల్లో తలపెట్టిన అణు విద్యుత్ కేంద్రం వలన 113 గ్రామాలు ప్రభావితం కాబోతున్నాయి. ఈ గ్రామాల్లో దాదాపు లక్ష మంది ప్రజలు నిర్వాసితులు కాబోతున్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు తీవ్రంగా పోరాడుతున్నారు. ఆ పోరాటం మాత్రమే 92 నుండి ప్రతిపాదనలో వున్న ఈ ప్లాంటును రాకుండా ఇప్పటిదాకా ఆపగలిగింది.

అణుకేంద్రాలు పెరుగుతున్న కొద్దీ యురేనియం అవసరాలు పెరుగుతాయి. అందుకోసం యురేనియం తవ్వకాలు పెరుగుతున్నాయి. ఇప్పటిదాకా చేసిన అధ్యయనాల ప్రకారం మన దేశంలో ఆరు ప్రాంతాలలో యురేనియం ఎక్కువగా దొరికే అవకాశం వుంది. అందులో మూడు మన రాష్ట్రంలోనే వున్నాయి. యురేనియం తవ్వకాలు ఎన్నో నష్టాలకు దారి తీస్తాయి. ముడి ఖనిజాన్ని నీటితో శుభ్రపరుస్తారు. శుభ్రం చేసిన తర్వాత వదిలిన నీటిలో అణు ధార్మిక పదార్థాలు కల్సివుంటాయి. ఇవి భూమిలో కల్సి భూగర్భ జలాలను కలుషితం చేస్తాయి. ముడి పదార్థం కొరకు జరిపే అన్వేషణలో భాగంగా తవ్వే బోర్ల వలన భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. కడప జిల్లాలోని తుమ్మల పల్లి ప్రపంచం లోనే ఎక్కువగా యురేనియం దొరికే మొదటి 20 ప్రాంతాల్లో ఒకటి. ఇక్కడ జరుపుతున్న యురేనియం తవ్వకాల వలన సమీపంలోని భూమయ్యగారి పల్లెలో దాదాపు వంద బోర్లు ఎండిపోయాయంటే పరిస్థితి తీవ్రతను ఊహించుకోవచ్చు. యురేనియం తవ్వకాలు పెరిగే కొద్దీ యురేనియంను శుద్ధి చేసే కర్మాగారాలు కూడా సహజంగానే పెరుగుతాయి. తాజాగా కర్నూలు జిల్లా ఆదోనిలో యురేనియం శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించుకుంది.

యురేనియంను అణు కేంద్రాల్లో వినియోగించాలంటే దాన్ని మొదట శుద్ధి చేయాల్సి వుంటుంది. ఇలా శుద్ధి చేసిన యురేనియంను భద్ర పరచడానికి ప్రత్యేకమైన నిర్మాణాలు వుండాలి. లేకుంటే దాని నుంచి అణు ధార్మికత వెలువడుతుంది. యురేనియంను విద్యుత్ కేంద్రాల్లో వినియోగించిన తరువాత వచ్చే వ్యర్థ పదార్థాలను భద్రపరచడం కూడా పెద్ద సమస్యే. ఇవి కూడా అణు ధార్మికతను వెదజల్లుతాయి. ఫుకుషిమాలో అణు రియాక్టర్ల కన్నా వాడి పడేసిన ఫ్యూయల్ రాడ్స్‌లో అత్యధిక శాతం అణు ధార్మికత విడుదలైంది. ఇటువంటి ఫ్యూయల్ రాడ్స్ తారాపూర్ అణు కేంద్రంలో నాలుగు దశాబ్దాల నుండి పేరుకుపోయి వున్నాయి. వాటిని తీసుకోవాల్సిన అమెరికా వాటిని తిరస్కరించింది. పైగా తిరిగి వాటిని వాడడానికి మన దేశానికి అమెరికా అనుమతినివ్వలేదు. ఫలితంగా ఆ వ్యర్థ పదార్థాలు మనకు ముప్పుగా మారాయి. అణు విద్యుత్ వలన ప్రపంచానికి ఇంత ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నప్పటికీ దానికి బలంగా కట్టుబడి వున్న పాలకులు తమ విధానాలను ఎలా సమర్థించుకుంటున్నారంటే, థర్మల్ విద్యుత్ ప్లాంట్లు కాలుష్య కారకాలనేది ఒకటైతే, అణు విద్యుత్ చవక అనేది మరొకటి. థర్మల్ విద్యుత్ ప్లాంట్లు కాలుష్య కారకాలనేది నిజమే. కానీ ఆ కాలుష్యాన్ని తప్పించుకోవడానికి అంతకంటే ప్రమాదకరమైన అణు విద్యుత్ కేంద్రాల వైపు మొగ్గు చూపడమంటే, పెనం మీది నుంచి పొయ్యిలోకి దూకడమే. సౌరశక్తి విద్యుత్, జల విద్యుత్ వంటివి పూర్తిగా కాలుష్య రహితం. చెత్త నుండి కూడా చైనా విద్యుత్ తయారు చేస్తున్నది. ఇది మరింత ప్రయోజనకరమైనది, ప్రపంచవ్యాప్తంగా గుట్టలుగా పేరుకుపోతున్న చెత్త నుండీ, అది వెదజల్లే కాలుష్యం నుండి విముక్తి పొందవచ్చు.

ఇది చవక అనేది కూడా వాస్తవ దూరం. ప్రస్తుతం తారాపూర్‌లో ఉత్పత్తి అవుతున్న విద్యుత్ ఖరీదు యూనిట్‌కు రూ. 2.85లు, కైగాలో రూ.3.03లు, కూడంకళంలో రూ. 3.75లు. థర్మల్ విద్యుత్ యూనిట్ ఖరీదు ఒక రూపాయి నుంచి రూ. 1.50 వుంటుంది. జలవిద్యుత్ అయితే మరీ చవక. కేరళలోని కొన్ని జల విద్యుత్ ప్రాజెక్టుల్లో యూనిట్‌కు మూడు పైసలకే విద్యుత్ ఉత్పత్తి అవుతోంది.

కాలుష్య రహితంగా, చవకగా విద్యుత్ తయారు చేయడమే లక్ష్యమైతే పాలకుల ముందు ఎన్నో ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. కానీ ఇటువంటి ప్రత్యామ్నాయాలను ఎన్నుకుంటే ఎం.ఎన్.సి.ల దగ్గర పేరుకుపోయిన అణు రియాక్టర్లు ఎలా అమ్ముడు పోతాయి? వాటికి లాభాలు ఎలా చేకూరుతాయి?

ఎం.ఎన్.సి.ల ప్రయోజనాలను నెరవేర్చడానికి ప్రజలను బలిపెట్టడానికి పాలకులు ఎంతగా తెగిస్తున్నారంటే, కనీసం రియాక్టర్ల నాణ్యతను కూడా పట్టించుకోవడం లేదు. అమెరికా, ఫ్రాన్స్‌ల నుండి పరీక్షలు నిర్వహించని రియాక్టర్లను దిగుమతి చేసుకుంటున్నారు. జైతాపూర్‌కు తెప్పించాలనుకుంటున్న తరహా రియాక్టర్లతో ఫ్రాన్స్‌లో ప్లాంట్ నిర్మాణం అయింది. దీన్ని పరిశీలించిన ఫిన్నిష్, ఫ్రెంచ్, బ్రిటన్‌లకు చెందిన ఇంజనీర్లు నాణ్యతాపరంగా, భద్రతా పరంగా అందులో మూడు వేల లోపాలున్నట్లు కనుక్కున్నారు. దీని తర్వాత సౌదీ అరేబియా ఈ రకం రియాక్టర్ల కోసం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. జయితాపూర్ ప్రాజెక్ట్‌కు జర్మనీకి చెందిన 'కామర్జ్ బాంక్' ఆర్థిక సహకారం అందించడానికి మొదట ముందుకు వచ్చింది. కానీ రియాక్టర్లలోని లోపాలు బయటపడ్డాక తమ పేరు పోతుందనే దానితో తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంది. ఇప్పుడు కొవ్వాడలో స్థాపించదలుచుకున్న రియాక్టర్ నమూనాయే ఫుకుషిమాలో పేలిపోయింది.

# తెలంగాణావాది ఆచార్య కొత్తపల్లి జయశంకర్

# మృతికి సంతాపం ప్రకటిద్దాం!



ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తన జీవిత కాలమంతా శ్రమించిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్, జూన్ 21న క్యాన్సర్ వ్యాధితో కన్నుమూశాడు. ఆయన మృతికి 'క్రాంతి' సంతాపం ప్రకటిస్తోంది.

ఆచార్య జయశంకర్ వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో 1934, ఆగస్టు 6న జన్మించాడు. ప్రాథమిక విద్యనభ్యసిస్తున్న కాలంలోనే 'వందేమాతరం' నినాదమిచ్చాడు. బనారస్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో ఎం.ఎ పట్టా పొందాడు. పి.హెచ్.డి సాధించడానికి తెలంగాణలోని ఆర్థిక, సామాజిక అసమానతలనే పరిశోధనాంశంగా ఎంచుకున్నాడు. 1952లో నాన్ ముల్కీ ఉద్యమంలో పాల్గొన్నాడు. విశాలాంధ్రను వ్యతిరేకిస్తూ మొట్టమొదటి ఎస్సార్సీ ముందు హాజరై, తెలంగాణ వాణిని బలంగా విన్పించిన మేధావి. 1962లో, 1968లో తెలంగాణ ఉద్యమానికి తన పరిశోధనా రచనల ద్వారా తోడ్పాటును అందించాడు.

విశ్వవిద్యాలయాల్లో రిజిస్ట్రార్‌గా, వైస్‌ఛాన్సలర్‌గా ఉన్నత పదవులు అందుకున్నప్పటికీ తెలంగాణ వాదాన్ని విస్మరించలేదు. మూడు దశాబ్దాలుగా సాగిన తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ కీలకపాత్ర పోషించాడు. ముఖ్యంగా 1996 మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలకమైన తెలంగాణ విద్యావంతుల వేదిక ఏర్పాటులో జయశంకర్ ప్రధానపాత్ర వహించాడు. తెలంగాణ రాష్ట్రసమితి ఆవిర్భావానికి పరోక్షంగా ఆయనే కారణం. అనేక దేశాల్లో పర్యటించి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రానికి మద్దతు సాధించాడు.

తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ఇంగ్లీషులో, తెలుగులో ఎన్నెన్నో వ్యాసాలను, పలు పుస్తకాలను రాశాడు. తెలంగాణ నినాదం ఆంధ్రా ప్రాంతం వాళ్లకు, తెలంగాణ ప్రాంతంలో స్థిరపడిన సామాన్య ప్రజానీకానికి వ్యతిరేకం ముమ్మాటికీ కాదని స్పష్టం చేసినవాడు. తెలంగాణ భాషా సంస్కృతులను, ఆచార వ్యవహారాలను కించపరుస్తున్న సంస్కారహీనుల పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసేవాడు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రాంతం వివక్షతతో పాటు, ఏ విధంగా దోపిడికి గురి అయిందీ గణంకాలతో సహా నిరూపించిన పరిశోధకుడు. తెలంగాణపై సంపూర్ణ అవగాహన కలిగి, ఉద్యమంతో పూర్తిగా మమేకమయ్యాడు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సమీప భవిష్యత్తులోనే సాధించి తీరుతామని దృఢంగా విశ్వసించాడు. రాజ్యాంగ ప్రక్రియ ద్వారా మాత్రమే తెలంగాణ సాధించాలని విశ్వసించి, సాధించలేక పోయినందుకు చివరి రోజుల్లో ఎంతో ఆవేదన చెందాడు. లాబీయింగ్‌ల ద్వారా తెలంగాణను సాధించాలని ప్రయత్నిస్తున్న టి.ఆర్.ఎస్‌ను ఆ మార్గం నుంచి పోరాటం వైపు మళ్ళించలేక పోయినా తన చివరి శ్వాస వరకు తెలంగాణ కొరకు స్వప్నించి, అహరహం శ్రమించాడు. ఆచార్య జయశంకర్ భౌతికంగా లేకపోయినా ఆయన స్ఫూర్తి తెలంగాణ ప్రజానీకంలో చిరకాలం నిలిచి వుంటుంది.

పాలకుల అణు కార్యక్రమానికి ఎటువంటి ఆటంకాలు కలగకుండా చట్టాలను కూడా పకడ్బందీగా రూపొందించారు. ఇండియన్ అటామిక్ ఎనర్జీ చట్టం 1962 ప్రకారం అణు సంస్థల్లో ఎవర్నీ ప్రశ్నించే అవకాశం లేదు. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 అణు సంస్థలకు వర్తించదు. అణుశక్తి విభాగానికి కేటాయించే బడ్జెట్ వివరాలు అతి రహస్యం. చివరకు పార్లమెంటుకు కూడా చెప్పనవసరం లేదు. అణు ధార్మికత గురించి పరీక్షలు కూడా కేవలం ప్రభుత్వ అణుశక్తి సంస్థలే చేయాలి. ప్రైవేట్ సంస్థలు చేయకూడదు. ప్రభుత్వ సంస్థలు ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా నివేదికలు ఇస్తాయి తప్ప సాధారణంగా వాస్తవాలు బయటపెట్టవు.

అణు కేంద్రాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా చాలా ఎక్కువ. అణు కేంద్రాల్లో పని చేసే పలు రకాల యంత్రాల్లో వచ్చే చిరు సమస్యలు, మానవ తప్పిదాలు కూడా పెను ప్రమాదాలకు దారి తీయవచ్చు. ఈ ప్రమాదాలను ఎదుర్కొనే సాంకేతిక సామర్థ్యం కూడా మనకు తగినంత లేదు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన జపాన్ దేశం, ఫుకుషిమా ప్రమాదాన్ని అదుపు చేయడానికి ఐ.ఎ.ఇ.ఎ. సహాయాన్ని కోరిందంటే మన దేశ పరిస్థితిని ఊహించుకోవచ్చు.

అణు విద్యుత్ ప్రయోజనాల గురించి ఊదరగొట్టడం, ఆందోళనలను అణచిపెట్టడం, అనుకూలమైన చట్టాలను, విధానాలను రూపొందించుకోవడం... ఇలా పలు రకాలుగా అణు కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు పాలకులు. సంఘటిత, మిలిటెంట్ పోరాటాలతో దీనికి ప్రజలు అడ్డుకట్ట వేయాలి. చెర్నోబిల్, ఫుకుషిమాలు ఇంకెంత మాత్రమూ పునరావృతం కాకూడదు.

# జపాన్ వ్యతిరేక శక్తులన్నింటినీ ఐక్యం చేసి కమ్యూనిస్టు

**ఫిబ్రవరి 1, 1940**

ఏనాన్‌లోని సకల రంగాలకూ చెందిన ప్రజలందరమూ ఈనాడు ఇక్కడ ఎందుకు సమావేశమవుతున్నాం? ద్రోహి వాంగ్ చింగ్ – వీని గర్హించటానికీ, జపాన్ వ్యతిరేక శక్తులన్నింటినీ ఐక్యంచేసి కమ్యూనిస్టు వ్యతిరేక మొండిఘటాలతో పోరాడటానికీ మనమందరమూ ఇక్కడ సమావేశమయ్యాం.

జపాన్ సామ్రాజ్యవాదం చైనాను బానిసగా చేసుకోవాలని గట్టి పట్టుదలతో వుందని కమ్యూనిస్టులం పదే పదే చెబుతూనే వున్నాం. జపాన్ మంత్రివర్గంలో ఎలాంటి మార్పులు జరిగినప్పటికీ, చైనాను లొంగదీసుకొని వలసగా మార్చుకోవాలనే దాని మూల విధానంలో మాత్రం మార్పు వుండదు. చైనా బడా బూర్జువాజీలో జపాన్ అనుకూల వర్గాల రాజకీయ ప్రతినిధియైన వాంగ్‌చింగ్ – వీ ఈ నిజాన్ని చూసి భయకంపితుడై మతి పోగొట్టుకొని జపాన్‌వద్ద మోకరిల్లి, చైనాను జపాన్ సామ్రాజ్యవాదానికి దాసోహం చేసే విద్రోహపు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అంతేకాక జపాన్ వ్యతిరేక ప్రభుత్వానికి, సైన్యానికి వ్యతిరేకంగా అతడొక కీలుబొమ్మ ప్రభుత్వాన్నీ, సైన్యాన్ని కూడా ఏర్పాటు చేయగోరుతున్నాడు. ఇటీవల అతడు ఛాంగ్కైషేక్‌ను వ్యతిరేకించే ప్రస్తావనే చేయడంలేదు. 'చాంగ్కై షేక్ మైత్రి' వైపు మొగ్గు చూపుతున్నాడని కూడా వినికిడి. జపాన్‌కూ వాంగ్ చింగ్ – వీకీ కూడా ప్రధాన లక్ష్యం కమ్యూనిస్టు వ్యతిరేకతే. జపాన్‌తో పోరాడటానికి అత్యంత తీవ్రమైన పట్టుదలతో వున్నది కమ్యూనిస్టు పార్టీయేననీ, కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్టు పార్టీల మధ్య సహకారం అంటే ప్రతిఘటన బలం పెరగటమేనని గ్రహించి ఈ సహకారాన్ని విచ్ఛిన్నం చేసి రెండు పార్టీలను విడదీయాలనీ, వీలైతే ఆ రెండూ ఒక దానితో ఒకటి పోట్లాడుకునేటట్లు చేయాలనీ వారు తమకు చేతనయిన ప్రయత్నాలన్నీ చేస్తున్నారు. కనుకనే ప్రతిచోటా వారు చికాకులను సృష్టించటానికై కొమింగ్‌టాంగ్‌లోని పిడివాదులను ఉపయోగించుకొంటున్నారు. హూనాన్‌లో పింకియాంగ్ మూకుమ్మడి హత్యాకాండ,[1] హెూనాన్‌లో చుయేషాన్ మూకుమ్మడి హత్యాకాండ[2] జరిగాయి. షాన్సీలో పాత సైన్యం కొత్త సైన్యంపై దాడిచేసింది.[3] హోపైలో చాంగ్ యిన్ – వూ ఎనిమిదవ మార్గ సైన్యంపై దాడిచేశాడు,[4] షాంటుంగ్‌లో చిన్ చి – జంగ్ గెరిల్లాలపై[5] దాడిచేశాడు. తూర్పు హూపేలో చాంగ్ జు – హువై అయిదారు వందలమంది కమ్యూనిస్టులను వధించాడు.[6] ఇక షెన్సి – కాన్సు – నింగ్సియా సరిహద్దు ప్రాంతానికి సంబంధించి, యీ పిడివాదులు, లోపల నుండి గూఢచారుల వల పన్నాలనీ బయట నుండి దిగ్బంధం చేయాలని ప్రయత్నిస్తూ, సాయుధ దాడికి[7] సమాయత్తమవుతున్నారు. వీటికి తోడుగా వారు, అభివృద్ధి కాముకులైన అనేక మంది యువకులను అరెస్టు చేసి నిర్బంధ శిబిరాలకు పంపారు.[8] అధిభౌతికవాద తత్వవేత్త చాంగ్ చున్ మై కిరాయి సేవలను ఎనిమిదవ మార్గ సైన్యం, నూతన నాల్గవ సైన్యాలను రద్దు చేయాలనే అభివృద్ధి నిరోధక ప్రతిపాదనలను చేయించారు; ట్రాట్స్కైట్ యేచింగ్ తదితరులను కిరాయికి పురమాయించి కమ్యూనిస్టు పార్టీని తిట్టిపోస్తూ వ్యాసాలు రాయించారు. వీటన్నింటి లక్ష్యం ఒక్కటే – జపాన్ వ్యతిరేక ప్రతిఘటనను విచ్ఛిన్నం చేయటం, చైనా ప్రజలను వలస బానిసలుగా[9] మార్చడం.

ఆ విధంగా, వాంగ్ చింగ్ – వీ ముఠా, కొమింగ్‌టాంగ్‌లో కమ్యూనిస్టు వ్యతిరేక మొండిఘటాలూ లాలూచీ పడి ఒకరు లోపలి నుంచి, మరొకరు బయట నుంచి కృషి చేసి గందరగోళాన్ని సృష్టించారు.

ఈ పరిస్థితులు ఎంతోమంది ప్రజల్లో క్రోధాన్ని రెచ్చగొట్టాయి. వారు జపాన్‌ను ప్రతిఘటించే పని యిక ముగిసిపోయిందనీ, ప్రతిఘటన వీగిపోయిందనీ, కొమింగ్‌టాంగ్ సభ్యులందరూ దొంగవెధవలే; వారందర్నీ తప్పక వ్యతిరేకించ వలసిందేననీ భావిస్తున్నారు. వారి కోపం న్యాయమైనదే. ఎందుకంటే, అటువంటి ఘోర పరిస్థితిలో ఎవరయినా రెచ్చిపోకుండా ఎలా వుండగలరు? కాని జపాన్ వ్యతిరేక ప్రకటన ముగిసిపోనూలేదు, ఓడిపోనూలేదు. కొమింగ్‌టాంగ్ సభ్యులందరూ దొంగ వెధవలూ కానూ కారు. కొమింగ్‌టాంగ్ విభిన్న సెక్షన్లపట్ల విభిన్నమైన విధానాల నవలంభించాల్సి వుంటుంది. ఎనిమిదవ మార్గ సైన్యం, నూతన నాల్గవ సైన్యాలను వెన్నుపోటు పొడవడానికి సాహసించిన వాళ్ళూ, పింకియాంగ్, చుయేషాన్ మూకుమ్మడి హత్యాకాండలు జరిపించిన వాళ్ళూ, సరిహద్దు ప్రాంతాన్ని విచ్ఛిన్నం చేయజూచినవాళ్ళూ, అభివృద్ధి కాముక సైన్యాలు, సంస్థలు, వ్యక్తులపై దాడిచేయ సాహసించిన ఆ బుద్ధిలేని దొంగ వెధవలెవ్వరినీ, సహించరాదు. వారిపై ఎదురుదెబ్బ తీయాల్సిందే. వారిపట్ల ఎటువంటి కనికరమూ

# వ్యతిరేక మొండి ఘటాలతో పోరాడండి

**- కామ్రేడ్ మావో**

చూపే ప్రశ్నేలేదు. ఎందుకంటే యీ దొంగ వెధవలకెంత బుద్ధి లేకుండా పోయిందంటే విదేశీ శత్రువు మన భూభాగంలోకి చాలా లోతుగా చొచ్చుకు వచ్చిన తర్వాత కూడా వాళ్ళు మూకుమ్మడి హత్యాకాండలకు పాల్పడుతూ, చీలికలు రెచ్చగొడుతూ, మన మధ్య 'ఘర్షణ' సృష్టించడానికి కూడా తయారవుతున్నారు. వాళ్ళ ఆలోచనలు ఏమైనా కావచ్చు కాని నిజానికి వారు జపాన్‌కూ, వాంగ్ – చింగ్ – వీ కే సహాయపడుతున్నారు. వాళ్ళలో కొందరు మొదటి నుండీ కూడా ముసుగులో దాగివున్న ద్రోహులే. వారిని శిక్షించడంలో విఫలమైతే అది పెద్ద తప్పే అవుతుంది. అది ద్రోహులకు, లొంగుబాటుదార్లకు ప్రోత్సాహకం అవుతుంది. అది జాతీయ ప్రతిఘటనకూ, మన మాతృ భూమికి నమ్మక ద్రోహమే అవుతుంది. ఐక్యసంఘటనను విచ్ఛిన్నం చేయటానికి దొంగ వెధవలందరికీ అది ఆహ్వానమే అవుతుంది. అది మన పార్టీ విధానాన్ని అతిక్రమించడవే అవుతుంది. ఏది ఏమైనా లొంగుబాటుదార్లు, కమ్యూనిస్టు వ్యతిరేక మొండిఘటాలపై దెబ్బతీయటం అనే విధానపు ఏకైక లక్ష్యం జపాన్ వ్యతిరేక ప్రతిఘటనను కొనసాగించడమూ, జపాన్ వ్యతిరేక ఐక్యసంఘటనను కాపాడుకోవడమే. కనుక ప్రతిఘటనా యుద్ధంపట్ల విధేయత కలిగి లొంగుబాటు ధోరణి, కమ్యూనిస్టు వ్యతిరేకత లేని కొమింగ్‌టాంగ్ సభ్యులపట్ల మనం సుహృద్భావం చూపించాలి. వారితో సమైక్యం కావాలి, వారిని గౌరవించాలి. దేశాన్ని ఒక మార్గంలో పెట్టడానికై, వారితో దీర్ఘకాల సహకారం కొనసాగించడానికి మనం సుముఖంగా వుండాలి. దానికి భిన్నంగా వ్యవహరించే వారెవరయినా కూడా వారు పార్టీ విధానాన్ని అతిక్రమించినట్టే.

మన పార్టీ విధానం రెండు విధాలుగా వుంటుంది. ఒకవైపు జపాన్ వ్యతిరేక ప్రతిఘటన పట్ల విశ్వాసం కలిగివుండే సకల అభ్యుదయకర శక్తులనూ యావత్ప్రజానీకాన్ని ఐక్యపరచడం, ఇంకొకవైపు, బుద్ధిలేని దొంగ వెధవలూ, లొంగుబాటుదారులూ, కమ్యూనిస్టు వ్యతిరేక మొండిఘటాలందర్నీ ఎదిరించాలి. మన విధానంలోని ఈ రెండు అంశాలకూ లక్ష్యం ఒక్కటే. పరిస్థితులను మంచి మలుపు తిప్పి జపాన్‌ను ఓడించడమే ఆ లక్ష్యం. ప్రతిఘటన శక్తులనూ, అభివృద్ధికర శక్తులనూ అన్నింటినీ సమైక్యపరచి లొంగుబాటు శక్తులూ తిరుగుబాటు శక్తులన్నింటితో పోరాడి, ప్రస్తుత దిగజారుడు తనాన్ని అరికట్టి పరిస్థితిని మరల్చడానికై తీవ్రంగా కృషిచేయడమే కమ్యూనిస్టు పార్టీ, దేశంలోని యావత్ప్రజల కర్తవ్యం. ఇది మన మౌలిక పంథా. మనం ఆశావహంగా వున్నాం. ఎన్నటికీ నిరాశా, నిస్పృహలకు లోను కాము. లొంగుబాటుదార్లు, కమ్యూనిస్టు వ్యతిరేక మొండిఘటాలు ఎటువంటి దాడులు చేసినా మనం భయపడేదిలేదు. మనం వారిని సర్వనాశనం చెయ్యాలి. తప్పక చేస్తాం. చైనా తప్పకుండా జాతీయ విముక్తిని సాధిస్తుంది. చైనా ఎన్నటికీ నాశనం కాదు. చైనా అభివృద్ధి సాధించి తీరుతుంది. ఇప్పటి వెనుకబాటుతనం కేవలం తాత్కాలికమయిన విషయం మాత్రమే.

యావత్ దేశం యొక్క సమైక్యత, పురోభివృద్ధి ప్రతిఘటనా యుద్ధానికి అత్యవసరమని, నేటి మన సమావేశంలో యావత్ దేశ ప్రజానీకానికి స్పష్టం చేయదలిచాం కూడా. కొంతమంది కేవలం ప్రతిఘటన గురించి మాత్రమే నొక్కి చెప్పి సమైక్యత, అభివృద్ధి గురించి నొక్కి చెప్పడానికి యిష్టపడరు. ఒక్కొక్కప్పుడు వాటిగురించి మాట్లాడనే మాట్లాడరు. ఇది తప్పు. నిజమైన దృఢమైన సమైక్యత, నికరమైన అభివృద్ధి లేకుండా ప్రతిఘటనా యుద్ధాన్ని ఎలా నిలబెట్టుకోగలం? కొమింగ్‌టాంగ్ పార్టీలోని కమ్యూనిస్టు వ్యతిరేక మొండిఘటాలు కూడా సమైక్యత గురించి నొక్కి చెబుతారు. కాని వారి సమైక్యత నిజమైనది కాదు, వట్టి బూటకం. హేతుబద్ధమైనది కాదు, అపసవ్యమైనది. అది కేవలం సమైక్యతలా కనపడేదే తప్ప సారాంశంలో నిజంగా సమైక్యత కాదు. వారు సమైక్యతను గురించి పెడబొబ్బలు పెడతారు. కాని కమ్యూనిస్టుపార్టీ, ఎనిమిదవ మార్గ సైన్యం, నూతన నాల్గవ మార్గ సైన్యం, షెన్సి – కాంగ్సూ – నింగ్సియా సరిహద్దు ప్రాంతాలను రద్దు చేయాలని కోరుతూ ఉన్నంతకాలం చైనాను సమైక్యం చేయలేమనే సాకు చూపుతుంటారు. వారి ఏకపార్టీ నియంతృత్వాన్ని కొనసాగించటానికే కాక దాన్ని విస్తృతపరచటానికై అన్నింటినీ కొమింగ్‌టాంగ్‌కే దఖలు పరచాలని కోరుతారు. ఇదే జరిగితే, ఇకవుండే సమైక్యత ఏమిటి? నిజం చెప్పాలంటే, కమ్యూనిస్టుపార్టీ, ఎనిమిదవ మార్గ సైన్యం, నూతన నాల్గవ సైన్యం, షెన్సీ – కాన్సు – నింగ్సియా సరిహద్దు ప్రాంతం, యివన్నీ ముందుకువచ్చి అంతర్యుద్ధాన్ని నిలిపివేయాలనీ, జపాన్‌ను ప్రతిఘటించడానికి సమైక్యం కావాలనీ నిజయితీతో ప్రతిపాదించి

వుండకపోయినట్లయితే, జపాన్ వ్యతిరేక జాతీయ ఐక్యసంఘటనను ప్రారంభించడానికి గాని, నియాన్ సంఘటనను శాంతియుతంగా పరిష్కరించడానికి చొరవ తీసుకోడానికి గాని ఎవరూ వుండేవారు కాదు. జపాన్‌ను ప్రతిఘటించడం సాధ్యమయ్యేదే కాదు. ఈ రోజు కమ్యూనిస్టుపార్టీ, ఎనిమిదవ మార్గ సైన్యమూ, నూతన నాల్గవ సైన్యమూ, షెన్సి – కాన్సూ – నింగ్సియా సరిహద్దు ప్రాంతమూ, జపాన్ వ్యతిరేక ప్రజాస్వామిక స్థావర ప్రాంతాలు ముందుకు వచ్చి నిజాయితీతో జపాన్ వ్యతిరేక ప్రతిఘటనను కొనసాగిస్తూ, లొంగుబాటుకు, చీలికకు, తిరోగమనానికి దారితీసే ప్రమాదకరమైన ధోరణులను ఎదిరించి పోరాడి వుండకపోయినట్టయితే పరిస్థితి అత్యంత గందరగోళంగా వుండేది. ఎనిమిదవ మార్గ సైన్యం, నూతన నాల్గవ సైన్యాలకు చెందిన లక్షలాది సైనికులు జపాన్ సైన్యం యొక్క 40 డివిజన్లలో[10] 17 డివిజన్లతో తలపడుతూ శత్రు సైన్యంలోని అయిదింట రెండువంతుల సైన్యాన్ని ఆటకాయిస్తున్నారు. మరి యీ సైన్యాలను ఎందుకు రద్దు చేయాలి? షెన్సి – కాన్సు – నింగ్సియా సరిహద్దు ప్రాంతం దేశమంతటిలోకీ అత్యంత అభివృద్ధికరమయిన ప్రాంతం. అది జపాన్ వ్యతిరేక ప్రజాస్వామిక స్థావర ప్రాంతం. ఈ ప్రాంతంలో, మొదటిది లంచగొండి అధికారులులేరు, రెండు స్థానిక నిరంకుశులు పెత్తందార్లు లేరు. మూడు జూదం లేదు. నాలుగు వ్యభిచారం లేదు, అయిదు వుంపుడు గత్తెలు లేరు, ఆరు అడుక్కు తినేవాళ్ళు లేరు. ఏడు సంకుచిత స్వార్థపర ముఠాలు లేవు. ఎనిమిది సోమరిపోతు తనం, నిరాశ నిస్పృహల వాతావరణం లేదు, తొమ్మిది తంపులు తగవులాటలు పెట్టడమే వృత్తిగా కలవాళ్ళెవరూ లేరు, పది యుద్ధం నుండి లాభాలార్జించే వాళ్ళు లేరు. మరి యీ సరిహద్దు ప్రాంతాన్ని ఎందుకు రద్దుచేయాలి. సిగ్గుమాలిన వాళ్ళు మాత్రమే యిటువంటి సిగ్గులేని సలహాలు యివ్వడానికి సాహసిస్తారు. మనకు వ్యతిరేకంగా ఒక్క మాటైనా ఉచ్ఛరించటానికి యీ మొండి ఘటాలకు ఏమి హక్కు వుంది? లేదు, కామ్రేడ్స్! ఇప్పుడు చేయాల్సింది సరిహద్దు ప్రాంతాన్ని రద్దు చేయడంకాదు, యావత్ దేశమూ దాన్ని మార్గదర్శకంగా స్వీకరించేటట్లు చెయ్యాలి. ఎనిమిదవ మార్గ సైన్యాన్ని నూతన నాల్గవ సైన్యాన్నీ రద్దు చేయడం కాదు, యావత్ దేశమూ దాన్ని అనుసరించేలా చేయాలి. అభివృద్ధి కాముకులైన ప్రజలను వెనక్కు లాగడం కాదు, వెనుకబడ్డవారు అభివృద్ధి చెందిన వారిని అందుకోనేలా చేయాలి. సమైక్యతను దృఢంగా బలపరిచేది మనమే. కమ్యూనిస్టులమే. ఐక్యసంఘటనను ప్రారంభించి కొనసాగిస్తున్నదీ మనమే. సమైక్య ప్రజాస్వామిక రిపబ్లిక్ నినాదాన్ని ప్రతిపాదించిందీ మనమే. వీటిని ఇంకెవరు ప్రతిపాదించగలరు? నెలకు కేవలం అయిదు యువాన్ల[11] జీతంతో వేరెవరు సంతృప్తిగా బతగ్గలరు? లంచగొండి తనానికి తావులేని ఇంతటి స్వచ్ఛమయిన ప్రభుత్వాన్ని వేరెవరు స్థాపించగలరు? సమైక్యత ఎందుకులేదు? సమైక్యత వుంది. లొంగుబాటుదారుల సమైక్యతకు వారి అర్థం వారికుంది. మనల్ని కూడా లొంగుబాటులో సమైక్యం చేయాలనేది వారి కోరిక. కమ్యూనిస్టు వ్యతిరేక మొండి ఘటాలకు సమైక్యత గురించి వారి అభిప్రాయం వారికి వుంది, చీలికలు తేవడంలోనూ, తిరోగమనంలోనూ మనల్ని సమైక్యం చేయాలని వారు కోరుకుంటారు; వారి ఈ భావాలను మనం ఎప్పటికయినా ఆమోదించగలమా? ప్రతిఘటన, సమైక్యత, అభివృద్ధులు పునాదిగాలేని ఏ సమైక్యత గాని అది నిజమైన సమైక్యత అనుకోగలమా? అది హేతుబద్ధమైన సమైక్యత అని భావించగలమా? అది కేవలం పగటికల! సమైక్యతను గురించి మన అభిప్రాయాన్ని వెల్లడించటానికే మనం ఈ రోజు ఇక్కడ సమావేశమవుతున్నాం. సమైక్యతను గురించి మన అభిప్రాయాలూ, చైనా ప్రజల అభిప్రాయాలూ ఒక్కటే. చైనాలో హృదయమున్న ఏ పురుషునికయినా, ఏ స్త్రీకయినా సమైక్యత గురించి వుండే భావం యిదే. అది ప్రతిఘటన, సమైక్యత అభివృద్ధుల పునాదిపై ఆధారపడినదే. అభివృద్ధి ద్వారా మాత్రమే మనం సమైక్యతను సాధించగలం. సమైక్యత ద్వారా మాత్రమే మనం జపాన్‌ను ప్రతిఘటించగలం. అభివృద్ధి, సమైక్యత, ప్రతిఘటనల ద్వారా మాత్రమే దేశాన్ని సమైక్యం చేయగలం. సమైక్యతను గురించి మన అభిప్రాయం యిది. ఇదే సరియైనదీ, హేతుబద్ధమైనదీ, నిజమయినదీ. సమైక్యతను గురించిన బూటకపు, అసంబద్ధమయిన, నామ మాత్రపు భావన జాతిని బానిసత్వంలోకి నడిపిస్తుంది. ఇది బొత్తిగా బుద్ధిలేని వారి భావన. కొమింగ్‌టాంగ్ పార్టీ క్రింద సమైక్యతను నెలకొల్పడానికై కమ్యూనిస్టుపార్టీ, ఎనిమిదవ మార్గ సైన్యాన్నీ, నూతన నాల్గవ సైన్యాన్నీ, జపాన్ వ్యతిరేక స్థావర ప్రాంతాలనూ, స్థానిక జపాన్ వ్యతిరేక ప్రజాస్వామిక శక్తులనూ అంతమొందించాలని వీరు కోరుకుంటారు. ఇది ఒక కుట్ర. సమైక్యత ముసుగులో నియంతృత్వాన్ని కొనసాగించడానికి పన్నిన కుట్ర. వారి ఏక పార్టీ నియంతృత్వం అనే కుక్క మాంసాన్ని సమైక్యత అనే పేరిట వేట మాంసమని మోసగించి అమ్మడానికి చేసే దుర్మార్గమయిన, సిగ్గుమాలిన దొంగవెధవలు పన్నుతున్న కుట్ర. ఆ కాగితం పులికి తూట్లు పొడవడానికే యీ రోజు మనం ఇక్కడ సమావేశమయ్యాం. ఈ కమ్యూనిస్టు వ్యతిరేక మొండి ఘటాలతో మనం ఎట్టి జంకుగొంకులూ లేకుండా పోరాడుదాం.

## వివరణలు

1.చాంగ్ కై షేక్, అతని అనుచరులూ అభివృద్ధి నిరోధకులు

చాంగ్ కై షేక్ ఆజ్ఞలను అనుసరించి, కొమింగ్‌టాంగ్ 27వ ఆర్మీ గ్రూపు, 1939 జూన్ 12న హూనాన్ రాష్ట్రంలోని పింకియాంగ్‌లో గల న్యూఫోర్త్ సైన్యం లైజాన్ కార్యాలయాన్ని ముట్టడించడానికి సైన్యాలను పంపింది. వారు, న్యూఫోర్త్ ఆర్మీస్టాఫ్ ఆఫీసరు కామ్రేడ్ టు-చెంగ్-కునూ, ఎయిత్ రూట్ ఆర్మీ మేజరూ, ఎడ్జుటెంటూ అయిన కామ్రేడ్ లొ-జు-మింగ్‌నూ, మరో నలుగురు కామ్రేడ్స్‌నూ ఘోరంగా హత్య చేశారు. ఈ మూక హత్యాకాండ కేవలం జపాన్ వ్యతిరేక ప్రజాస్వామిక బేస్ ఏరియాలో వున్న ప్రజల్లో మాత్రమే గాక, కొమింగ్‌టాంగ్ ప్రాంతాల్లోని నిజాయితీపరులైన ప్రజల్లో కూడా క్రోధాన్ని రేపింది.

2. చూయేషాన్ మూకుమ్మడి హత్యాకాండ: 1939 నవంబరు 11న జరిగింది. కొమింగ్‌టాంగ్ పార్టీకి చెందిన 1800 మందికి పైగా రహస్య ఏజెంట్లు, సైనికులు హోనాన్ రాష్ట్రంలోని, చూయేషాన్ కౌంటిలోని చౌకు పట్టణంలో గల నూతన నాల్గవ సైన్యం లైజాన్ కార్యాలయంపై దాడిచేశారు. ఈ దాడిలో, జపాన్ వ్యతిరేక యుద్ధంలో గాయపడ్డ నూతన నాల్గవ సైన్యంలోని సైనికులు, అధికారులు వారి కుటుంబ సభ్యులతో సహా రెండువందల మందికి పైగా హత్య చేయబడ్డారు.

3. షాన్సీ రాష్ట్రంలోని కొమింగ్‌టాంగ్ యుద్ధ ప్రభువు యెన్‌షి-షాన్ కింద వున్నది పాత సైన్యం. చావుకైనా తెగించిన సైన్యంగా పేరుమోపిన జపాన్ వ్యతిరేక ప్రజా సైన్యమే కొత్త సైన్యం. కమ్యూనిస్టుపార్టీ ప్రభావంలో, దాని నాయకత్వం కింద యిది షాన్సీలో పెంపొందింది. సైన్యంపై దాడిచేయడానికి 1939 డిసెంబరులో ఛాంగై షేక్, యెన్-షి-షాన్‌లు ఆరు సైన్య విభాగాలను పశ్చిమ షాన్సీలో కేంద్రీకరించారు, కాని చావు దెబ్బతిని ఓడిపోయారు. అదే సమయంలో ఆగ్నేయ షాన్సీలోని యెన్ సైన్యాలు యాన్ చెంగ్-చిన్-చెంగ్ ప్రాంతంలోని జపాన్ వ్యతిరేక ప్రజాస్వామిక కౌంటీ ప్రభుత్వాలపై, ప్రజాసంఘాలపై దాడిచేసి అనేక వందలమంది కమ్యూనిస్టులనూ, అభివృద్ధి కాముకులనూ హత్య చేశాయి.

4. హోపే రాష్ట్రంలోని కొమింటాంగ్ తిరుగుబాటు దళాలకు చెందిన శాంతి పరిరక్షణ దళాల కమాండర్ చాంగ్ చిన్ వూ, 1939 జూన్‌లో, హెూపేలోని షెన్‌పైన్ కౌంటిలోగల ఎనిమిదవ మార్గ సైన్యం లైజాన్ కార్యాలయంపై ఆకస్మికంగా దాడిచేసి, 400 మందికిపైగా కార్యకర్తలను, సైనికులను వూచకోత కోసారు.

5. షాంటుంగ్ రాష్ట్రపు కొమింగ్‌టాంగ్ గవర్నర్ షెన్ – హంగ్‌లై ఆదేశాలపై 1939 ఏప్రిల్‌లో పోషాన్‌లోగల ఎనిమిదవ మార్గ సైన్య షాంటుంగ్ కాలమ్‌కు సంబంధించిన మూడవ గెరిల్లా డిటాచ్‌మెంట్ మీద చిన్ చిజంగ్ బందిపోటు సైన్యాలు, దాడిచేసి రెజిమెంటల్ ఆఫీసర్లతో సహా నాలుగు వందల మందికి పైగా హత్య చేశాయి.

6. తూర్పు హూపేలోని కొమింగ్‌టాంగ్ మిలిటరీ కమాండర్ చెంగు జు-హూమ్, సెప్టెంబరు 1939లో నూతన నాల్గవ సైన్యం లైజాన్ కార్యాలయం మీద దాడిచేసి అయిదారు వందలమంది కమ్యూనిస్టులను హతమార్చాడు.

7. 1939 శీతాకాలం 1940 వసంత కాలం మధ్య సమయంలో కొమింగ్‌టాంగ్ సైన్యాలు షెన్సీ – కాన్సూ – నింగ్సియా సరిహద్దు ప్రాంతంలోని చున్ హూవా, ఘన్‌యి, చెంగ్ నింగ్, నింఘ్‌సైన్, చెన్ యువాన్ కౌంటీ పట్టణాలను స్వాధీనపరుచుకున్నాయి.

8. జర్మన్, ఇటాలియన్ ఫాసిస్టులను అనుకరిస్తూ కొమింగ్‌టాంగ్ అభివృద్ధి నిరోధకులు జపాన్ ప్రతిఘటన యుద్ధకాలంలో అనేక నిర్బంధ శిబిరాలను నెలకొల్పారు. ఇవి సివాన్ లాంచౌల నుంచి కాంచౌ, షాంగ్‌జావోల దాకా విస్తరించివున్నాయి. కమ్యూనిస్టులు, దేశభక్తులు అభివృద్ధి కాముకులైన యువజనులు అత్యధిక సంఖ్యలో యీ శిబిరాలలో నిర్బంధింపబడ్డారు.

9. 1938 అక్టోబర్‌లో వూహాన్ పతనం తర్వాత కొమింగ్‌టాంగ్ తన కమ్యూనిస్టు వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రతరం చేసింది. 1939 ఫిబ్రవరిలో "కమ్యూనిస్టు సమస్యను పరిష్కరించేందుకు విధానాలు", "జపాన్ ఆక్రమిత ప్రాంతాల్లో కమ్యూనిస్టు కార్యక్రమాలనుంచి రక్షణకై విధానాలు" అనే రహస్య ఫర్మానాలను విడుదల చేశారు. కొమింగ్‌టాంగ్ అధీనంలోని ప్రాంతాలలో కమ్యూనిస్టుల రాజకీయ అణచివేతనూ, ఉత్తర, మధ్య చైనాలలో వారిపై సైనిక దాడులనూ తీవ్రతరం చేశారు. వీటి ముగింపే డిసెంబరు 1939, మార్చి 1940 మధ్య కాలంలో పెద్ద ఎత్తున జరిగిన మొట్టమొదటి కమ్యూనిస్టు వ్యతిరేక దాడి.

10. ఆ తర్వాత కాలంలో ఎనిమిదవ మార్గ, నూతన నాల్గవ సైన్యాలు యింకా ఎక్కువ సంఖ్యలో గల జపాన్ సేనలతో తలపడ్డాయి. 1943 కల్లా వారు జపాన్ దురాక్రమణ సైన్యంలోని 64 శాతం సైనికులతోనూ కీలుబొమ్మ సైన్యాలలోని 95 శాతం సైనికులతోనూ పోరాడుతున్నారు.

11. కమ్యూనిస్టుల నాయకత్వంలోగల జపాన్ వ్యతిరేక సైనిక దళాలలోనూ, జపాన్ వ్యతిరేక ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పనిచేసే వారందరికీ సగటున నెల జీతం 5 యువాన్‌లు.

# కామ్రేడ్ ఆజాద్, హేమచంద్ర పాండేల హత్య కేసులో పోలీస్‌లపై కేసు నమోదు!

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ చెరుకూరి రాజ్‌కుమార్ (ఆజాద్), హేమచంద్ర పాండేల 'ఎన్‌కౌంటర్' కేసులో ఆంధ్రప్రదేశ్ పోలీసుల మీద సిబిఐ హత్యానేరాన్ని నమోదు చేసింది. ఎన్‌కౌంటర్లతో కుఖ్యాతి గాంచిన రాష్ట్ర చరిత్రలో ఇదొక అపూర్వ విషయం.

ఎన్‌కౌంటర్ అనే పదానికి ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా అర్థమే మారిపోయింది. ఎన్‌కౌంటర్ అంటే రెండు సాయుధ పక్షాల మధ్య జరిగిన పోరుగా ఎవరూ భావించడం లేదు. నిరాయుధులైన విప్లవకారులను పట్టుకొని, అమానుష చిత్రహింసలకు గురి చేసి చంపేయడం, అని చిన్న పిల్లలు కూడా అర్థం చేసుకోగల్గుతున్నారు. పలు సందర్భాల్లో ఇటువంటి పాశవిక హత్యలను ప్రజలు ప్రశ్నిస్తున్నారు, నిరసనలు తెలుపుతున్నారు. అయినప్పటికీ హంతకులకు ఎన్నడూ చీమ కుట్టినట్టయినా కాలేదు. కారణం ఆ హంతకులు పోలీసులు కావడం, ఆ హత్యలు రాజ్యం కనుసన్నల్లో, రాజ్య విధానాల్లో భాగంగా జరగడం.

భారత శిక్షా స్మృతి ప్రకారం హత్య అనేది యావత్ జీవిత కారగార శిక్ష విధించదగిన, అరుదైన సందర్భాల్లో మరణశిక్ష కూడా విధించదగిన నేరం. ఈ హత్యను ఎవరు చేసినా అంటే సాధారణ పౌరులు చేసినా, ప్రభుత్వ అధికారులు చేసినా, పరిపాలకులు చేసినా ఒకే విధంగా పరిగణించాలని కూడా చట్టం చెబుతుంది.

కానీ ఆచరణ ఇందుకు భిన్నంగా వుంది. పోలీసులు చేసిన ఇటువంటి హత్యలకు వారికి ప్రశంశలు, ప్రమోషన్లు, నగదు బహుమానాలు, కీర్తి పతకాలు లభిస్తున్నాయి. పోలీసులు చట్టానికి అతీతమైన, ప్రత్యేకమైన ప్రాణులుగా పరిగణించబడుతున్నారు. ఎన్‌కౌంటర్ హత్య అనేది ఏ విచారణా, న్యాయ ప్రక్రియ అవసరం లేని, చట్టానికి అతీతమైన చర్యగా పోలీసులకు వున్న ప్రత్యేకమైన హక్కుగా మారిపోయింది. ఫలితంగా రాష్ట్రంలో 'ఎన్‌కౌంటర్ల' పరంపర అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతోంది. ఇది దోపిడీ పాలక వర్గాల విధానాల్లో భాగం కనుక పార్టీలకతీతంగా ఏ పార్టీ అధికారంలో వున్నా ఈ పాశవిక హత్యలు ఆగడం లేదు.

రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ల చరిత్ర సుదీర్ఘమైనది. అల్లూరి సీతారామ రాజును హత్య చేసిన బ్రిటీష్ పాలకులు కూడా ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించారు. ఇదే రాష్ట్రంలో బూటకపు ఎన్‌కౌంటర్లకు నాంది. వలస పాలకుల నుండి దేశం స్వాతంత్ర్యాన్ని పొందిందని గత 65 ఏళ్లుగా చెప్పుకుంటున్నప్పటికీ దోపిడీ విధానాల్లో గానీ, అణచివేత విధానాల్లో గానీ మౌలిక మార్పేమీ రాలేదు. వలస పాలకుల విధానాలను కొనసాగించే షరతుపైనే అధికారంలోకి వచ్చిన భారత పాలకులు, వలస పాలకులు మొదలు పెట్టిన బూటకపు ఎన్‌కౌంటర్లను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు. మరింత బరితెగింపుగా కూడా కొనసాగిస్తున్నారు. తెలంగాణా సాయుధ పోరాట కాలంలో 'స్వతంత్ర పాలకులు' పాశవిక హత్యాకాండకు పాల్పడి ఎన్‌కౌంటర్ కథలల్లారు. అధికార మార్పిడి తర్వాత జరిగిన తొలి బూటకపు ఎన్‌కౌంటర్లు ఈ కాలంలో జరిగినవే. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత శ్రీకాకుళ పోరాట కాలంలో వీటిని పునఃప్రారంభించి నేటికీ విచక్షణా రహితంగా కొనసాగిస్తున్నారు. అడపాదడపా కొందరు దొంగలూ, రౌడీలనూ ఎన్‌కౌంటర్ల పేరుతో హత్య చేస్తున్నప్పటికీ ప్రధానంగా ఈ ఎన్‌కౌంటర్ హత్యలను కొనసాగిస్తున్నది విప్లవకారులపైనే. ఈ పేరుతో ఇప్పటికి పాలకవర్గాలు కొన్ని వేల హత్యలు చేశాయి. ఎంతో చైతన్యాన్నీ మేధస్సునూ చిదిమేశాయి. ఇది అమానుషమనీ, అన్యాయమనీ, చట్ట విరుద్ధమనీ ప్రజలూ, ప్రగతిశీలవాదులూ, ప్రజాస్వామ్య, పౌరహక్కుల సంఘాలూ, విప్లవ పార్టీలూ ఖండిస్తూనే వున్నాయి, వారిస్తూనే వున్నాయి. వీటికి వ్యతిరేకంగా పోరాడుతూనే వున్నాయి.

అయితే న్యాయ పరిరక్షణే ధ్యేయంగా చెప్పుకునే 'న్యాయ' స్థానాలు ఈ పాశవిక హత్యల పట్ల నిమ్మకు నీరెత్తినట్లుగానే వున్నాయి. అనేక సందర్భాల్లో 'ఎన్‌కౌంటర్' మృతుల సంబంధీకులు పోరాడారు, పోరాడుతూనే వున్నారు. కానీ కోర్టులు అన్యాయ వైఖరినే చేపట్టాయి. తనకు తాను స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన సంస్థగా అభివర్ణించుకునే న్యాయ వ్యవస్థ స్వతంత్రమైనది ఎంత మాత్రమూ కాదనీ, దోపిడి రాజ్యాంగ వ్యవస్థలో అదొక అవిభాజ్య భాగమనీ ఎన్నోసార్లు నిరూపించుకుంది. అయితే న్యాయస్థానాల ఈ వైఖరికి అతి కొద్ది మినహాయింపులు వున్నాయి. పౌర సమాజం నుండి వచ్చిన తీవ్రమైన వత్తిడే దీనికి ప్రధాన కారణం. ప్రభుత్వ యంత్రాంగంలో నూటికో కోటికో వున్న నిజాయితీ పరుల చర్యలు దీనికి దోహదం చేసివుండొచ్చు. ఫలితంగా రాష్ట్రంలో మొదటిసారి భార్గవ కమీషన్, తార్కుండే కమీషన్ వంటివి ఉనికిలోకి వచ్చాయి. ఎమెర్జెన్సీ కాలంలో

జరిగిన ఎన్‌కౌంటర్ హత్యలపై విచారణ కోసం గాను ప్రభుత్వం నియమించినది భార్గవ కమీషన్. ఎమెర్జెన్సీ అనంతర కాలంలో ఉనికిలోకి వచ్చింది. ఇదే సమయంలో రాష్ట్రంలోని కన్నబిరాన్ సహా దేశవ్యాప్తంగా మేధావులూ, ఉద్యమకారులతో తార్కుండే నేతృత్వంలో ఒక స్వతంత్ర కమీషన్ ఏర్పడింది. పోలీసులు, ప్రభుత్వం సృష్టించే అనేక ఆటంకాలను ఎదుర్కుంటూ భార్గవ కమీషన్ విచారణ ముందుకు సాక్షులను తీసుకురావడంలో కామ్రేడ్ చెరుకూరి రాజ్ కుమార్‌ది కీలకపాత్ర. ఈ కృషి విస్తృతమైన చర్చను రేకెత్తించి ప్రజల్లో పౌరహక్కుల స్పృహ, చైతన్యాన్ని పెంచింది. ఆ తర్వాత ప్రజాస్వామిక ఉద్యమాలకు ప్రేరణగా నిలిచింది. కానీ ఈ విచారణ కమీషన్లను నిష్క్రియాపరం చేయడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాల వల్ల ఈ కమీషన్ల వల్ల ఎవరికీ శిక్షలు పడింది లేదు.

ఈ తర్వాత నుంచీ కూడా 'ఎన్‌కౌంటర్' ఘటనలు జరిగినప్పుడల్లా న్యాయ విచారణ కోసమూ, పౌరహక్కుల సంఘాలు పోరాడుతూనే వున్నాయి. ఇటువంటి ఎన్నో అభ్యర్థనలను న్యాయ స్థానాలు నిర్దాక్షిణ్యంగా తోసేశాయి. ప్రతి ఎన్‌కౌంటర్ సందర్భంలోను సంబంధిత పోలీస్ అధికారుల మీద హత్యానేరం మోపి విచారణ చేయాలని, ఆత్మరక్షణ కోసమే కాల్పులు జరిపామని నిరూపించుకునే బాధ్యతను (బర్డెన్ ఆఫ్ ప్రూఫ్) అధికారుల మీదే వుంచాలని పౌరహక్కుల సంఘాలు పోరాడుతున్నాయి. ఈ నిరంతర, సుదీర్ఘ పోరాటానికి కొనసాగింపుగా, కామ్రేడ్ మాధవ్ ఎన్‌కౌంటర్ కేసు సందర్భంగా, ప్రతి ఎన్‌కౌంటర్‌ను హత్యానేరంగా భావించి పోలీసులపై విచారణ చేపట్టాలని హైకోర్టు తీర్పునిచ్చింది. ఇది చారిత్రాత్మక తీర్పుగా అందరూ భావించారు. కానీ హంతక పోలీసులకు ఈ తీర్పు మింగుడు పడలేదు. అందుకే వాళ్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పుపై స్టే విధించింది. ప్రస్తుతం ఈ తీర్పు సందిగ్ధావస్థలోనే వుంది.

ఇటువంటి సమయంలో చెరుకూరి రాజ్‌కుమార్, హేమచంద్ర పాండేల 'ఎన్‌కౌంటర్'ను హత్యా నేరంగా నమోదు చేయడం విశేషమైనదే. అయితే దీనిలో కోర్టుల చిత్తశుద్ధి ఏమీ లేదు. ఇలా నమోదు చేయడం వెనుక ఎంతో పోరాటం, కృషి వున్నాయి. 2010, జూలై 2న ఆదిలాబాద్ జిల్లా సర్కెపల్లి గుట్టల్లో జరిగిన ఎన్‌కౌంటర్లో చెరుకూరి రాజ్‌కుమార్ సహా ఇద్దరు మావోయిస్టులు మరణించారని పోలీసులు ప్రకటించిన వెంటనే పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమయింది. రాజ్‌కుమార్ దండకారణ్యానికి రావల్సి వుందనీ, అందుకుగాను జూలై 1న ఆయనకు నాగ్‌పూర్‌లో కాంటాక్ట్ వుండిందనీ నాగ్‌పూర్‌కు చేరాక గానీ, కొంచెం ముందుగా గానీ ఆయనను పట్టుకుని వుంటారని దండకారణ్యం పార్టీ వెంటనే ప్రకటించింది. ఆ తర్వాత పలు హక్కుల, ప్రజాస్వామిక, విప్లవ సంఘాలు సంఘటనా స్థలికి వెళ్లి పరిశీలించి సమీప గ్రామ ప్రజలతో మాట్లాడి అది ఎన్‌కౌంటర్ కాదనీ, అక్కడ ఎన్‌కౌంటర్ జరిగిన ఆనవాళ్లే లేవని వారిద్దరినీ పట్టుకొని కాల్చి చంపారనీ నిర్ధారించారు. మృతుడు ఎవరో చెప్పకుండా ఆజాద్ పోస్ట్ మార్టమ్ నివేదికను అవుట్‌లుక్ పత్రిక దేశంలోని ప్రముఖ ఫోరెన్సిక్ నిపుణులకు పంపించగా, ఏడు అంగుళాల దూరం నుండి కాల్చినట్టుగా వుందని వాళ్లు నిర్ధారించారు. ఇంకా ఎంతో మంది ఇది హత్యేనని ముక్త కంఠంతో చెప్పారు. న్యాయ విచారణకు డిమాండ్ చేశారు. దీనికి తోడు హేమచంద్రపాండే సహచరి, స్వామి అగ్నివేష్ తదితరులు చేసిన న్యాయపోరాటం కూడా ముఖ్యమైనది. హేమచంద్రపాండే పాత్రికేయుడు కావడం కూడా ఇది హత్యేననడానికి ఒక బలమైన ఆధారమైంది. అందుకే హేమచంద్ర పాండేను మావోయిస్టుగా చిత్రీకరించడానికి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది గానీ, ఆయన సహచరి, పౌరహక్కుల సంఘాలు ఆయన పాత్రికేయుడేనని సాక్ష్యాధారాలతో నిరూపించారు. మొత్తంగా ఉద్యమ రూపంలో చేసిన తీవ్ర కృషి కారణంగా సుప్రీం కోర్టు న్యాయ విచారణ కోసం సిబిఐని ఆదేశించింది. విచారణను ప్రారంభించిన సిబిఐ, ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ సి.ఐ., తాండూర్ ఎస్.ఐ., బెల్లంపల్లి ఎ.ఆర్., హెడ్‌క్వార్టర్స్ ఆర్.ఎస్.ఐ. తదితర పోలీసు అధికారులపై కుట్రతో కూడిన హత్యా నేరాన్ని మోపి కేసు నమోదు చేసింది. నిజానికి సిబిఐ హత్యానేరం మోపిన ఆదిలాబాద్ పోలీసు సిబ్బందికెవ్వరికీ ఈ పాశవిక హత్యతో పెద్దగా సంబంధం వుండే అవకాశం లేదు. ముఖ్యంగా ఈ హత్యకు జరిగిన కుట్రతో అసలే సంబంధం వుండే అవకాశం లేదు. కేంద్ర హోం మంత్రి చిదంబరం నేతృత్వంలో జరిగిన కుట్ర ఇది. కనుక ఈ హత్యానేరంలో మొదటి ముద్దాయిగా చేర్చవల్సింది చిదంబరాన్నే. ఇంకా అప్పటి ముఖ్యమంత్రి, హోం మంత్రి, రాష్ట్ర డిజిపి, ఇంటెలిజెన్స్ అధికారులు... వీళ్లను అసలు దోషులుగా చేర్చవల్సింది. ఆదిలాబాద్ పోలీసు అధికారులు ఆఖరి నిమిషంలో పావులుగా ఉపయోగపడి వుండవచ్చు, లేదా వాళ్లలో కొందరికి అసలేమీ సంబంధం కూడా లేకపోవచ్చు. సమాజం నుండి వచ్చిన వత్తిడి వలన ఒక అనివార్యతకు గురై సుప్రీం కోర్టు సిబిఐని ఆదేశించింది, సిబిఐ ఈ మాత్రమైనా కేసు నమోదు చేసింది. అంతే గానీ అవి బుద్ధి తెచ్చుకున్నాయేమోనని ఎవరూ పొరపడనవసరం లేదు.

అంతేకాదు కేంద్ర మంత్రిత్వ శాఖనే ఇక్కడ దోషి. కేంద్ర మంత్రిత్వశాఖ అదుపాజ్ఞల్లో నడిచే సి.బి.ఐ. నిష్పాక్షికంగా వ్యవహరిస్తుందని ఆశించలేం. గతంలో ఎన్నో సార్లు దోషులకు కొమ్ముకాసిన దాని పక్షపాత వైఖరిని చూసే వున్నాం. ఒక

***(మిగతాది 13వ పేజీలో...)***

# మన్యం సీమ పోరాట పటిమ చాటుతున్న 'చైనా క్లే' ఉద్యమం

బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా, కాఫీ తోటల ఆక్రమణ కోసమూ మిలిటెంట్‌గా జరుగుతున్న ఉద్యమాలకు నిలయంగా వున్న మన్యం సీమ ఈసారి 'చైనా క్లే' ఉద్యమానికి వేదికగా మారింది. బాక్సైట్, కాఫీ తోటల ఉద్యమాల్లో మాదిరే 'చైనాక్లే' ఉద్యమంలోనూ మిలిటెంట్‌గా కదులుతున్న ఆదివాసీ ప్రజానీకం జల్, జంగల్, జమీన్‌లపై తమ హక్కును చాటుకుంటున్నారు. ఈ ఉద్యమం ద్వారా మన్యం సీమ మరోసారి తన పోరాట పటిమను చాటుకుంటోంది. వనరుల దోపిడీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలకు, యీ ఉద్యమం ఒక మంచి చేర్పు అవుతుంది.

'చైనా క్లే' అనేది ఒక ఖనిజం. తెల్లటి మట్టిలా వుంటుందిది. టిబెట్ – చైనా సరిహద్దుల్లో ఎక్కువగా లభిస్తుంది. అందుకే ఇతర ప్రాంతాల్లో ఈ ఖనిజం 'చైనా క్లే'గా పేరు పొందింది. దీన్ని పింగాణీ పాత్రల తయారీలో ఎక్కువగా వాడుతారు. ఇంకా రంగులు, కాగితం, పింగాణీ, సిరామిక్, రబ్బర్, కేబుల్ ఇన్సులేషన్, గాజు, ఫైబర్ పరిశ్రమల్లో కూడా విరివిగా ఉపయోగిస్తారు. ప్రస్తుతం ఈ మట్టి మార్కెట్ విలువ, నాణ్యతను బట్టి టన్నుకు 500 నుంచి 1500 రూపాయల వరకూ వుంటుంది.

విశాఖ జిల్లా దుంబ్రిగూడ మండలం కంద్రూం పంచాయితీకి చెందిన సరాయి, జాంకరగుడ, జోడిగుడ, బైలుగుడ గ్రామాల సమీప కొండ ప్రాంతాల్లో దాదాపు 50 ఎకరాల భూమిలో 60 లక్షల టన్నుల చైనా క్లే ఖనిజ నిక్షేపాలు వున్నాయని అంచనా.

సిరులు పండించే ఈ మట్టిని పెట్టుబడిదారులు ఎలా వదులుకుంటారు? ట్రాన్స్ వరల్డ్ సర్వీసెస్ అనే మైనింగ్ సంస్థ కళ్ళు దీని మీద పడ్డాయి. దీన్ని కొల్లగొట్టడానికి అయిదారేళ్ల నుండే పావులు కదుపుతున్నారు. ఆదివాసీల సంపదను ఆదివాసీ పేరుతోనే కాజెయ్యాలనుకున్నారు. దీన్ని తవ్వి అమ్ముకునేందుకు అనుమతులు సంపాయించేందుకు గాను, పశ్చిమ గోదావరి జిల్లా, చేగొండపల్లి గ్రామానికి చెందిన, ముచ్చిక భూదేవి పేరుతో ట్రాన్స్ వరల్డ్ సర్వీసెస్ సంస్థ దరఖాస్తు చేసింది. ఏటా 15 వేల టన్నులను తవ్వుకోడానికి అనుమతులను కూడా పొందింది.

ఈ సందర్భంగా ఆదివాసీల ప్రయోజనాల కోసమంటూ చేసిన చట్టాలన్నీ మరోసారి వెక్కిరింతకు గురయ్యాయి. 1/70 చట్టం ఆదివాసేతరులకు భూ బదలాయింపును నిషేధిస్తుంది. ఖనిజం తవ్వడానికి ఫ్యాక్టరీ నెలకొల్పడానికి ఎవరికీ భూమి లీజుకు ఇవ్వడానికి వీలు లేదు. ఈ నిషేధం అయిదవ షెడ్యూల్ పేరా 5(2)(ఎ)(బి)లలోనే వుందని సమత వర్సెస్ స్టేట్ (1997 ) కేసులో జస్టిస్ రామస్వామి స్పష్టం చేసారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా రిజర్వ్ ఫారెస్ట్‌లోని గనులు లీజుకివ్వడం నిషేధం. పర్యావరణ చట్టం 1986 ప్రకారం పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగించే గనులు లీజుకివ్వడం నిషేధం.

గనులు, ఖనిజాల నియంత్రణ అభివృద్ధి చట్టం ప్రకారం మన రాష్ట్రంలో ఆదివాసీలు మాత్రమే సభ్యులుగా వున్న సహకార సంఘాలకు తప్ప మరెవ్వరికి ప్రభుత్వం గనులు లీజుకివ్వడానికి వీలులేదు. పై నిబంధనలకు విరుద్ధంగా ఒక వ్యక్తి పేరుతో వచ్చిన దరఖాస్తును పరిగణనలోకి తీసుకొని భూగర్భ శాఖ తీవ్ర చట్ట ఉల్లంఘనకు పాల్పడింది. ఏ ఖనిజాల తవ్వకాల కోసం అయినా కేంద్ర అటవీ పర్యావరణ శాఖ, కాలుష్య నియంత్రణ మండలుల అనుమతులు కూడా కావాలి. కనుక ఆ అనుమతులను తెచ్చుకొమ్మని గనుల శాఖ కోరింది. ఈ అనుమతులన్నీ వచ్చేసాయి. కానీ ఎక్కడా కూడా ప్రభుత్వానికి గానీ, సహకార సంస్థలకు గానీ ఇవ్వాలనే ప్రాథమిక నిబంధన గురించి ప్రశ్న తలెత్తలేదు.

పర్యావరణ శాఖ, కాలుష్య నియంత్రణ మండలుల అనుమతులు వచ్చాయి కనుక నిరభ్యంతర పత్రం ఇవ్వాల్సిందిగా దుంబ్రిగూడ తహసీల్దారును గనుల శాఖ ఆదేశించింది. తహసీల్దారు వెంటనే నిరభ్యంతర పత్రం జారీ చేశాడు. పైగా ఆ పత్రంలో అది పోరంబోకు భూమిగా పేర్కొన్నాడు. నిజానికి అది పోరంబోకు భూమి కాదు. ఆదివాసీలకు అసైన్డ్ చేసిన భూమి అది. అసైన్డ్ భూమిని లీజుకు ఇవ్వడం కూడా చట్టవిరుద్ధమే. పంచాయితీ రాజ్ – షెడ్యూల్ ప్రాంతాల విస్తరణ చట్టం – 1996 ప్రకారం ఆదివాసీ ప్రాంతాల్లో ఏ ప్రాజెక్టును చేపట్టడానికైనా గ్రామ సభలు తప్పనిసరి. కానీ ఎటువంటి గ్రామ సభలు నిర్వహించకుండానే తహల్దార్ అనుమతినిచ్చేశాడు. ఇలా అన్ని రకాల నిబంధనలూ, చట్టాలను పక్కన బెట్టి తవ్వకాలకు అనుమతులు జారీ అయ్యాయంటే ఎన్ని డబ్బు సంచులు చేతులు మారి వుంటాయో! దీన్ని బట్టి నిబంధనలూ, చట్టాలూ రాజకీయ నాయకులకూ, అధికారులకు

అక్రమార్జనకు సాధనాలుగా ఎంత బాగా ఉపయోగపడుతున్నాయో అర్థమవుతుంది.

అంతే కాదు భూదేవి పేరుతో ఖనిజాల తవ్వకాల కోసం 20 ఎకరాల భూమిని మాత్రమే అడిగారు. దీన్ని ఆధారంగా చేసుకొని మరో 25 ఎకరాలకు అధికార, ప్రతిపక్ష నాయకులు అనుమతి పొందినట్టు వార్తలు వస్తున్నాయి. వాస్తవాలు ఇంకా పూర్తిగా వెలుగులోకి రావల్సి ఉన్నప్పటికీ విలువైన ఈ ఖనిజాన్ని తన్నుకు పోవడానికి వీళ్లు సిద్ధంగా వుంటారనుకోవడంలో ఆశ్చర్యం లేదు.

అయితే ఇక్కడ మట్టిని తవ్వి కోట్లు గడిద్దామనుకున్న పెట్టుబడిదారుల దురాశ తీవ్ర నిరాశగా మారింది. ప్రజల ప్రయోజనాలు ఏ మాత్రం పట్టని రాజకీయ నాయకులూ, వారి చెప్పు చేతుల్లో వుండే అధికారులూ అనుమతులిస్తారు కానీ, ప్రజలు ఎలా అంగీకరిస్తారు? ఇది భూమిపై, అడవిపై తమకున్న హక్కు సమస్య, తమ ఉనికి సమస్య, పర్యావరణ సమస్య. అందుకే మిలిటెంట్ ఉద్యమానికి దారితీసింది.

దీనికి చాలా రోజుల క్రితమే అనుమతులు మంజూరు అయినప్పటికీ అత్యంత గోప్యంగా చాపకింద నీరులా పనులు చక్కబెట్టడంతో ప్రజలకు తెలియలేదు. కేవలం రెండు నెలల క్రితం మాత్రమే ఈ విషయం బయటకు పొక్కింది. అప్పటి నుండి ప్రజలు ఉద్యమించడానికి సన్నద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో మే 10న సర్రాయి గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ తంతును జరపడానికి అధికారులు నిర్ణయించారు. దీన్ని అడ్డుకోవడానికి ప్రజలు పూనుకున్నారు. వందలాదిగా స్త్రీలూ, పురుషులూ, పిల్లలు విల్లంబులూ, కత్తులూ, గొడ్డళ్లూ పట్టుకొని ఆ గ్రామానికి తరలి వచ్చారు. అక్కడికి అధికారులూ, రాజకీయ నాయకులూ ఎవరూ రాకుండా రోడ్లను దిగ్బంధనం చేశారు. ప్రజల్లో వ్యక్తం అవుతున్న తీవ్ర వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకొని ఆందోళన తలెత్తే అవకాశముందని భావించి చివరి నిముషంలో ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేశారు. ఆ సమయంలో స్థానిక ఎమ్మెల్యే సివేరి సోమ, ఎంపీపీ దన్నేరావులు అక్కడికి వచ్చారు. వారిని చూడగానే ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఎంపీపీని చుట్టుముట్టారు. అతను భయంతో పరుగులు తీస్తుంటే మహిళలు కిలో మీటర్ వరకూ వెంటబడి తరిమికొట్టారు. పేడ ముద్దలూ, రాళ్లనూ విసిరారు. చొక్కా చింపారు. ఆ తర్వాత సోమతో వాగ్వివాదానికి దిగారు. అతని వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ తవ్వకాలను వ్యతిరేకిస్తున్నానంటూ సోమ నమ్మబలకడంతో అతనిని వదిలేశారు.

**పత్రికకు మీ ప్రాంతంలోని పోరాట, ప్రతిఘటన, నిర్బంధ, సభలూ - సమావేశాల నివేదికలు, అమరుల చరిత్రలను ఎప్పటికప్పుడు పంపుతూ వుండండి.**

ఆ తర్వాత ప్రజలు సభ జరుపుకొని చైనా క్లే తవ్వకాల కోసం ఇచ్చిన లీజ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాణాలొడ్డయినా తమ భూములను కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. మే 16న కలెక్టరేట్‌ను ముట్టడించాలని నిర్ణయించుకున్నారు. దన్నేరావుపై జరిగిన దాడిని సాకుగా తీసుకొని పదిమంది ఆదివాసీ నాయకులపై పోలీసులు కేసులు పెట్టారు. ప్రజా పోరాటాలను అణచడానికి ప్రయోగించే అన్ని రకాల నిర్బంధ రూపాల్లో ఇలా కేసులు పెట్టి వేధించడం కూడా ముఖ్యమైనదే. దానికి వ్యతిరేకంగా మే 12న మన్యం బంద్‌ను పాటించారు. చైనా క్లే కోసం వచ్చే అధికారులను గానీ, కేసులు బనాయించబడిన వారిని అరెస్టు చేయడానికి వచ్చే పోలీసులను గానీ, తమ గ్రామాల్లో అడుగు బెట్టనీయమని కంద్రూం పంచాయితీలోని 24 గ్రామాల ప్రజలు స్పష్టం చేస్తున్నారు. కొత్త వారెవ్వరూ తమ గ్రామాల్లోకి అడుగుపెట్టడానికి వీల్లేకుండా రోడ్లను దిగ్బంధించి స్త్రీలూ, పురుషులూ, పిల్లలు సాంప్రదాయిక ఆయుధాలు ధరించి కాపలా కాస్తున్నారు. ఇలా ఈ ఆదివాసీలు అడవిపై తమ హక్కులను కాపాడుకోవడానికి దోపిడీ పాలకులతో యుద్ధానికి సన్నద్ధం అవుతున్నారు.

మే 16న విశాఖ నగరంలో సాంప్రదాయక ఆయుధాలూ, వాయిద్యాలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ముందు మూడు గంటల పాటు ధర్నా చేశారు. ఈ సందర్భంగా చైనా క్లే తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని ముక్త కంఠంతో నినదించారు.

మన్యం సీమలో ఇటువంటి ప్రతిఘటన కొత్త విషయమేమీ కాదు. మన్యం వీరుడు అల్లూరి రాజేసిన పోరు ఇప్పటికీ మావోయిస్టు పార్టీ నాయకత్వంలో జ్వలిస్తూనే వుంది. 'జల్, జంగల్, జమీన్'లపై హక్కు కోసం వీరోచిత పోరాటం కొనసాగుతోంది. అందులో భాగంగానే ప్రజలు బాక్సైట్‌కు వ్యతిరేకంగా మిలిటెంట్‌గా పోరాడుతున్నారు, కాఫీ తోటలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడీ పోరాటం దానికి కొనసాగింపు మాత్రమే. గత పోరాటాలూ, అవి అందించిన అనుభవాలూ, చైతన్యమూ, స్ఫూర్తి లేకుండా ఈ పోరాటాన్ని ఊహించలేము.

ప్రజలు మిలిటెంట్ ఆందోళనకు దిగడంతో దీనికి నాయకత్వం వహించి, లబ్ధి పొందడానికి  చంద్రబాబు ముందుకొస్తున్నాడు. నిజానికి స్థానిక ఎమ్మెల్యే సోమ, ఎంపీపీ దన్నేరావులు టీడీపీకి చెందిన వారే. వీరు ఈ తవ్వకాలకు మద్దతుదారులుగా వున్నారు. అందుకే ప్రజావ్యతిరేకతకు గురయ్యారు. ఇప్పుడీ విషయాన్ని మరుగుపరిచి ఈ పోరాటంలో ఆదివాసీలతో కలిసి పనిచేయాలని చంద్రబాబు వారికి ఆజ్ఞలు జారీ చేశాడు. కానీ ప్రజా వ్యతిరేకులుగా ఇప్పటికే బహిర్గతమైన వారిని ప్రజలు విశ్వసించలేరు. సి.పి.ఎం. ఈ పోరాటంలో ప్రజల పక్షం వహిస్తున్నది కానీ ఇటువంటి గనులను వ్యతిరేకించే పాలసీ ఆ పార్టీకి లేదు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం  ప్రజలను నిర్వాసితులను చేసే దాని వైఖరిని మనం పశ్చిమ బెంగాల్‌లో చూసే వున్నాం.

ఈ ప్రాంతంలో చైనా క్లేకు అనుమతినివ్వడం అనేది ఏదో స్థానికంగా జరిగిన అవత తవక ఏమీ కాదు. మొత్తంగా దేశ వ్యాప్తంగా వనరులనూ, అటవీ, భూగర్భ సంపదను సామ్రాజ్యవాదులకూ, నిరంకుశ దళారీ పెట్టుబడిదారులకూ దోచిపెడుతున్న పాలక విధానాల్లో భాగంగానే దీన్ని అర్థం చేసుకోవాలి. దేశవ్యాప్తంగా ఇటువంటి సంపద నిక్షిప్తమై వున్నది ఆదివాసీ ప్రాంతాల్లోనే. కనుక ఆ సంపదను దోచి పెట్టడానికి ఆదివాసీలు పోరాడి సాధించుకున్న చట్టాలనూ, రాజ్యాంగ నిబంధనలను కాలరాస్తున్నారు. వనరుల దోపిడీని వ్యతిరేకిస్తున్న ప్రజలపై, విప్లవోద్యంపై తీవ్ర నిర్బంధాలను ప్రయోగిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో అమలవుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను కూడా ఈ నేపథ్యంలోనే మనం అర్థం చేసుకుంటున్నాం.

విశాఖ జిల్లాలో ఇలా బినామీ పేర్లతో వనరుల దోపిడీకి ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి.  కె.డి. పేట సమీపంలో సిమెంట్ తయారీలో ఉపయోగించే ఎర్రమట్టి నిల్వలు వున్నాయి. వాటిని కొల్లగొట్టేందుకు కొయ్యూరు మండలానికి చెందిన ఒక ఆదివాసీ వ్యక్తి పేరుతో స్థానికేతరులైన కొందరు కాంట్రాక్టర్లు అనుమతులు సంపాదించారు. అయితే ఈ ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమ ప్రభావం బలంగా వుండడంతో వెనుకా ముందాడుతున్నారు. బినామీ పేర్లతో పొందిన అనుమతులన్నీ వాస్తవ రూపం ధరిస్తే పర్యావరణానికి పెద్ద ఎత్తున ముప్పు వాటిల్లే ప్రమాదం వుంది.

గిరిజన సంక్షేమ మంత్రిగా విశాఖ జిల్లాకే చెందిన పసుపులేటి బాలరాజు వున్న సమయంలోనే కోకొల్లలుగా జిల్లాలో బినామీ పేర్లతో వనరుల దోపిడీకి అనుమతులు జారీ అవుతున్నాయి. అంటే  గిరిజన సంక్షేమం ముసుగుతో ఈయన ఎవరి సంక్షేమానికి పాల్పడుతున్నాడో స్పష్టంగానే అర్థం చేసుకోవచ్చు. పసుపులేటి బాలరాజు, ఎమ్మెల్యే సోమ, ఎంపీపీ దన్నేరావు వీళ్లంతా ఆదివాసీలే అయినప్పటికీ ఆదివాసీల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో ఆదివాసీలు వున్నంత మాత్రాన మెజారిటీ సందర్భాల్లో ఆదివాసీలకు ఒరిగేది ఏమీ వుండదనీ, దోపిడీ యంత్రాంగంలో భాగమయిన వీరు దోపిడీ వర్గ ప్రయోజనాలకే కట్టుబడి వుంటారని మనం ఈ సందర్భంగా మరోసారి గుర్తు చేసుకోవాలి.

అటవీ సంపదనూ, పర్యావరణాన్నీ కాపాడుకోవడం కేవలం ఆదివాసీల బాధ్యత మాత్రమే కాదు, దేశవాసులందరి బాధ్యత. వనరులను కాపాడుకోవడం అనేది విస్తృతార్థంలో స్వాతంత్ర్యాన్నీ, సార్వభౌమత్వాన్నీ, స్వావలంబననూ కాపాడుకోవడం. కనుక మన్యం వాసులు చేపట్టిన ఈ పోరాటానికి విశాల ప్రజారాశులు మద్దతునివ్వాలి. వారితో భుజం భుజం కలిపి పోరాడాలి. ఈ పోరాటాన్ని, ఇటువంటి మరెన్నో పోరాటాలను నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం జరుగుతున్న పోరాటంలో భాగం చేయాలి. అప్పుడు మాత్రమే మన దేశ సంపదను కాపాడుకోగలం, నిజమైన స్వాతంత్ర్యాన్నీ, సార్వభౌమత్వాన్నీ, స్వావలంబననూ సాధించుకోగలం.

---

*(35వ పేజీ తరువాయి...)*

బ్రిక్స్ దేశాలలో భారత్, చైనాలు ముఖ్యమైనవి. వీటి మధ్య పోటీ కూడా వుంది. భారత్, చైనాల ఆర్థిక వ్యవస్థలు విదేశీ పెట్టుబడులకు అనుకూలమైనవి. ఈ రెండు దేశాలు అణు విద్యుత్ భవిష్యత్ అవసరాలరీత్యా అణు పరిజ్ఞానం కోసం అమెరికా, యూరోపియన్ యూనియన్ల మీద ఆధారపడే పరిస్థితి వుంది. భారత్ ఇప్పటికే అమెరికా తదితర సామ్రాజ్యవాదుల చెప్పు చేతల్లో నడుస్తున్నది. భారత్ విదేశీ విధానం పూర్తిగా సామ్రాజ్యవాద అనుకూలమైనది. భారత్, చైనాలు ఇప్పటికే ఎగుమతుల మార్కెట్, శ్రమ శక్తి మార్కెట్, చిన్న దేశాల పెట్టుబడుల మార్కెట్ కోసం పరస్పరం పోటీ పడుతున్నాయి. ఆఫ్రికా దేశాలతో ఆర్థిక, రాజకీయ సంబంధాలు మెరుగుపరుచుకోవడంలో వాటి మధ్య పోటీ ప్రస్ఫుటంగా కనబడుతున్నది. అలాగే ఆసియాలో రెండూ పరస్పరం విస్తరణవాద రాజకీయాలను నడుపుతున్నాయి. సామ్రాజ్యవాద ఆధిపత్య రాజకీయాలకు లొంగిపోయి భారత దేశ ప్రజలను బలి చేసే భారత పాలక వర్గ విధానాలను ఓడించడం మన ముందున్న కర్తవ్యం.

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**మే 1, 2011**

## బీహార్‌లో పోలీసులు అరెస్టు చేసిన మావోయిస్టు నాయకుల్ని బేషరతుగా విడుదల చేయాలి! సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ నాయకుల అరెస్టులకూ, దేశ పాలక ముఠా ప్రజలపై సాగిస్తున్న అన్యాయమైన యుద్ధానికీ వ్యతిరేకంగా మే 21-22 తేదీలలో 'భారత్ బంద్'ను విజయవంతం చేయండి!

ఏప్రిల్ 29న బీహార్‌లోని కటిహార్ జిల్లాలోని బార్‌సోయి గ్రామంలో కేంద్ర ఇంటలిజెన్స్ సంస్థలు, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల ఇంటలిజెన్స్ సంస్థలు పథకం ప్రకారం దాడి చేసి మా పార్టీకి చెందిన ముగ్గురు సీసీ సభ్యులతో సహా మొత్తం ఏడుగురిని అరెస్టు చేశారు. అరెస్టయిన కామ్రేడ్స్‌లో కేంద్రకమిటీ సభ్యులైన పులేందు శేఖర్ ముఖర్జీ ఎలియాస్ సాహెబ్ దా, వారణాసి సుబ్రహ్మణ్యం ఎలియాస్ విమల్ ఎలియాస్ శ్రీకాంత్, విజయ్ కుమార్ ఆర్య ఎలియాస్ జస్‌పాల్‌జీ సహా బీహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా పరిధిలోని ఉత్తర బీహార్-ఉత్తర ప్రదేశ్ రీజియనల్ బ్యూరో కార్యదర్శి అభిమన్యు ఎలియాస్ ఉమేష్ యాదవ్, నోఖేలాల్ చౌధరి, శ్యాంజీ రుషి, ఇంటి యజమాని అనిరుద్ధ్ రవిదాస్‌లు వున్నారు. విప్లవకారుల్ని వెంటాడి హతమార్చడంలో కుఖ్యాతి గాంచిన ఏపీఎస్‌ఐబీ కామ్రేడ్ సుబ్రహ్మణ్యంను గత కొన్ని నెలలుగా వెంటాడుతున్నది. గత సంవత్సరం జూలై ఆఖరులో ఆయన వాళ్ల దాడి నుండి తృటిలో తప్పుకున్నాడు. ఈ కామ్రేడ్స్ ఒక సమావేశం కోసం కలుసుకున్న సందర్భంలో కేంద్ర-రాష్ట్రాల ఇంటలిజెన్స్ సంస్థలు అందజేసిన పక్కా సమాచారంతో బీహార్ ఎస్‌టిఎఫ్ అధికారులు వాళ్లను అరెస్టు చేశారు.

పార్టీలో సాహెబ్‌దా, గగన్ దా, ఆకాశ్ దా అనే పేర్లతో పిలవబడే 67 సంవత్సరాల సీనియర్ మావోయిస్టు నేత కామ్రేడ్ పులేందు శేఖర్ ముఖర్జీ దాదాపు గత 45 ఏళ్లుగా విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్నాడు. కలకత్తా నగరంలో పుట్టిన సాహెబ్‌దా నక్సల్బరీ వుద్యమ ప్రేరణతో వున్నత విద్యను వదిలేసి విప్లవ పోరాటంలోకి దూకి ప్రజాయుద్ధ పురోగమనం కోసం తన సర్వస్వాన్ని ధారపోశాడు. తన సుదీర్ఘ విప్లవ జీవితంలో ఆయన బెంగాల్ సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో విప్లవోద్యమ నిర్మాణం కోసం, నిజమైన విప్లవకారుల, కమ్యూనిస్టు సంస్థల ఐక్యత కోసం గణనీయంగా కృషి చేశాడు. ఆస్థమా, అల్సర్ తదితర వ్యాధులతో తీవ్రంగా బాధపడుతూనే ఆయన కర్తవ్య నిర్వహణలో పాలు పంచుకుంటూ వున్నాడు.

విమల్ అనే పేరుతో ఆంధ్రప్రదేశ్ విప్లవ శ్రేణుల్లో, శ్రీకాంత్ పేరుతో దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో సుపరిచితుడైన కామ్రేడ్ వారణాసి సుబ్రహ్మణ్యం విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వున్నత విద్యను పూర్తి చేసి విప్లవ కార్యకలాపాల్లోకి ప్రవేశించాడు. 1970వ దశకంలో రాడికల్ విద్యార్థి సంఘానికీ, తదనంతరం రాడికల్ యువజన సంఘం, సింగరేణి కార్మిక సమాఖ్యలకూ ఆయన నాయకత్వం వహించాడు. పార్టీ పిలుపుపై ఉత్తర భారతానికి తరలివెళ్లి ఆయన అక్కడ అనేక రాష్ట్రాల్లో విప్లవోద్యమ నిర్మాణానికి ఎనలేని కృషి చేశాడు. తీవ్ర అనారోగ్యాన్ని లెక్కచేయకుండా వివిధ స్థాయిల్లో, వివిధ రంగాల్లో ఆయన నిర్విరామంగా కృషి చేశాడు.

విజయ్ కుమార్ ఆర్యగా బీహార్ ప్రజానీకానికి సుపరిచితుడైన కామ్రేడ్ జస్‌పాల్‌జీ రైతాంగంలోనూ, సాంస్కృతిక రంగంలోనూ నాయకత్వం వహిస్తూ విప్లవోద్యమంలో కీలక పాత్ర పోషించిన కామ్రేడ్. గత మూడు దశాబ్దాలకు పైగా వివిధ రంగాల్లో, వివిధ ప్రాంతాల్లో ఆయన విప్లవ కార్యకలాపాలకు నాయకత్వం వహిస్తూ, ప్రజాందోళనలు నిర్మిస్తూ వచ్చాడు.

హద్దుల్లేని క్రూరత్వానికి పేరుమోసిన సీఐఏ, మొస్సాద్ వంటి విదేశీ ఇంటలిజెన్స్ సంస్థల నుండి శిక్షణ పొందిన భారత ఇంటలిజెన్స్ అధికారులు విప్లవోద్యమానికి సుదీర్ఘకాలంగా నాయకత్వం వహిస్తున్న కామ్రేడ్స్‌ను టార్గెట్ చేసి వెంటాడి, వేటాడి పట్టుకుంటున్నారు. నిజానికి అమెరికాకు చెందిన సీఐఏ, ఎఫ్‌బీఐలే మన దేశంలోని ఇంటలిజెన్స్ సంస్థల్ని నడిపిస్తున్నాయి. గత రెండేళ్ల కాలంలో పట్టుబడిన అగ్రనేతలలో కామ్రేడ్స్ పటేల్ సుధాకర్, శాఖమూరి అప్పారావు, ఆజాద్‌లను ఇంటలిజెన్స్ సంస్థలు హత్య గావించాయి. మరి కొందరు

కేంద్ర, రాష్ట్ర స్థాయి నాయకత్వ కామ్రేడ్స్‌ను అరెస్టు చేసి జైళ్లల్లో నిర్బంధించాయి. వీళ్లను వేర్వేరు రాష్ట్రాల్లో బూటకపు కేసుల్లో ఇరికించి సుదీర్ఘ కాలం పాటు ఎలాంటి బెయిల్ ఇవ్వకుండా జైళ్లల్లో మగ్గేలా చేస్తున్నారు. తప్పుడు సాక్ష్యాలు చెప్పించి కఠిన శిక్షలు, జీవితఖైదు విధిస్తున్నారు. వివిధ రాష్ట్రాల్లోని జైళ్లల్లో బందీలుగా వున్న మహిళా నేతలను, కార్యకర్తలను మరింత అమానవీయ శారీరక, మానసిక హింసలకు గురి చేస్తున్నారు. జైళ్లల్లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కామ్రేడ్స్ సుశీల్ రాయ్, షీలా దీదీ, నారాయణ్ సాన్యాల్, కోబాడ్ గాంధీ, అమితాబ్ బాగ్చీ తదితర కామ్రేడ్స్‌కు వైద్య సహాయం అందకుండా చేస్తూ వేధిస్తున్నారు.

ప్రపంచ ఆర్థికవ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభం నుండి బైటపడడం కోసం సామ్రాజ్యవాదులు వెనుకబడిన దేశాలపై వనరుల దోపిడీని తీవ్రతరం చేస్తున్నారు. తమ ప్రయోజనాలకు ఆటంకంగా భావించిన దేశాలపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. వినకుంటే ఏకంగా బాంబులు కురిపిస్తూ అన్యాయమైన యుద్ధాలు చేస్తున్నారు. భారత భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీ పాలకవర్గాలు దేశంపై సంక్షోభ ప్రభావం ఏమీ లేదని ఒకవైపు బుకాయిస్తూనే రోజురోజుకూ మరింతగా సంక్షోభపు లోతుల్లోకి కూరుకుపోతున్నాయి. సామ్రాజ్యవాద దోపిడీకి తలుపులు బార్లా తెరుస్తూ నయా వుదార విధానాల్ని బరితెగించి అమలు చేస్తున్నాయి. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో బహుళజాతి కంపెనీలతో లక్షల కోట్ల రూపాయల ఎంవోయూలు చేసుకొని దేశంలోని సహజ సంపదలన్నీ తెగనమ్ముతున్నాయి. ఎస్ఈజెడ్‌లు, పరమాణు విద్యుత్ రియాక్టర్ల స్థాపన, థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు, భారీ డ్యాంలు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, అభయారణ్యాలు వంటి పథకాలతో ప్రజల నుండి బలవంతంగా భూముల్ని లాక్కుంటున్నాయి. అడవుల్నీ, నీటినీ, భూముల్నీ, మొత్తంగా పర్యావణాన్నీ వినాశనం గావిస్తూ ప్రజల్ని, ముఖ్యంగా ఆదివాసుల్ని నిలువనీడ లేకుండా చేస్తున్నాయి. ఈ విధానాల చాటునే మంత్రులు, ముఖ్యమంత్రులు, బడా అధికార్లు పెద్ద ఎత్తున అవినీతి కుంభకోణాలకు పాల్పడుతూ లక్షల కోట్ల రూపాయల్ని దిగమింగుతున్నారు. ఇలా పోగు చేసుకున్న నల్లధనాన్ని స్విస్ బ్యాంకుల్లో దాచి పెడుతున్నారు. కార్మికుల, రైతుల, వుద్యోగుల, మధ్యతరగతి ప్రజల బతుకుల్ని దుర్భరం చేస్తున్నారు. ఒకవైపు టాటాలు, బిర్లాలు, అంబానీలు, జిందల్‌లు, మిత్తల్‌లు, మహేంద్రలు, రూయియాలు, నికో జైస్వాల్, సన్ నెట్‌వర్క్‌లు తమ ఆస్తుల్ని వేల, లక్షల కోట్లల్లో పెంచుకుంటుండగా దేశంలోని 77 శాతం మంది ప్రజలు రోజుకు 20 రూపాయలైనా సంపాదించలేక ఆకలితో అలమటిస్తున్నారు. ఆకలిచావులు, అధికధరలు, నిరుద్యోగం, విస్థాపన, రోగాలు, పోషకారలోపం వంటి సమస్యల సుడిగుండంలో దేశ ప్రజానీకం కొట్టుమిట్టాడుతున్నారు. దీనిని ప్రశ్నించే, దీనికి వ్యతిరేకంగా వుద్యమించే ప్రజల్ని ఉక్కుపాదంతో పాలకులు అణిచివెయ్యడానికి లక్షలాది పోలీసు, పారామిలిటరీ బలగాల్ని ప్రయోగిస్తున్నారు. పౌర, ప్రజాస్వామిక హక్కుల్ని నేలరాస్తూ నల్లచట్టాల్ని రూపొందిస్తున్నారు. లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని నీళ్లలా ఖర్చు చేసి ప్రజల్ని అణచివేసే యంత్రాంగం కోరల్ని పదునుదేరుస్తున్నారు.

దోపిడీ పాలకవర్గాల పట్ల ప్రజల్లో కట్టలు తెంచుకుంటున్న అసంతృప్తి, అవేశాలు మావోయిస్టు వుద్యమం బలోపేతం కావడానికి వుపయోగపడుతున్నాయనే వాస్తవాన్ని గుర్తించిన పాలకవర్గాలు ఒక పథకం ప్రకారమే 'మావోయిస్టు వుద్యమం దేశ అంతర్గత భద్రతకు అతి పెద్ద ప్రమాదమ'ని ప్రచారం మొదలుపెట్టాయి. మావోయిస్టు వుద్యమాన్ని హింసావాదంగా, మావోయిస్టు పార్టీని టెర్రరిస్టు సంస్థగా చిత్రీకరిస్తూ పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేస్తున్నాయి. తమ సామ్రాజ్యవాద-అనుకూల విధానాల కొనసాగింపుకు, అందులో భాగంగా వనరుల దోపిడీకి అతి పెద్ద అడ్డంకిగా భావిస్తున్న మావోయిస్టు పార్టీని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో ముఖ్యంగా గత రెండేళ్లుగా 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో అత్యంత పాశవిక ఫాసిస్టు దాడిని ప్రారంభించాయి. మావోయిస్టు వుద్యమ ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లో పెంపొందుతున్న ప్రత్యామ్నాయ ప్రజా రాజ్యవ్యవస్థను నాశనం చేసే లక్ష్యం కూడా కలిగిన ఈ దాడిని జనవరి 2011 నుండి మరింత తీవ్రతరం చేసి దీనిని 'ఆపరేషన్ గ్రీన్ హంట్-2'గా పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా వుద్యమ ప్రాంతాల్లో పోలీసు, పారామిలిటరీ బలగాలు, ప్రత్యేక బలగాలు ఇవి తయారు చేసిన విప్లవ ప్రతీఘాతుక గూండా మూకలు బూటకపు ఎన్‌కౌంటర్లు, విచ్చలవిడి హత్యలు, గ్రామదహనాలు, లూటీలు, మహిళలపై అత్యాచారాలు, అరెస్టులు, చిత్రహింసల పరంపరను తీవ్రతరం చేశాయి. ఛత్తీస్‌గఢ్‌లో సైన్యాన్ని మోహరించడానికి పూర్తి సన్నాహాలు చేస్తూ మాడ్ ప్రాంతంలో 800 చదరపు కిలోమీటర్ల భూమిని స్వాధీనం చేసుకోబోతున్నారు. మాడ్ ప్రాంతంలోనూ, ఛత్తీస్‌గఢ్-ఒడిషా సరిహద్దులోనూ రెండు సైనిక శిక్షణా కేంద్రాలను స్థాపించబోతున్నారు. వాయుసైనిక బేస్ నిర్మాణం కోసం కూడా సన్నాహాలు చేయడంతో పాటు 'ఆత్మరక్షణ' పేరుతో వాయుసైన్యానికి దాడులు చేసే అధికారం కూడా ఇచ్చారు.

దండకారణ్యం (ఛత్తీస్‌గఢ్) లోని చింతల్‌నార్ ప్రాంతంలో మార్చ్ 11 నుండి 16 మధ్యలో 350 మంది కోబ్రా కమాండోలు, కోయ కమాండోలు, వందలాది ఎస్‌టిఎఫ్ బలగాలు మొర్‌పల్లి, తిమ్మాపురం, తాడిమెట్ల గ్రామాల్లో విచ్చలవిడి విధ్వంసకాండ సాగించి 300 ఇండ్లు కాలబెట్టారు. వేల క్వింటాళ్ల ధాన్యం తగులబెట్టారు. ఇంటింటినీ దోచుకున్నారు. ముగ్గురు గ్రామీణులను కాల్చిచంపారు. ఇద్దరిని మాయం చేశారు. ఐదుగురు మహిళలపై అత్యాచారం చేసి దాదాపు 50 మంది గ్రామస్తుల్ని తీవ్రంగా హింసించారు. దీనిపై విచారణ

కోసం వెళ్లిన ప్రజాస్వామికవాదులపై, రిపోర్టింగ్ కోసం వెళ్లిన మీడియా ప్రతినిధులపై, బాధితులకు సహాయ సామగ్రిని తీసుకెళ్తున్న సామాజిక కార్యకర్తలపై ఫాసిస్టు ముఖ్యమంత్రి రమన్‌సింగ్, పాలకవర్గాల కావలికుక్కలైన డిజిపి విశ్వరంజన్, బస్తర్ ఐజి లాంగ్‌కుమేర్, దంతెవాడ ఎస్ఎస్‌పి కల్లూరిలు కుట్రపన్ని సల్వాజుడుం గూండాలతో దాడులు చేయించి వాళ్లను ఆ ప్రాంతానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సంఘటనలపై రాష్ట్రంలోనూ, దేశంలోనూ బాగా ప్రచారం జరిగిన నేపథ్యంలో తప్పనిసరై రమన్‌సింగ్ తాడిమెట్ల గ్రామాన్ని పర్యటించాడు. ఆ సందర్భంగా ఒక వైపు ముఖ్యమంత్రి సభ జరుగుతుండగానే అదే గ్రామంలో మరో మూలన కోయ కమాండోలు మరో 15 ఇండ్లల్లో లూటీకి పాల్పడి కొందరిని కొట్టి ఒక మహిళపై అత్యాచారం చేశారంటే ఛత్తీస్‌గఢ్‌లో ఫాసిస్టు బీభత్సకాండ ఏ స్థాయిలో పేట్రేగిపోతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ తరహా దాడుల్ని బస్తర్ ప్రాంతంతో పాటు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో కూడా నిత్యం కొనసాగిస్తూనే వున్నారు. అంతే కాకుండా ఈ ప్రాంతాల్లో రహస్య హంతక ముఠాల్ని ఎగదోసి ప్రజా సంఘాల కార్యకర్తల్ని, పార్టీ కార్యకర్తల్ని హత్య చేయిస్తున్నారు. మహిళా కార్యకర్తలపై అత్యాచారాలూ, దాడులూ ప్రత్యేకించి చేయిస్తున్నారు. ఏప్రిల్ 19న నారాయణ్‌పూర్ జిల్లాలోని చినారీ గ్రామంలో 14 ఏళ్ల బాలుడు రజ్నును కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కథల్లారు. ఇవి దండకారణ్యంలో రోజువారీగా జరుగుతున్న తీవ్ర నిర్బంధకాండలో కొన్ని తాజా వుదాహరణలు మాత్రమే.

మార్చ్ 14న బీహార్‌లోని తూర్పు చంపారన్ జిల్లాలో పోలీసులు ముగ్గురు మహిళలతో సహా ఆరుగురు మావోయిస్టు కార్యకర్తల్ని కాల్చి చంపారు. మరి కొందరిని అరెస్టు చేశారు. ఝార్ఖండ్ ప్రభుత్వం మావోయిస్టు నేతల్ని హతమార్చే లక్ష్యంతో వేలాది సంఖ్యలో పోలీసు, పారామిలిటరీ బలగాల్ని దించి దాడులకు పాల్పడుతున్నది. విచ్చలవిడి అరెస్టుల్ని కొనసాగిస్తున్నది. విస్థాపన, భూముల బలవంతపు స్వాధీనానికి వ్యతిరేకంగా వుద్యమిస్తున్న ప్రజలపై ఫాసిస్టు దాడులు చేస్తున్నది. ఒడిశాలో దళారీ నవీన్ పట్నాయక్ ప్రభుత్వం రాష్ట్రం నలుమూలలా బూటకపు ఎన్‌కౌంటర్లు సాగించి గత 4 నెలల్లోనే 25 మందికి పైగా మావోయిస్టు కార్యకర్తల్ని, గనుల తవ్వకాల్ని వ్యతిరేకించే కార్యకర్తల్ని, సాధారణ ప్రజల్ని కాల్చి చంపింది. వీరిలో 12 ఏళ్ల బాలిక జాంగ, మరి కొందరు టీనేజ్ బాలికలు వున్నారంటే పట్నాయక్ సాగిస్తున్న ఫాసిస్టు దమనకాండను అర్థం చేసుకోవచ్చు.

గత 34 ఏళ్లుగా సాగించిన ఫాసిస్టు పాలనను ఎలాగైనా నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో పశ్చిమ బెంగాల్ సీపీఎం ప్రభుత్వం ఎన్నికలకు ముందుగా ప్రజలపై, మావోయిస్టులపై దాడిని తీవ్రతరం చేసింది. పోలీసు, పారామిలిటరీ బలగాలతో, తన గూండా మూకలైన హర్మద్ బాహినితో అది హత్యాకాండలకు, అత్యంత దారుణ కృత్యాలకు పాల్పడుతున్నది. నెతాయి హత్యాకాండ, శశధర్ మహతో హత్య వంటివి కొన్ని తాజా వుదాహరణలు మాత్రమే. అరెస్టయిన మావోయిస్టు నాయకులపై, ముఖ్యంగా మహిళలపై అది అమానవీయమైన హింసకు పాల్పడుతున్నది. ఇటీవల మేదినీపూర్ జైలులో సమ్మెకు దిగిన రాజకీయ ఖైదీలపై అది పోలీసు బలగాల్ని వుసిగొల్పి దారుణంగా దాడి చేయించింది. రాష్ట్రంలో మావోయిస్టు వుద్యమాన్ని తుడిచిపెట్టామని గొప్పలు చెప్పుకునే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన పోలీసు బలగాల్ని పెద్ద ఎత్తున పెంచుతూనే వున్నది. మావోయిస్టు వుద్యమ నేతల్ని వెంటాడి వేటాడే ఫాసిస్టు విధానాల్ని వుధృతం చేసింది. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం కోసం వుద్యమిస్తున్న ప్రజలను అణిచివేస్తున్నది. హంతక ముఠాలతో హత్యలు చేయిస్తున్నది. మహారాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ వుద్యమ ప్రాంతాల్లో సీ–60 కమాండోలతో దమనకాండను యదావిధిగా కొనసాగిస్తోంది. పట్టణాల్లో మావోయిస్టు నేతలను, ప్రజాస్వామిక వాదుల్ని అరెస్టు చేసి బూటకపు కేసుల్లో ఇరికిస్తున్నది.

ప్రజలారా! ప్రజాస్వామికవాదులారా! దేశభక్తులారా! పై ఫాసిస్టు నిర్బంధ చర్యలు, మావోయిస్టు నేతల అరెస్టులు ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో సోనియా–మన్మోహన్‌సింగ్–చిదంబరంల దేశ పాలక ముఠా సామ్రాజ్యవాదుల దన్నుతో ప్రజలపై సాగిస్తున్న యుద్ధంలో భాగమే. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభపు ప్రభావం దేశంలోని సకల రంగాలపై పడుతున్న నేపథ్యంలోనే ఈ రాజకీయ దమనకాండను, హత్యాకాండల్ని, పౌరహక్కులపై దాడుల్ని చూడాలి. మావోయిస్టు విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించి తమ సామ్రాజ్యవాద–అనుకూల, ప్రజావ్యతిరేక విధానాల్ని యదేచ్ఛగా కొనసాగించాలనే కుట్రలో భాగమే ఇదంతా. అణచివేత ప్రతిఘటనకు దారితీస్తుందనేది చారిత్రక సత్యం. హత్యలతో, అరెస్టులతో, నిర్బంధ క్యాంపెయిన్లతో ప్రజా వుద్యమాల్ని, విప్లవోద్యమాల్ని అణిచెయ్యగలమని సోనియా–మన్మోహన్‌సింగ్–చిదంబరం పాలక ముఠా కంటున్న కలలు పగటి కలలు కాకతప్పదు. దేశాన్ని తెగనమ్మివేస్తున్న భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీ పాలకవర్గాలూ, వాళ్లను నడిపిస్తున్న సామ్రాజ్యవాదులే మన దేశ వికాసానికి, స్వావలంబనకు, సార్వభౌమత్వానికి, స్వాతంత్ర్యానికి, ప్రజల సంక్షేమానికి అతి పెద్ద శత్రువులు. వీళ్లను సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో మా పార్టీ నాయకత్వంలో సాగుతున్న ప్రజాయుద్ధంలో, నూతన ప్రజాస్వామిక విప్లవంలో పెద్ద ఎత్తున సమీకృతం కావల్సిందిగా మా కేంద్రకమిటీ పిలుపునిస్తున్నది. పౌరహక్కుల కార్యకర్తలు, మేధావులు, ప్రజాస్వామికవాదులు, శాంతి చర్చలు జరగాలని కోరుకుంటున్న వాళ్లు అందరూ మా వుద్యమ ప్రాంతాలను పర్యటించి ఇక్కడ జరుగుతున్న అమానుష దమనకాండను,

హత్యాకాండను స్వయంగా పరిశీలించాలని మా కేంద్ర కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది. 'ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యం' అని చెప్పుకునే ఈ దేశం నడిబొడ్డున అత్యంత పేద ప్రజలపై, ఆదివాసులపై సాగుతున్న ప్రభుత్వ ఫాసిస్టు హింసకు సంబంధించిన వాస్తవాలను దేశ ప్రజలందరి ముందు ఉంచాలని మా కేంద్ర కమిటీ కోరుతున్నది.

ఈ అరెస్టులను, హత్యాకాండల్ని, విధ్వంసకాండను, లూటీలను, అత్యాచారాల్ని, దుష్ప్రచారాన్ని, రాజ్య ఫాసిస్టీకరణను, యూఏపీఏ వంటి నల్లచట్టాల్ని ఖండించాలనీ, దీనికి వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలని మా కేంద్ర కమిటీ ప్రజలకు, ప్రజాస్వామికవాదులకు పిలుపునిస్తున్నది. మావోయిస్టు నేతల్ని బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. ప్రభుత్వ ఫాసిస్టు బీభత్సకాండను సమైక్యంగా, సమరశీలంగా ప్రతిఘటించడమే మార్గమని, అందుకు సాహసంగా ముందుకు రావాలని మా కేంద్ర కమిటీ విప్లవ ప్రజలందరినీ కోరుతున్నది. పార్టీ, పీఎల్‌జీఏ నాయకత్వంలో సాగుతున్న ప్రజా ప్రతిఘటనోద్యమాన్ని మరింత తీవ్రతరం చేయడం ద్వారానే, ఇందులోకి వేల, లక్షల సంఖ్యలో సమీకృతం కావడం ద్వారానే మనం ఈ దాడిని ఓడించగల్గుతామని స్పష్టం చేస్తున్నది.

మావోయిస్టు వుద్యమ నేతల అరెస్టుకు, ప్రజలపై దేశ పాలకముఠా సాగిస్తున్న యుద్ధానికి నిరసనగా మే 21–22 తేదీల్లో 48 గంటల పాటు జరిగే 'భారత్ బంద్'ను విజయవంతం చేయాల్సిందిగా మా కేంద్రకమిటీ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది. ఈ బంద్ ప్రధానంగా 6 రాష్ట్రాల్లో – ఝార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రలోని 3 జిల్లాలు – గడ్చిరోలి, చంద్రపూర్, గోందియాలలో, ఉత్తరప్రదేశ్ లోని బీహార్ సరిహద్దు జిల్లాల్లో, మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో జరుగుతుంది. మిగతా రాష్ట్రాలలో వివిధ రూపాల్లో నిరసన సాగుతుంది. అయితే వైద్యం, విద్యార్థుల పరీక్షలు, ఇంటర్వ్యూలు వంటి అత్యవసర సేవల్ని ఈ బంద్ నుండి మినహాయిస్తున్నాం.

Abhay

**(అభయ్)**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**సీపీఐ (మావోయిస్టు)**

# పౌర హక్కుల నేత ప్రొఫెసర్ బుర్రా రాములు మృతికి ప్రగాఢ సంతాపం ప్రకటిద్దాం!

2011 మే 14న ప్రొఫెసర్ బుర్రా రాములు కన్నుమూశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆయన హన్మకొండలోని వెంకటరమణ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి 'క్రాంతి' సంతాపం ప్రకటిస్తోంది. ఆయన కుటుంబ సభ్యులకూ, బంధు మిత్రులకూ ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తోంది.

పౌర హక్కుల నేతగా, తెలంగాణావాదిగా చిరపరితుడైన బుర్రా రాములు 1954 జూన్ 10న ఖిలా వరంగల్‌లో పుట్టారు. విద్యార్థి దశలోనే ఆయనకు విప్లవ రాజకీయాలు పరిచయమయ్యాయి. విద్యార్థి దశలోనే ఎన్నో పోరాటాల్లో చురుకైన పాత్ర వహించారు. ఆర్.ఎస్.యు., పి.డి.ఎస్.యు. ఐక్య సంఘటనగా ఏర్పడి 1980లో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఎన్నికల్లో పోటీ చేసిన సందర్భంలో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. పరిశోధక విద్యార్థిగా వున్న సమయంలోనే ఎ.పి.సి.ఎల్.సి.లో సభ్యత్వం తీసుకున్నారు. వరంగల్ జిల్లాలోని తీవ్ర నిర్బంధ పరిస్థితిలో సైతం ఆయన ధైర్యంగా హక్కుల కోసం పోరాడారు. ముఖ్యంగా ఈ జిల్లాకు చెందిన పౌరహక్కుల నేతలు డాక్టర్ రామనాథం, నర్రా ప్రభాకర్ రెడ్డిలను రాజ్యం క్రూరంగా చంపిన నేపథ్యంలో సైతం ఆయన నిబ్బరంగా ప్రాణాలకు తెగించి ఉద్యమాన్ని అంటిపెట్టుకునే వున్నారు. పోలీసుల, నల్లదండు ముఠాల బెదిరింపులకు ఎన్నడూ తలవొగ్గలేదు.

తెలంగాణాలో జరిగిన ఎన్నో బూటకపు ఎన్‌కౌంటర్లు, ఎన్‌కౌంటర్ల సందర్భంగా జరిగిన నిజ నిర్ధారణల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో ఎన్నోసార్లు పోలీసు వేధింపులను ఎదుర్కొన్నారు.

మొదట ఎపిసిఎల్‌సిలో పనిచేసిన ఆయన, ఆ తర్వాత మానవ హక్కుల వేదికలో చేరి నాయకత్వ బాధ్యతలను సైతం నెరవేర్చారు. డాక్టర్ బాలగోపాల్‌కు సన్నిహితులుగా వున్నారు. ఆయన మరణం ప్రజాస్వామిక, హక్కుల ఉద్యమాలకు నష్టదాయకం.

# ప్రపంచ ద్రవ్యం 'డాలర్'ను కాదన్న బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సమావేశం

చైనా సముద్ర తీరంలోని 'సాన్యా' నగరంలో 2011 ఏప్రిల్ 15న బ్రిక్స్ దేశాల నేతల శిఖరాగ్ర సమావేశం జరిగింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సంక్షోభం లోకి కూరుకుపోయిన ఈ సందర్భంలో బ్రిక్స్ దేశాలయిన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలు ఆర్థిక, ద్రవ్య, వాణిజ్య వ్యవహారాల గురించి చర్చించుకుని ఒక కార్యాచరణ ప్రణాళికను సంయుక్తంగా రూపొందించుకున్నాయి. వాతావరణ మార్పులు, ఆహార భద్రత, అంతర్జాతీయ రాజకీయాలు కూడా చర్చించి, ఐక్య రాజ్య సమితి సహా వివిధ అంతర్జాతీయ సంస్థలను పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేశాయి. తీవ్రవాదం లాంటి సమస్యలపై కీలక నిర్ణయాలు చేసాయి.

అమెరికా సహా సంపన్న దేశాలన్నీ ఆర్థిక మాంద్యంలో కూరుకుపోతున్నాయి. బ్రిక్స్ దేశాలు మాత్రం వృద్ధి రేటు సాధిస్తున్నట్లు చెప్పుకుంటున్నాయి. ప్రపంచ వాణిజ్యంలో 15 శాతం అంటే నాలుగు లక్షల కోట్ల డాలర్ల వాణిజ్యం చేసే ఈ అయిదు దేశాలు, ప్రపంచ జనాభాలో 43 శాతం (300 కోట్లు) వున్న అతి పెద్ద మానవ వనరులను కలిగి వున్నాయి. ప్రపంచ స్థూల జాతీయాభివృద్ధిలో నాలుగో వంతు వాటాను కలిగిన ఈ దేశాలు ప్రపంచ వ్యవహారాల్లో న్యాయమైన వాటా కోసం డిమాండ్ చేస్తున్నాయి. 2010 నవంబర్‌లో అంతర్జాతీయ ద్రవ్య సంస్థల్లో ఆరు శాతం ఓటింగ్ హక్కులను పొందాయి.

నేటి సంక్షోభ పరిస్థితుల్లో అందరికీ సమాన వాటా దక్కేలా సంస్కరణలు చేపట్టాలని 'సాన్యా' సమావేశంలో డిమాండ్ చేస్తున్నాయి. భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా (ఐ.బి.ఎస్.ఎ.) దేశాల ప్రాముఖ్యతను గుర్తిస్తూ వీటిలో ఐక్య రాజ్య సమితిలో హక్కులేని వాటి తాత్కాలిక సభ్యత్వాన్ని శాశ్వత సభ్యత్వంగా మార్చడానికి రష్యా, చైనాలు మద్దతును ప్రకటించాయి.

**డాలర్ సంక్షోభం:** రెండవ ప్రపంచ యుద్ధం వరకు వాణిజ్యానికి కేంద్రంగా వున్న ఇంగ్లండు కరెన్సీ 'పౌండ్' కీలక ద్రవ్యంగా వుండింది. ఆ తర్వాత ఆర్థికంగా పరిపుష్టం అయిన అమెరికన్ 'డాలర్' కీలక విదేశీ మారక ద్రవ్యంగా మారిపోయింది. అప్పటి నుండీ ప్రపంచ పరిణామాలన్నీ డాలర్ చుట్టూ తిరగడంతో డాలర్ ప్రపంచ ద్రవ్యంగా బలపడింది.

డాలరు కేంద్రంగా వున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అమెరికా, యూరప్ సామ్రాజ్యవాద దేశాలు అనుసరించిన రాజకీయ, ఆర్థిక, మిలిటరీ ఆధిపత్య విధానాల కారణంగా ప్రపంచ ఆర్థిక, ద్రవ్య మార్కెట్లలో అస్థిరత నెలకొన్నది. ద్రవ్య విధానం మాంద్యంలో కూరుకుపోయి దివాళా తీసిన అమెరికా బ్యాంకులు, ద్రవ్య సంస్థలు కుప్పకూలిపోయాయి. ప్రపంచ దేశాలకు డాలర్‌పై విశ్వాసం తగ్గి, ప్రపంచ వాణిజ్యంలో భయాందోళనలు ఆవరించాయి. జి–7 దేశాలు, జి–20 దేశాలు అనేక చర్చలు, సదస్సులు జరిపి కూడా ఈ సంక్షోభాన్ని పరిష్కరించలేక పోయాయి.

ఈ పరిస్థితుల్లో కూడా సాపేక్షికంగా ఆర్థిక వృద్ధి రేటును కొనసాగిస్తున్న భారత్, చైనాల వైపు అందరి దృష్టి మళ్లింది. ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొన్న రష్యా, బ్రిక్స్ ప్రతిపాదన చేసింది. బ్రిక్స్ శక్తివంతమైన ఆర్థిక కూటమిగా మారిందనీ, అది 2050 నాటికి అమెరికానే అధిగమించే శక్తి కాగలదనీ, గోల్డ్‌యాన్ సాక్స్ లాంటి సంస్థలు అంచనాలు ప్రకటిస్తున్నాయి.

ఆయిల్, గ్యాస్, యురేనియం, అనేక లోహాలు, బొగ్గులాంటి ముడి సరుకులకు గిరాకీ పెరగడం వలన బ్రిక్స్ దేశాలకు అనుకూలత పెరిగింది. యూరోపియన్ యూనియన్ లోని గ్రీసు, పోర్చుగల్, స్పెయిన్ దేశాలు దివాళా తీసినపుడు, చైనా లక్షల కోట్ల పౌండ్ల రుణాల్ని కొనుగోలు చేసింది. అమెరికాకు కూడా చైనా లక్షల కోట్ల డాలర్లను ట్రెజరీ బిల్లుల రూపంలో సమకూర్చింది.

నేటి డాలర్ సంక్షోభ పరిస్థితుల్లో ప్రపంచ ద్రవ్యంగా యూరో కరెన్సీ రాలేని స్థితి వుంది. ప్రపంచ ద్రవ్యం గురించి జి–20తో సహా వివిధ వేదికల్లో తీవ్రమైన చర్చలు జరిగినప్పటికీ, ఫలితం శూన్యం. ఈ నేపథ్యంలో బ్రిక్స్ దేశాలు పరస్పర ఆర్థిక సహకారం పెంపొందించుకునేందుకు వీలుగా పరపతి, నిధుల విడుదల లాంటి లావాదేవీలను స్వంత కరెన్సీలలోనే నిర్వహించాలని ఒప్పందం చేసుకున్నాయి. ఇది ఒక చారిత్రక ప్రాధాన్యత గల పరిణామం. అమెరికన్ అగ్ర రాజ్యం, యూరోపియన్, జపాన్ సామ్రాజ్యవాద దేశాలకు మింగుడు పడని విషయమే. ఇదే వేదిక నుండి లిబియాపై సైనిక శక్తిని వినియోగించడాన్ని వ్యతిరేకిస్తూ మరో తీర్మానాన్ని విడుదల చేసింది. ఇది కూడా అమెరికా, నాటో కూటమిల మిలిటరీ ఆధిపత్య విధానాలకు మింగుడు పడడం కష్టంగానే వుంది.

*(మిగతాది 30వ పేజీలో...)*

# అమరుల జీవిత చరిత్రలు

## కామ్రేడ్ రత్న (అంజిత)



పకడ్బందీ సమాచారంతో 2011 ఏప్రిల్ 24న ఉదయం పోలీసులు మల్కన్‌గిరి జిల్లా తెంతులిపాద్దోర్ గ్రామంలో గెరిల్లాలను చుట్టుముట్టి జరిపిన కాల్పుల్లో కామ్రేడ్ అంజిత అమరురాలయింది.

కామ్రేడ్ అంజిత విశాఖ జిల్లా పెద్దబయలు మండలం తూలం గ్రామంలో నిరుపేద కుయి కుటుంబంలో దాదాపు 22 సంవత్సరాల క్రితం పుట్టింది. ఆమెకు తల్లిదండ్రులు పెట్టిన పేరు రత్న. ఆమెకు ఇద్దరు అక్కా చెల్లెళ్లు, ఒక అన్న వున్నారు. అన్న గ్రామంలో ముఖ్యమైన పాత్ర వహించిన సంఘ కార్యకర్త. ఈయన్ని పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టడం వలన విడుదలైన కొద్దిరోజులకే, ఇటీవలే మరణించాడు. (కామ్రేడ్ అంజితకు ఈ విషయం ఆమె అమరత్వానికి కొద్ది సేపు ముందు మాత్రమే తెలిసింది.)

కామ్రేడ్ అంజిత చిన్న వయసులోనే ద్వారా సంఘం నిర్వహించిన కుట్టు మిషన్ సెంటర్‌లో చేరి బట్టలు కుట్టడం నేర్చుకుంది. తూలం గ్రామం వాకపల్లికి సమీపంలోనే వుంటుంది. కనుక ఉద్యమ ప్రభావం బలంగా వుంటుంది. పోలీసు నిర్బంధం కూడా ఎక్కువే. అయినప్పటికీ దళం ఎప్పుడు వీళ్ల గ్రామానికి వెళ్లినా దళం దగ్గరకు వెళ్లేది. దళం అవసరాలను బాధ్యతగా పట్టించుకునేది.

వాకపల్లి మహిళలపై పోలీసులు చేసిన అత్యాచారాలను ఆమె సహించలేక పోయింది. వాకపల్లి అత్యాచార బాధితులకు న్యాయం జరిగేవరకూ ఉద్యమాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో, సమావేశం జరపడం కోసం అమిడేలు వెళ్లిన దళంపై ఎన్‌కౌంటర్ జరిగి నలుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. అమరులైన వారిలో తన పెదనాన్న కొడుకు కామ్రేడ్ చంటి కూడా వున్నాడు. మిగిలిన ముగ్గురు మహిళా కామ్రేడ్ల అమరత్వం కూడా ఆమెపై ప్రభావాన్ని వేసింది. ఫలితంగా 2008లో ఆమె దళంలో చేరింది. కొద్ది కాలానికి పార్టీ సభ్యురాలయింది.

దళంలోకి వచ్చిన వెంటనే జరిగిన గునికిరాళ్ల ఆంబుష్‌లో ఆమె స్కౌట్‌గా వుండి సమాచారం ఇచ్చింది. గెరిల్లాలు మైన్ పేల్చగా, గ్రేహౌండ్స్ వాడు పెట్టిన పరుగులను చూసి చాలా సంతోషించింది. 2009లో తనను పార్టీ జోన్ సప్లై టీంకు బదిలీ చేస్తే ఎటువంటి శషబిషలు లేకుండా ఆ బాధ్యతను స్వీకరించింది. కష్టభరితమైన, శ్రమతో కూడిన సప్లై పనులను చేయడంలో ఎంతో చురుగ్గా పాల్గొంది. బాధ్యులు ఏ పని చెప్పినా లేదు, రాదు అనకుండా ప్రతి పనినీ సమయస్ఫూర్తిగా చేసేది. దళంలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటిని అర్థం చేసుకుంటూ కొనసాగింది. 2009 నవంబర్లో కలిమెలలో జరిగిన టి.సి.ఒ.సి. కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంది. కామ్రేడ్ అంజిత ఎప్పుడూ నవ్వుతూ, అందరితో కలివిడిగా వుండేది. పాటలు కూడా ఆసక్తిగా నేర్చుకుని పాడుతూ వుండేది.

ఏప్రిల్ 24న ఉదయాన కల్సిన తన సహచరుల ద్వారా కామ్రేడ్ అంజితకు ఆమె సోదరుడి మరణవార్త తెలిసింది. దాంతో పుట్టెడు దుఃఖంలో మునిగిపోయింది. ఆ సమయంలో ఆమెకు సెంట్రీకి వెళ్లాల్సిన బాధ్యత వుండింది. సెంట్రీ బాధ్యులు ఆమె స్థానంలో వేరే వాళ్లను సెంట్రీకి పంపుతామన్నారు. కానీ కామ్రేడ్ అంజిత 'నేనే పోతాను, నా బాధ్యత కదా' అని కన్నీళ్లు పెట్టుకుంటూనే, తుపాకీని అందుకొని సెంట్రీకి పోయింది.

ఆమె సెంట్రీకి వెళ్లిన కొద్ది సేపటికే పోలీసులు చుట్టుముట్టి కాల్పులు జరపడం మొదలుపెట్టారు. తన సహచరులంతా ప్రతిఘటిస్తూ రిట్రీట్ కాగల్గారు కానీ, కామ్రేడ్ అంజిత పోలీసుల భీకర కాల్పుల్లో చిక్కుకుపోయి ప్రాణాలు కోల్పోయింది.

కామ్రేడ్ అంజితలోనే అంకితభావం, ఎన్ని కష్టాలు వచ్చినా బాధ్యతల నుండి వైదొలగని నిబ్బరత్వం విప్లవకారులందరికీ ఆదర్శప్రాయం. కామ్రేడ్ అంజిత ఆశయాలను దృఢంగా ముందుకు తీసుకుపోదామని శపథం చేద్దాం.

# పోరాటాలు - ప్రతిఘటన - సభలు

## ఎ.ఒ.బి.

### విజయవంతమైన జోన్ దశాబ్ది ఉత్సవాలు

**కోరాపుట్‌లో**

ఎ.ఒ.బి. ఏర్పడి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను జరుపుకోవాలని ఎ.ఒ.బి.ఎస్.జడ్.సి. నిర్ణయించింది. మే 7 అల్లూరి జయంతి దినం నుండి జూన్ 7 వరకూ నెల రోజుల పాటు ఈ ఉత్సవాలు జరపాలనీ, జోన్‌లో పది సంవత్సరాల కాలంలో పార్టీ సాధించిన విజయాలను, పొందిన అపజయాలను, ప్రస్తుత ఉద్యమ స్థితిని ఈ సందర్భంగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలనీ పిలుపునిచ్చింది. ఎస్.జడ్.సి. ఇచ్చిన పిలుపును అందుకొని కోరావుట్ డివిజన్‌లో నారాయణపట్నా, లక్ష్మీంపూర్ ఏరియాలలో పలు చోట్ల ప్రచారమూ, బహిరంగ సభలు నిర్వహించారు.

నారాయణ పట్నా బ్లాక్‌లో, తొమ్మిది పంచాయితీలలోనూ బందుగాం బ్లాక్‌లో కౌరుబడి, అలమండ, వల్లాడ, కొమ్మగండ కుంబరిపుట్, కుట్రబెడ తదితర పంచాయితీలలోనూ, లక్ష్మీంపూర్, నారాయణపట్నా, బందుగాం, ఆంధ్రలోని మక్కువ, దుగ్గేరు రోడ్ల పైనా విస్తృతంగా పోస్టర్లూ, బ్యానర్లతో ప్రచారం చేయడం జరిగింది. ఈ ప్రచార కార్యక్రమంలో ప్రధానంగా మిలీషియా కామ్రేడ్స్ పాల్గొన్నారు. ఈ మాసాన్ని పునరంకిత మాసంగా, పునరంకిత సభలుగా భావించి, ప్రజలందరూ ఉద్యమంలో పునరంకితం కావాలనీ, భూమి, నీరు, అడవి, అధికారం కోసం పోరాడాలనీ పిలుపునిస్తూ ప్రచారం చేయడం జరిగింది.

నారాయణపట్నా ఏరియా కమిటీ పరిధిలో తెంతులిపాదర్, బలిపట్ట, బొరిగి, నాగులబెడ్డ పంచాయితీల వారిగా ఒక్కో పంచాయితీలో వున్న రైతు కూలీ సంఘం, మహిళా సంఘం పంచాయితీ కమిటీలకు ఆర్.పి.సి, సెల్స్‌లకు విడి విడిగా దశాబ్ది ఉత్సవాలపై ఎస్.జడ్.సి. విడుదల చేసిన సర్క్యులర్‌ను బోధించడం జరిగింది. వారంతా విషయాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి యిది ఉపయోగపడింది. ఈ తరగతుల అనంతరం సంఘ నాయకత్వం తమ తమ గ్రామాలలో ప్రజల్లో ప్రచారం చేశారు.

**పంచాయితీల వారిగా జరిగిన బహిరంగ సభలు:**

మే 21న తెంతులిపాదర్ పంచాయితీలో బహిరంగ సభ జరిగింది. 800 మంది ప్రజలు తమ సాంప్రదాయక ఆయుధాలూ, ఎర్రజెండాలతో హాజరయ్యారు. ఈ సభకు ఎ.ఆర్.సి.ఎస్. పంచాయితీ కమిటీ అధ్యక్షుడు, అధ్యక్షత వహించగా మరో ముగ్గురు సంఘ నాయకులు, సాంస్కృతిక దళం కమాండర్, జన మిలీషియా కమాండర్, ఏరియా ఆర్గనైజర్‌లు వక్తలుగా మాట్లాడారు.

మే 26న బలిపట్ట పంచాయితీలో బహిరంగ సభ జరిగింది. ఈ సభకు 700 మంది ప్రజలు హాజరయ్యారు.

రెండు సభల సందర్భంగానూ పార్టీ జెండాను ఎగుర వేసి ప్రజలంతా బ్యానర్లతో ర్యాలీగా సభాస్థలికి వెళ్లారు. ఈ సందర్భంగా సాంస్కృతిక బృందం ప్రదర్శించిన నృత్యం, పాటలు, నాటిక సభికులను ఎంతో ఉత్తేజపరిచాయి.

పై రెండు బహిరంగ సభల నిర్వహణలోనూ పంచాయితీ కమిటీలూ, మిలీషియా క్రియాశీలక పాత్ర వహించాయి. ముందుగానే సభ ఏర్పాట్ల కోసం పని విభజన చేసుకుని సభాస్థలిని బాగు చేయడం, వేదికను నిర్మించడం, ప్రజలకు నీడ కోసం పందిళ్లు వేయడం, ప్రజలకు దప్పిక తీర్చడం కోసం అంబలి తయారు చేయడం, మైక్ ఏర్పాట్లు, సెంట్రీలు, రక్షణ ఏర్పాట్లు అన్నీ ఎంతో బాధ్యతగా నిర్వహించాయి. విపరీతమైన వర్షాలు కురిసినప్పటికీ ప్రజలు గొడుగులతో వచ్చి సభను విజయవంతం చేశారు.

బందుగాం బ్లాక్‌లో కుంబరిపుట్ పంచాయితీలోనూ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని బహిరంగ సభ జరిగింది. మే 20న జరిగిన ఈ సభను దాదాపు అయిదు వేల ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సభ సందర్భంగా ఈ ప్రాంతంలోని శాంతి కమిటీ కార్యకర్తలుగా పనిచేస్తున్న కొంత మంది ప్రజల ముందు తమ తప్పులు ఒప్పుకొని క్షమాపణలు చెప్పి, ఇక నుండి శాంతి కమిటీలో పని చేయమని పత్రికా ముఖంగా రాజీనామాలు చేస్తామని ప్రకటించారు. కానీ ప్రజలు మాత్రము ఈ రాజీనామాలను వ్యతిరేకించారు.

**ఈస్ట్ డివిజన్‌లో**

మొదటి నుండి గాలికొండ ఏరియా పార్టీకి బలమైన ప్రజా మద్దతు గల ప్రాంతం. కనుక సహజంగానే శత్రువుకు టార్గెట్ అయింది. గత ఆరు సంవత్సరాల నుంచీ పెద్ద ఎత్తున కమెండో, పారా మిలిటరీ బలగాలను ఏరియాలో మోహరించి అనేక ఏరియా డామినేషన్ కేంపెయిన్లు చేపట్టినప్పటికీ, ప్రజల, మిలీషియా మద్దతుతో శత్రు పద్మ వ్యూహంలోనే పార్టీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

ప్రజా మద్దతు వున్నంత వరకు పార్టీని సైనిక విన్యాసాలతో ఏమీ చేయలేమని గ్రహించిన శత్రువు, గత ఏడాది నుంచీ ఏరియాలో సంస్కరణలను అమలు చేస్తున్నాడు. సమాంతరంగా సరెండర్ కార్యక్రమాన్ని చేపట్టి, అనేక మోసపూరిత పద్ధతులలో నిర్బంధించి, బలవంతంగా అనేక మంది ప్రజలు, మిలీషియాను సరెండర్ చేయించుకున్నాడు. సరెండర్ అయినప్పటికీ ప్రజలు పార్టీ పక్షానే వుంటున్నారు.

ఈ నేపథ్యంలో ఈ ఏరియాలో దశాబ్ది ఉత్సవాలను జరపాలని డివిజన్ పార్టీ నిర్ణయించింది. సమీప మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున కరపత్రాలూ, పోస్టర్లు వేయడం జరిగింది. శత్రువు ఎట్టి పరిస్థితుల్లోనూ దశాబ్ది ఉత్సవాలను జరగకుండా అడ్డుకునేందుకు, సమాచారం ఆధారంగా ఉత్సవ సభలపై దాడులు చేసేందుకు వీలుగా, కమెండో బలగాలను ఉద్యమ ప్రాంతంలో వున్న పోలీసు క్యాంపులకు తరలించి సిద్ధంగా వుంచాడు. ఈ పరిస్థితిలో దశాబ్ది ఉత్సవాలను నిర్వహించడం పార్టీకీ, ప్రజలకూ పెద్ద సవాల్‌గా నిలిచింది. ఎంతటి శత్రు సైనిక నిర్బంధంలోనైనా దశాబ్ది ఉత్సవాలను ప్రజల మధ్యనే నిర్వహించాలని జిల్లా కమిటీ నిర్ణయించింది. అందుకు ప్రధానంగా ప్రజలు, ప్రజా ఇంటెలిజెన్స్‌పై ఆధారపడింది. మిలీషియాతో, ప్రజలతో చర్చించి సభాస్థలిని నిర్ణయించడం జరిగింది.

సభ ప్రారంభమయ్యే సమయానికే శత్రువుకు సమాచారం చేరిపోతుందనీ, అన్ని వైపులా క్యాంపులున్నందున కనీసం సభ ముగిసే సమయానికి శత్రు బలగాలు పాకెట్‌ను చుట్టివేసే అవకాశం వుందనీ పార్టీ గ్రహించింది. ఐతే ప్రజల మద్దతుతో శత్రు చుట్టివేతలను ఛేదించిన అనుభవాలు అనేకం వుండడంతో ప్రజల, మిలీషియా, ద్వితీయ బలగాల రక్షణ వలయంలో సభకు సమాయత్తం అయ్యారు.

శత్రు కదలికల పుకార్లు షికార్లు చేస్తున్నప్పటికీ ఉదయం 11 గంటలకల్లా పార్టీ ఆహ్వానించిన రెండు మండలాల్లోని 40 గ్రామాల ప్రజలు – దాదాపు 600 మంది మహిళలూ, 700 మంది పురుషులూ – తమ పిల్లలతో సహా సభాస్థలికి చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు రైతుకూలీ సంఘం ఏరియా అధ్యక్షుడి అధ్యక్షతన సభ ప్రారంభమయ్యింది.

గాలికొండ ఏరియా కమిటీ సభ్యుడు జెండా ఆవిష్కరించి అమరులకు నివాళులర్పించాడు. కామ్రేడ్ బి.కె. అమరత్వానికి ఈ సభను అంకితమిస్తున్నట్టుగా ప్రకటించాడు. ఈస్టు డివిజన్ కమిటీ సభ్యుడు సభా సందర్భాన్ని వివరిస్తూ మాట్లాడాడు. పది వసంతాల ఎ.ఒ.బి. ఉద్యమంలో పార్టీ, ప్రజలు ఎదుర్కొన్న కష్టనష్టాలూ, సమైక్యంగా పోరాడి సాధించుకున్న విజయాలూ, ఆ క్రమంలో ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలూ, వారు మన ముందుంచిన కర్తవ్యాలను వివరించాడు. అనంతరం జోన్ సాహిత్య సాంస్కృతిక పత్రిక 'తూర్పు కనుమ' పది వసంతాల ప్రత్యేక సంచికను ఒక ఏరియా కమిటీ సభ్యుడు ఆవిష్కరించాడు. కామ్రేడ్ బి.కె. రచనల సమాహారం 'మన్యం రచనలు', కామ్రేడ్స్ బి.కె., కరుణల జీవిత చరిత్రగా వెలువడిన 'మన్యం వెలుగులు' పుస్తకాలను మరో ఏరియా కమిటీ సభ్యుడు ఆవిష్కరించాడు. కామ్రేడ్ హరి (కడారి రాములు) జీవిత చరిత్రను మిలీషియా కామ్రేడ్, కామ్రేడ్ గౌతం జీవిత చరిత్రను ఏరియా రైతు కూలీ సంఘ అధ్యక్షుడు, జోన్ మహిళా అమరుల చరిత్రను ఒక మహిళా ఎ.సి.ఎం. ఆవిష్కరించారు. ఆవిష్కరణ అనంతరం ఆవిష్కర్తలంతా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా సాంస్కృతిక విభాగం సభ్యులు ప్రజలూ, పార్టీ సాధించిన విజయాలను, అమరుల త్యాగాలను వివరిస్తూ పాటలు పాడారు.

చివరగా లొంగుబాట్ల బూటకత్వాన్ని బహిర్గతం చేస్తూ బలవంతంగా సరెండర్ చేయించబడిన ప్రజలు మాట్లాడారు. తాము ఉద్యమ ప్రాంతంలో పుట్టి జీవిస్తున్నామనీ, పార్టీ లేకుండా తమకుండేదేమీ లేదనీ మాట్లాడారు. ఇక లొంగుబాటు కాదనీ, తమ బాట తిరుగుబాటేననీ ప్రకటించారు. అమరుల ఆశయాలను కొనసాగిస్తామంటూ చేసిన నినాదాలతో సభ విజయవంతంగా ముగిసింది.

# కోరాపుట్ డివిజన్

## విజయవంతమైన మనోబల్ సభ

నారాయణ పట్నా బ్లాక్‌లోని ఛసి ములియా సంఘం నాయకత్వంలో జరుగుతున్న భూ పోరాటం ఉత్తేజంతో బందుగాం ప్రాంతంలో కూడా ఇప్పటికే కౌరుబడి, వల్లాడ, అలమండ పంచాయితీలలో ప్రజలు కదిలి కత్తులపేటలోని భూస్వాముల భూములను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇదే బ్లాక్‌లోని కుంబరిపుట్ పంచాయితీలో భూస్వాములు, శాంతి కమిటీ నేతలు పోలీసుల అండతో ప్రజలను బెదిరిస్తూ, భయాందోళనలకు గురి చేస్తూ ప్రజలను సంఘంలోకి రాకుండా ఆటంకపర్చుతున్నారు. అయినప్పటికీ నిర్బంధమే ప్రజలకు పోరాటం నేర్పుతుందన్నట్టు తమ చుట్టుపక్కల జరుగుతున్న పోరాటాలూ, ఆందోళనలు ఈ

ప్రాంత ప్రజలను కూడా ఉత్తేజపర్చాయి. దాంతో ప్రజలు తెగించి భూస్వాములకు వ్యతిరేకంగా సంఘాల్లోకి సమీకృతులయ్యారు. అలాగే ఈ ప్రాంతంలో సంఘానికి తీవ్ర ఆటంకంగా వున్న గణేష్ కోస్లాను మే 1న పి.ఎల్.జి.ఎ. ఖతం చేయడంతో మరింత ధైర్యంగా ప్రజలు భూస్వాములకు వ్యతిరేకంగా భూపోరాటానికి సిద్ధమయ్యారు. ఈ ప్రజలకు మనోబలాన్ని మరింతగా పెంచేందుకూ, భూ పోరాటానికి మద్దతునిచ్చేందుకు ఛసి ములియా ఆదివాసీ సంఘం (సి.ఎం.ఎ.ఎస్.), బిప్లవి ఆదివాసీ మహిళా సంఘం (బి.ఎ.ఎమ.ఎస్.) ఆధ్వర్యంలో 2011 మే 5న కుంబరిపుట్‌లో మనోబల్ సభను నిర్వహించారు. ఈ సభకు ఎంతో ఉత్సాహంతో నారాయణపట్నా, బందుగాం బ్లాక్‌ల నుండి 15 వేలకు పైగా ప్రజలు సాంప్రదాయక ఆయుధాలు, ఎర్రజెండాలు చేతబట్టి హాజరయ్యారు. సభలో ఛసి ములియా ఆదివాసీ సంఘం అధ్యక్షుడు నాచిక లింగా ప్రసంగం ప్రజలను ఉత్తేజితులను చేసింది. మహిళా సంఘం అధ్యక్షురాలు 'మహిళలు పోరాటంలో సగ భాగం వుండాలని' పిలుపునిచ్చింది. ఈ సభలో సాంస్కృతిక బృందం ఇచ్చిన ప్రదర్శనలు సభికులను ఉత్సాహపర్చాయి.

## దుక్కులు దున్నిన రైతాంగం

నారాయణపట్నం బ్లాక్‌లో 2011 ఏప్రిల్ 29న పంట కోతల అనంతరం తిరిగి భూముల్లో జూన్ 1 నుండి దుక్కులు దున్నడం ప్రారంభించారు. నారాయణపట్నం బ్లాక్‌లో 5వేలకు పైగా ప్రజలు కదిలి నారాయణపట్నం, దెప్పగూడ, విక్రంపూర్, బలిపట్టలలో వున్న భూస్వాముల భూములను దున్నారు.

బందుగాం బ్లాక్‌లోని బందుగాం పంచాయితీలో గొత్తిపుట్, బాసిపుట్, గుమడపుట్, కాట్రగడ్డ తదితర గ్రామాలనుండి రెండు వేల మంది ప్రజలు కదిలి 15 ఎకరాల భూస్వాముల భూముల్లో జెండాలు పాతి దుక్కులు దున్నారు.

## సారా వ్యతిరేక పోరాటం

బందుగాం బ్లాక్‌లో మూడు పంచాయితీల్లో పలు గ్రామాల్లో సారా వండడం, అమ్మడం చేస్తున్నారు. ఈ ప్రాంత ఆదివాసీ ప్రజలు తమ శ్రమనంతా తాగుడుకే ఖర్చు పెడుతూండడంతో కుటుంబాలు అత్యంత దారిద్ర్యంతో జీవిస్తున్నాయి. దీనికి తోడు అనారోగ్యం బారిన పడి, ఆకలితోనూ అనేక మంది మరణిస్తున్నారు. ఈ సారా వ్యాపారాన్ని బంద్ చేయాలని అనేక సార్లు సంఘం హెచ్చరికలు చేసినప్పటికీ వీరు పెడచెవిన పెట్టారు. దాంతో ఛసి ములియా సంఘం, మహిళా సంఘం కల్సి సారా బట్టీలపై దాడులు చేయాలని నిర్ణయించాయి. జూన్ 15న కౌరుబడి, బౌరిగి, నాగులబెద్ద, అలమండ, కొమ్ముగండ, వల్లాడ పంచాయితీలకు చెందిన సుమారు రెండువేల మంది స్త్రీ పురుషులు సారా బట్టీలపై దాడి చేశారు. వరుసగా జగ్గాడ, విక్రంపురం, కర్షి, పెదవల్లాడ గ్రామాలలోని సారా బట్టీలపై దాడి చేసి సారాను ధ్వంసం చేశారు. సారా వండే పాత్రలనూ, సారా నింపే డ్రమ్‌లనూ, బెల్లం, ఇప్పపువ్వు వగైరాలను సంఘం స్వాధీనం చేసుకుంది. ఈ సారా వండే, అమ్మే వాళ్లను ప్రజల ముందు పెట్టి నిలదీసి హెచ్చరించారు.

జూన్ 16న బందుగాం పంచాయితీ వెలగవల, కవిటి గ్రామాలలో కూడా రెండు వందల మంది ప్రజలు కదిలి సారా బట్టీలను ధ్వంసం చేసారు.

## సారా వ్యతిరేక సభ

నారాయణపట్నా బ్లాక్‌లో జరుగుతున్న భూ పోరాటం, సారా వ్యతిరేక పోరాటం స్ఫూర్తితో కోరాపుట్ బ్లాక్ దుంబ్రిపాదర్ పంచాయితీలో సారాను బంద్ చేయాలని పిలుపునిస్తూ జూన్ 15న సి.ఎం.ఎ.ఎస్., బి.ఎ.ఎం.ఎస్ ఆధ్వర్యంలో సభ జరిగింది. ఈ సభకు అయిదు వేల మందికి పైగా ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పంచాయితీలో సారా వండి, అమ్ముతున్న సుండి కులానికి చెందిన వ్యాపారులను ప్రజల ముందు నిలదీసి, ఇక నుండి సారా వ్యాపారాన్ని బంద్ చేయాలని హెచ్చరించారు. సారా వ్యాపారులు తమ తప్పును ప్రజల ముందు ఒప్పుకొని, ఇక నుండి సారా వ్యాపారాన్ని బంద్ పెడతామని హామీ పత్రాలను రాసి ఇచ్చారు.

## శాంతి కమిటీకి వ్యతిరేకంగా

బందుగాం బ్లాక్‌లో కుంబరిపుట్ పంచాయితీలో శాంతి కమిటీ ఆగడాలు మితిమీరుతున్నాయి. ఈ ఆగడాలతో విసిగిపోయిన వందలాది స్త్రీలూ పురుషులు శాంతి కమిటీకి వ్యతిరేకంగా పంచాయితీ సెంటర్‌లో ఊరేగింపు, ధర్నా నిర్వహించారు.

రాయగఢ జిల్లా ఉల్కతొండ, మెల్కతొండ గ్రామాల్లో కూడా శాంతి కమిటీ సభ్యులు ప్రజలను వేధిస్తున్నారు. వారి వేధింపులను తక్షణమే మానుకోవాలని, శాంతి కమిటీ నేతలు ప్రజల వద్దకు వచ్చి బహిరంగంగా క్షమాపణలు చెప్పుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజలు ఊరేగింపు చేసి సభ జరుపుకున్నారు. ఈ సందర్భంగా సారా వ్యాపారాన్ని బంద్ పెట్టాలని కాంట్రాక్టర్లకు హెచ్చరికలు జారీ చేశారు.

దేకపార అనే గ్రామంలో పోలీసులతో కలిసి వచ్చిన శాంతి కమిటీ గూండాలు ఒక కుటుంబం వారిని బాగా కొట్టి వారి దగ్గర వున్న డబ్బులనూ, కొద్దిపాటి బంగారాన్ని దోచుకెళ్లారు. దీనికి

వ్యతిరేకంగా గ్రామస్తులంతా  కలిసి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా చేసారు.

## పోలీసుల కూంబింగ్ ఆపరేషన్‌కు వ్యతిరేకంగా

బందుగాం బ్లాక్ కుంబరిపుట్ పంచాయితీలో పోలీసులు గ్రామాలపై దాడులూ, కూంబింగ్‌లూ చేస్తూ ఆదివాసీ ప్రజలను వ్యవసాయ పనులు చేసుకోనివ్వకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ కూంబింగ్‌లను బంద్ చేయాలనే డిమాండ్‌తో 2011, జూన్ 19న కుంబరిపుట్‌లో ఛసి ములియా ఆదివాసీ సంఘం, విప్లవ ఆదివాసీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో సభ జరిగింది. ఈ సభకు అయిదు వేల మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సభలో నాచిక లింగతో పాటు మరికొంత మంది సంఘనాయకులు మాట్లాడారు. వక్తలు మాట్లాడుతూ పోలీస్ క్యాంప్‌లను ఎత్తివేయాలని, కూంబింగ్స్ బంద్ చేయాలనీ, ప్రజల సమస్యలను పరిష్కరించాలనీ డిమాండ్ చేశారు. ఆసుపత్రులు, బడులు, భూములు ప్రజలకు అవసరం కానీ పోలీసు క్యాంపులు ప్రజలకు అవసరం లేదన్నారు. కుంబరిపుట్‌లో కొత్తగా పోలీసు క్యాంపు పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనీ దీనికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలనీ పిలుపు నిచ్చారు.

## ఇన్‌ఫార్మర్ హతం, మరో నలుగురికి దేహశుద్ధి

సీరిక సపుర కోరాపుట్ డివిజన్, నారాయణపట్నం బ్లాక్ బిజుగాటి పంచాయితీ బలియగూడ గ్రామానికి చెందినవాడు. భూస్వాములకు చెందిన ప్రభుత్వ ప్రోత్సాహక, ప్రజావ్యతిరేక శాంతి కమిటీలో పనిచేస్తూ గ్రామంలో ఆధిపత్యం చెలాయించడం, మావోయిస్టు పార్టీలో, సంఘంలో చేరవద్దని ప్రజలను బెదిరించడం, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం, పోలీసులకు సమాచారం అందించడం చేస్తున్నాడు. 2010 జూలైలో ఇతడి తమ్ముడు సీరిక పురి ఇటువంటి చర్యలకే పాల్పడి ప్రజల చేతిలో హతమయ్యాడు. అప్పుడు సంఘం ముందు లొంగిపోయినట్లే నటించి, రహస్యంగా శాంతికమిటీతో సంబంధాలు, యధావిధిగా తన కార్యకలాపాలు కొనసాగిస్తూనే వున్నాడు. ఈ క్రమంలో రీజినల్ కంపెనీ–3 ఆ ప్రాంతానికి వెళ్ళినప్పుడు పోలీసులకు సమాచారం అందించాడు. ఈ సమాచారంతో 2010 డిసెంబర్ 24న తెంతులిపాదర్ పంచాయితీ తుర్లి–అమ్లియాంబల మధ్య కంపెనీ–3కి చెందిన ఒక సెక్షన్‌పై పోలీసులు చేసిన ఆంబుష్‌లో కామ్రేడ్ సందీప్ అమరుడయ్యాడు. విచారణలో ఈ విషయం బహిర్గతం కావడంతో 2011 జూన్ 23న ఈ ద్రోహిని పి.ఎల్.జి.ఎ హతమార్చింది. ఇతనితో పాటు శాంతికమిటీలో పనిచేస్తూ, ప్రజావ్యతిరేకులుగా తయారైన జాడపాదర్, దేబులి గ్రామాలకు చెందిన మరో నలుగురికి దేహశుద్ధి చేసి హెచ్చరించడం జరిగింది.

## నిరసన దినం సందర్భంగా బహిరంగ సభ

మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ వినీల్ క్రిష్ణ కిడ్నాప్ సందర్భంగా ప్రభుత్వం ఒప్పుకున్న డిమాండ్స్ నేటి వరకూ అమలు కాకపోవడంతో పాటు, ప్రజలపై, సంఘంపై దాడులూ, అక్రమ అరెస్టులు కొనసాగుతున్నాయి. దీనికి నిరసనగా జూన్ 26న నిరసన దినం పాటించాలనే పిలుపును అందుకొని ఛసి ములియా సంఘం కుంబరిలో బహిరంగ సభను నిర్వహించింది. కొద్ది రోజుల ముందు నుండే నిరసన దినాన్ని పాటించాలని విస్తృతంగా పోస్టర్లు వేసి ప్రచారం చేశారు. జూన్ 26 ఉదయం నారాయణపట్నా బ్లాక్ ప్రజలంతా నారాయణపట్నా బి.డి.ఒ. ఆఫీస్‌ను, బందుగాం బ్లాక్ ప్రజలంతా బందుగాం బి.డి.ఒ. ఆఫీస్‌ను ఘెరావ్ చేసి బి.డి.ఒ.లకు తమ డిమాండ్లతో కూడిన పత్రాన్ని ఇచ్చారు. అనంతరం ఊరేగింపుగా కుంబరిలోని సభాస్థలికి వెళ్లారు. సాంస్కృతిక బృందం సభ్యులు పాటలూ, నృత్యాలతో ఊరేగింపుకు ముందు పీఠిన నడిచారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయిన ఈ సభకు నారాయణపట్నా, బందుగాం బ్లాక్‌లకు చెందిన ఇరవై వేలకు పైగా ప్రజలు హాజరయ్యారు. ఈ సభలో అధ్యక్షుడు నాచిక లింగతో పాటు దండపాణి మహంతి, లోక్‌శక్తి అభియాన్ అధ్యక్షుడు ప్రఫుల్ల సామంత్ రాయ్, రవిదాస్, విజయ్ పొరిడా, నిహర్ రంజన్ పట్నాయక్, సుధాకర్ పట్నాయక్ తదితరులు వక్తలుగా పాల్గొన్నారు. 'జైళ్లలో వున్న ఆదివాసీలందరినీ విడిచిపెడతామని ప్రభుత్వం ఒప్పుకున్నదంతా బూటకమేనని, ఒక కేసు కొట్టేస్తే మరో తప్పుడు కేసు పెట్టి తిరిగి జైల్లో పెడుతున్నార'ని వక్తలు ఆరోపించారు. నాచిక లింగపై వున్న మోస్ట్ వాంటెడ్ ముద్రను తొలగించాలనీ, జైళ్లో వున్న వాళ్లందరినీ విడిచిపెట్టాలనీ డిమాండ్ చేశారు.

## శాంతి సంఘం లొంగుబాటు

నారాయణపట్నా పోరాటాలతో ఉత్తేజితులైన బందుగాం బ్లాక్ ప్రజలు కూడా నారాయణపట్నా ప్రజలతో కదం కలిపారు. పోరుబాట పడుతున్న ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ఉద్దేశంతో భూస్వాములూ, మైనింగ్ మాఫియా, సారా వ్యాపారులూ కల్సి శాంతి సంఘం పేరుతో ఒక అరాచక ముఠాను ఏర్పాటు చేశారు. ఈ ముఠా ఆదివాసీలపై దాడులు చేసి చిత్రహింసలు పెడుతున్నారు. వాళ్ల కోళ్ళు, మేకలూ, డబ్బులూ, బంగారం ఎత్తుకు పోతున్నారు. వీరికి బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతో ఆనంద్ కిర్వానీ వంటి శాంతి సంఘం నేతను పి.ఎల్.జి.ఎ. ఖతం చేసింది. దీనితో బెంబేలెత్తిన శాంతి సంఘం నేతలు ఒక్కొక్కరు రాజీనామా చేశారు. కానీ బందుగాం బ్లాక్‌లోని శాంతి సంఘం నాయకులు మాత్రం లొంగిరాలేదు. ఇటీవల బందుగాంకు విప్లవోద్యమం విస్తరించడంతో

శాంతి సంఘం అరాచకాల విషయం ప్రజల మొదటి ఎజెండాగా ముందుకు వచ్చింది. విసిగివేసారిన ప్రజలు శాంతి సంఘం నేతలను తీవ్రంగా శిక్షించాలని తమ కసిని వెలిబుచ్చారు. దానితో ముఖ్యుడూ, శాంతి సంఘం స్థాపకుల్లో ఒకడైన గణేష్‌ను పి.ఎల్.జి.ఎ. ఖతం చేసింది.

దీనితో శాంతి సంఘం నేతలందరూ ప్రజల ముందు లొంగిపోవాలనే బహిరంగ ప్రకటనకు స్పందించి ప్రజల కాళ్లా వేళ్లా బడుతూ ముందుకొచ్చారు. ప్రజలకు హామీ పత్రాలు రాసిచ్చి, పత్రికా ముఖంగా లొంగిపోతున్నామని ప్రకటించారు. ఇన్నాళ్లూ ప్రజలను లెక్కలేకుండా అరాచకాలు సాగించిన వీళ్లు పిల్లుల్లా మారిపోవడంతో ప్రజలు ఉత్సాహపడుతున్నారు. ఈ ప్రాంతంలో జరిగే వివిధ పోరాటాల్లో చురుగ్గా కదులుతున్నారు.

## ఈస్ట్ డివిజన్

### 'ప్రజా ప్రతినిధుల'ను నిలదీసిన ప్రజలు

గాలికొండ ఏరియా పరిధిలో ఆదివాసీ రైతుకూలీ సంఘం నాయకత్వంలో సుమారు 500 మంది ప్రజలు గూడెం పంచాయితీకి చెందిన ఎం.పి.టి.సి., వార్డు సభ్యులు, వి.ఆర్.పి., వి.ఒ.లను ప్రజా సభకు పిలిచి ప్రజా సమస్యలపై నిలదీశారు. అయిదు సంవత్సరాల క్రితం ఎన్నికైన మీరు ఇంత వరకు ప్రజలకు ఏం చేసారనీ, గత రెండున్నరేళ్ల నుండి పంచాయితీలో పోలీసులు తీవ్ర నిర్బంధం అమలు చేస్తూ, ఇప్పటికి సుమారు 80 మందిని అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారనీ, నిర్బంధం వలన సుమారు 80 కుటుంబాలు ఈ ప్రాంతం విడిచి వెళ్లిపోయాయనీ, ఇంత జరుగుతుంటే మీరేం చేసారని ప్రశ్నించారు. పంచాయితీలో సీరియస్‌గా కరువు వుందనీ, ఈ సంవత్సరం పంటలు పండక ఎలా బతకాలో తెలియని పరిస్థితి వుందనీ, కనీసం కరువు పరిస్థితిని సమీక్షించడానికి ఒక్కసారి కూడా రాలేదన్నారు. ఇప్పటికీ యిదే పరిస్థితి వుందని మీరేం చేయదల్చుకున్నారని నిలదీసారు. ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. కింద పనిచేసి సంవత్సర కాలం అయినా కూలీ చెల్లించకుండా, లక్షల రూపాయలు మీరే మింగేసారని వి.ఆర్.పి., వి.ఒ.లను నిలదీసారు. వెంటనే పనిచేసిన రైతులకు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ప్రజలు తీవ్ర ఆవేశంతో ప్రశ్నిస్తుంటే 'ప్రజా ప్రతినిధులు' దిక్కుతోచక నీళ్లు నమిలారు.

ఎంపిటిసిలు తదితర ప్రతినిధులంతా ఎంఆర్ఒ ఆఫీసుకు ప్రజలతో వెళ్లి పై సమస్యలపై నిలదీయాలని ఈ ప్రజాసభలో తీర్మానం జరిగింది.

అనుకున్న రోజు సుమారు 500 మంది ప్రజలు కదిలి వెళ్లగా, దోపిడీ వర్గ స్వభావం కలిగి వుండే ఈ ప్రజా ప్రతినిధులు పోరాటాన్ని నీరుగార్చడానికి ప్రయత్నించారు. పోరాటంకు నాయకత్వం వహించేందుకు ముందుకు రాకపోవడంతో ప్రజలు తమ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు. ఆ తర్వాత గూడెం కొత్తవీధి ఎం.ఆర్.ఒ. ఆఫీసుకు ప్రజలే వెళ్లి మెమొరాండం ఇచ్చి తమ సమస్యలను పరిష్కరించాలనీ, నిర్బంధాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేసారు. పోలీసులు తమను తీవ్ర చిత్రహింసలకు గురిచేస్తున్నారని పత్రికా ప్రతినిధుల సమక్షంలో వెల్లడించారు. తమను అడవి నుండి వెళ్లగొట్టడానికి ప్రభుత్వం కుట్ర చేస్తున్నదనీ, అడవిపై తమ అధికారాన్ని కాపాడుకోవడానికి పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు.

### బతుకు కోసం పునఃసంఘటితమైన ప్రజలు

ఈస్ట్ డివిజన్‌లోని గాలికొండ ఏరియా కమిటీ పరిధిలోని పలకజీడి పాకెట్‌లో ఉద్యమం దెబ్బ తిన్న తరువాత ప్రజల సమస్యలు తీవ్రం అయ్యాయి. ప్రజల బతుకులు మునుపటి స్థితిలోకి మారిపోయాయి. ప్రభుత్వ అధికారుల దోపిడీ, ఫారెస్ట్ అధికారుల ఆధిపత్యం, పెత్తందార్ల ఆగడాలు క్రమంగా పెరగడం ప్రారంభమయింది. దీనికి తోడు హోంగార్డుల అరాచకాలు మితిమీరడం ప్రారంభమైంది.

దెబ్బతిన్న ఉద్యమాన్ని పునఃసంఘటితం చేయాలనుకుని పాకెట్‌లోని గ్రామాలలో పార్టీ ప్రజా సభలు నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రజలు పార్టీ రాకపోవడం, సంఘాలు దెబ్బతినడం వల్ల తీవ్ర బాధలకు లోనవుతున్నామనీ, పార్టీ తప్పకుండా రావాలని మాట్లాడారు. ఆ తర్వాత అన్ని గ్రామాలలో సమస్యల పరిష్కారం కోసం తాత్కాలిక కమిటీలను పెట్టుకున్నారు. ప్రధానంగా కరువు, రేషన్ దుకాణం, హోంగార్డులకు సంబంధించిన సమస్యలను మొదట పరిష్కరించుకోవాలనుకున్నారు. హోంగార్డుల భయం వల్ల ఏ సమస్య గురించయినా ప్రజలు ఒక దగ్గర కూడి చర్చించుకునే పరిస్థితి లేదనీ, హోంగార్డుల కుటుంబాల నుండి పోలీసులకు సమాచారం పోతున్నదనీ ప్రజలు వాపోయారు. ఈ అన్ని సమస్యలపై రేవులకోట పాకెట్‌లో సభ జరపాలని నిర్ణయించుకున్నారు. ఈ సభకు పంచాయితీ ప్రెసిడెంట్, ఎం.పి.టి.సి., రేషన్ డీలర్‌లను పిలిచి నిలేయాలనుకున్నారు.

ఏప్రిల్ 5న రేవులకోట పాకెట్ మాత్రమే కాకుండా పక్క పాకెట్‌లోని అయిదు గ్రామాలు కలిపి మొత్తం 20 గ్రామాల నుండి దాదాపు 370 మంది మహిళలూ, 270 మంది పురుషులూ కల్సి దాదాపు 600 మంది హాజరైనారు. సభ మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ జరిగింది.

హోంగార్డులు జనజీవన ప్రవంతిలో కలిసే విధంగా ఆయా కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇవ్వాలనే ఉద్దేశంతో ఒకరోజు ముందుగా ఈ కుటుంబాల వారందరినీ, ప్రధానంగా రేవులకోట గ్రామంలోని అయిదు కుటుంబాల వారిని పిలిపించి పార్టీ కౌన్సిలింగ్ నిర్వహించింది.

సభలో గ్రామానికి ఇద్దరు ప్రతినిధుల చొప్పున కరువు, రేషన్, హోంగార్డుల సమస్యలపై తీవ్రంగా స్పందిస్తూ ఎం.పి.టి.సి., రేషన్ డీలర్‌లను నిలదీశారు. రేషన్ ఇవ్వాల్సిన చోట ఇవ్వకుండా, మరో జిల్లాలో సుమారు ఆరు, ఏడు గంటల దూరంలో ఇవ్వడం వల్ల నిత్యావసర సరుకులు తెచ్చుకోవడం లేదని, ఇచ్చేదానిలో కూడా అవినీతి బాగా జరుగుతోందనీ, ఇలాగే కొనసాగితే రేషన్ డిపోల మీద దాడులు చేస్తామని హెచ్చరించారు.

కరువు విషయంలో ఏ నాయకుడూ స్పందించడం లేదనీ, చేసుకోవడానికి ఏ పనులు లేవనీ ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

దీనిపై ఎం.పి.టి.సి., రేషన్ డీలర్ స్పందిస్తూ ఇక నుండి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

చివరగా హోం గార్డుల కుటుంబాల గురించి తీవ్రంగా చర్చించారు. ఆ కుటుంబాల వారు హోం గార్డులుగా పనిచేస్తున్న తమ కొడుకులతో నిత్య సంబంధాల్లో వుంటున్నారనీ, దీన్ని వీరు మానుకోలేరనీ, కనుక గ్రామాల నుండి వెళ్లి తమ కొడుకులతోనే వుంటే సరిపోతుందని మాట్లాడారు. ప్రజలతో వుండాలనుకుంటే వారితో సంబంధాలు తెంచుకోవాలనీ, లేదా హోంగార్డులు రాజీనామాలు చేయాలనీ మాట్లాడారు. ప్రజలు మాట్లాడిన తర్వాత ఒక్కో హోంగార్డు కుటుంబం తాము కొనసాగిస్తున్న సంబంధాలు తెంచుకుని ప్రజలతో కలిసి వుంటామని హామీ ఇచ్చారు. ఒకవేళ తప్పు చేస్తే ప్రజలు విధించే శిక్షను అనుభవిస్తామన్నారు.

చివరగా అన్ని గ్రామాల నుండి ప్రతినిధులుగా మాట్లాడిన వారు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, అన్ని గ్రామాలలో సంఘ నిర్మాణాలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంఘాలు లేకపోవడం వల్లనే బతుకులు దుర్భరమైపోతున్నాయనీ, ప్రతి గ్రామంలో మిలీషియా, సంఘాలను నిర్మాణం చేసుకొని మళ్లీ ఆర్.పి.సి.లు ఏర్పాటు చేసుకోవాలని మాట్లాడారు. ఈ సమావేశం అందరిలో ఆత్మ విశ్వాసాన్ని నింపింది.

### సారా వ్యతిరేక పోరాటం

విశాఖ జిల్లా కోరుకొండ ఏరియా కమిటీ పరిధిలో ఏర్పడిన మిలీషియా నిర్మాణాలు సారా పోరాటాన్ని చేపట్టాయి. పెద బయలు మండలం బూసిపుట్, జంగూడ పంచాయితీలోని పది గ్రామాలలో నాటు సారా అమ్ముతున్న ఇండ్లపై 2011, జూన్ 5న మిలీషియా నాయకత్వంలో ప్రజలు దాడి చేసి దాదాపు 110 బిందెల సారాను ధ్వంసం చేసారు.

చింతపల్లి మండలం కొడిమిసార పంచాయితీలోని పది గ్రామాల్లో నాటు సారాయిని విపరీతంగా అమ్ముతున్నారు. మన్యం పితూరి సేన నాయకత్వంలో 200 మంది ప్రజలు గ్రామ గ్రామాన తిరిగి సారా బట్టీలు, కుండలు ధ్వంసం చేసారు. లందులు పాకెట్ గ్రామాల్లో దాడులు చేసి ఏడు వేల కిలోల బెల్లం దిమ్మలను ధ్వంసం చేసినారు.

ఒడిశా రాళ్లగడ్డ పంచాయితీలోని సారా అమ్ముతున్న అయిదు గ్రామాల్లోకి 30 మంది మిలీషియా సభ్యులు వెళ్లి ఊరిబైట వున్న సారా ఊటను పారబోసారు. మొత్తంగా ఈ మధ్య కాలంలో ఏరియా వ్యాప్తంగా సారా వ్యతిరేక పోరాటం ఊపు అందుకుంది. ఏరియా మొత్తం సారా బంద్ చేయాలనీ ప్రజలూ, మిలీషియా దృఢ నిశ్చయంతో వున్నారు.

## ఉత్తర తెలంగాణ

### శత్రు కమ్యూనికేషన్, రోడ్ల విధ్వంసం :

ఉత్తర తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఉద్యమాన్ని అణచివేయడంలో భాగంగా శత్రువు రోడ్ల నిర్మాణం, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌పై కోట్లాది రూపాయలు వెచ్చించి వేగంగా అభివృద్ధి చేస్తున్నాడు. పోలవరం ప్రాజెక్ట్ ముంపు ప్రాంతంలో ముంపుకు గురయ్యే గ్రామాలను తరలిస్తూ కూడా రోడ్ల నిర్మాణం పకడ్బందీగా చేస్తున్నారు. ముంపుకు గురయ్యే ప్రాంతంలో అంత పెద్దమొత్తంలో ఖర్చు చేసి రోడ్లు నిర్మించటం కేవలం మావోయిస్టు ఉద్యమ అణచివేతకు ఉద్దేశించినదే. శత్రువు కూడా ఇదే ప్రకటించాడు. శత్రు కదలికల వేగాన్ని అడ్డుకోవడానికి రోడ్ల విధ్వంసంలో భాగంగా మే 5న దుమ్ముగూడెం మండలం చిన్న బండిరేవుల గ్రామం వద్ద రోడ్డు పనులకు ఉపయోగిస్తున్న ప్రొక్లైనర్, టిప్పర్‌లను ఏరియా కమిటీ నాయకత్వంలో జన మిలీషియా ధ్వంసం చేసింది.

మార్చిలో పెద్దబండిరేవుల గ్రామం వద్ద రోడ్డు నిర్మాణం చేస్తున్న ప్రొక్లైనర్‌ను జనమిలీషియా పేల్చివేసింది.

చర్ల మండలం పెద్ద మిసిలేరు(మిడిసిలేరు) గ్రామం నుండి కుర్నపల్లి వరకు వేస్తున్న మెటల్ రోడ్డును ప్రజలు మిలీషియా కలిసి 5 కి.మీ. మేర గోతులు తవ్వి ధ్వంసం చేశారు. పోలీసు రక్షణలో శత్రువు ఈ రోడ్డు నిర్మాణాన్ని కొనసాగిస్తూ ప్రజలను అరెస్టులు జైళ్ళపాలు చేస్తున్నప్పటికీ వెనుకడుగు వేయక ప్రజలు ఈ రోడ్డు నిర్మాణాన్ని ధ్వంసం చేస్తూనే వున్నారు.

*(చివరి పేజీ తరువాయి)*

బలహీనతకు గుర్తు కాదని వాదించారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విప్లవోద్యమం ముందుండాలని భావించేవారు.

విప్లవోద్యమం పట్ల ఆయనకుండే విమర్శలను అవసరమైన చోటనే మాట్లాడేవారు. అలా ఏ నిర్మాణంలో ప్రత్యక్షంగా లేనప్పటికీ నిర్మాణ సూత్రాలకు కట్టుబడి గొప్ప నిబద్ధతను ప్రదర్శించారు. విప్లవోద్యమంపై ఎవరైనా అవాకులూ చెవాకులూ మాట్లాడితే ఆయన సహించేవారు కాదు.

విప్లవ ప్రజా సంఘాలతో ఆయనకు విడదీయరాని అనుబంధం వుంది. ఆర్.ఎస్.యు. తదితర ఎన్నో ప్రజా సంఘాల వేదికల్లో ఆయన పాల్గొని విలువైన ఉపన్యాసాలు చేశారు. పౌరహక్కుల సంఘంలో సంక్షోభం వచ్చినపుడు కొంతమంది కార్యకర్తలు ఆయనతో చర్చించి స్పష్టతకు రాగలిగారు.

ఆయన చాలా సునిశితమైన, పదునైన విధాన విమర్శను చేసేవాడు. భారీ ప్రాజెక్టులే అభివృద్ధికి గీటురాళ్లుగా పాలక వర్గాలు ఊదరగొడుతున్న సమయంలో ఆయన అభివృద్ధి అంటే ఏంటి? అనే చర్చను లేవదీశారు. మార్పుకు దోహద పడేదే అభివృద్ధి అని స్పష్టం చేశారు. అభివృద్ధిని గణాంకాల ఆధారంగా కాక మనిషి కేంద్రంగా చూశారు. ఒడిశాలో నిర్మించిన హిరాకుడ్ డ్యాం నిర్మాణం వల్ల నిర్వాసితులైన ప్రజల గురించి అధ్యయనం చేసి 'అభివృద్ధి వెలుగు నీడలు' అనే పుస్తకం రాశారు.

అలాగే సేవా రంగంలో ఎక్కువగా పెట్టుబడులు పెట్టడాన్ని విమర్శించేవారు. సేవా రంగంలో మౌలిక ఉత్పత్తి జరగదనీ, మనది వ్యవసాయ ప్రధాన దేశం కనుక వ్యవసాయాధారిత పరిశ్రమలను స్థాపించాలని నొక్కి చెప్పేవారు. ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న పథకాలు ప్రజలకు ఎంత మేరకు ఉపయోగపడుతున్నాయో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని చెప్పేవారు. అలా ఆయన, సహచరి భారతితో కల్సి ఎన్నో క్షేత్ర పరిశోధనలు చేశారు.

యూనివర్సిటీల్లో ప్రజలకు ఉపయోగపడే పరిశోధనలు జరగడంలేదనే వారు. యూనివర్సిటీలు 'ఎలా వుంది' అనేది చెబుతాయి. మనం 'ఎలా మారుతుంది' అనేది చెప్పాలనేవారు.

ఆర్.ఎస్.రావు అధ్యయనం చాలా విస్తృతమైనది. అందుకే ఆయన ఆలోచనల్లో, రచనల్లో ఆ విస్తృతి కనబడుతుంది. అర్థ శాస్త్రం, రాజకీయాలు, చరిత్ర, సాహిత్యం, సంస్కృతి, తత్వశాస్త్రం ఇలా ఎన్నో వైవిధ్య భరితమైన విషయాల మీద ఆయన రచనలు, ప్రసంగాలు, సంభాషణలు చేశారు. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో విరివిగా రచనలు చేశారు. వందకు పైగా ప్రసంగాలు చేశారు. ఆయన రాసిన వ్యాసాలూ, చేసిన ప్రసంగాలు 'కొత్తచూపు' అనే పుస్తకంగా ప్రచురితమైనాయి. ఇంగ్లీష్ వ్యాసాలు 'టువార్డ్స్ అండర్‌స్టాండింగ్ సెమీ ఫ్యూడల్ సెమీ కలోనియల్ సొసైటీ' అనే పుస్తకంగా వెలువడ్డాయి.

ఆయన రచనల్లో, ప్రసంగాల్లో వర్గ దృక్పథాన్ని ఎల్లప్పుడూ ఎత్తిపట్టేవారు. ఏ విషయం పట్లనైనా చాలా స్పష్టతను కలిగి వుండేవారు. కొన్ని రాజకీయ పరిణామాలను సరిగా అర్థం చేసుకోలేక, కొందరు మేధావులు గందరగోళపడే ఎన్నో సందర్భాల్లో ఆయన చాలా స్పష్టతను కలిగివుండేవారు. రాష్ట్రానికి చాలా దూరంగా వుంటూ కూడా రాష్ట్రంలో జరిగే పరిణామాల పట్ల సరైన వైఖరిని కలిగి వుండేవారు. ఇదెలా సాధ్యం అని ఎవరో ప్రశ్నించిన ఒక సందర్భంలో ఆయన 'నేను క్రాంతిని క్రమం తప్పకుండా చదువుతాను' అని చెప్పుకోవడాన్ని 'క్రాంతి' సగర్వంగా గుర్తు చేసుకుంటోంది. పార్టీ డాక్యుమెంట్లనూ, సృజన, అరుణతార వంటి పత్రికలను తప్పకుండా చదువుతానని చెప్పుకునేవారు.

ఆయన ఆలోచనలకూ జీవనశైలికీ ఏ వైరుధ్యం వుండేది కాదు. డాక్టర్ భారతి ఆయనకు సరైన జోడి. ఆయన జీవితంలోనే కాదు ఆయన మేధస్సులోనూ ఆమె భాగస్వామి. ఆమె కూడా విస్తృతమైన అధ్యయనం, రచనలు చేసింది.

విప్లవోద్యమానికి ఆయన చేసిన సేవల్లో మరొక విషయాన్ని విశేషంగా చెప్పుకోవాలి. ఎ.ఒ.బి.జోన్‌లో మల్కన్‌గిరి కలెక్టర్ వినీల్ క్రిష్ణను కిడ్నాప్ చేసిన గెరిల్లాలు ఆర్.ఎస్.రావును మధ్యవర్తుల్లో ఒకరుగా వుండాలని కోరుకున్నారు. ఒడిశా రాష్ట్రంతో ఆయనకున్న అనుబంధం వల్లా, ఒడిశా పీడిత ప్రజల సమస్యల పట్ల ఆయనకుండే అవగాహన, సహానుభూతి వల్లా ఆయనను మధ్యవర్తిగా కోరుకున్నారు. అయితే ఆ సమయంలో ఆయన అనారోగ్యంగా వున్నారు. కనుక ఆయన శ్రేయోభిలాషులు, 'ఈ సమయంలో వెళ్లగలరా?' అని సందేహిస్తే, విప్లవోద్యమం తన మీద పెట్టిన బాధ్యతను ఆదేశంగా స్వీకరిస్తానని చెప్పారు. అలా ఆయన ఒక క్రమశిక్షణ కల్గిన విప్లవ సైనికుడుగా కర్తవ్య నిర్వహణ చేపట్టారు. ఈ విషయంలో మధ్యవర్తుల పాత్ర పట్ల ఎ.ఒ.బి.ఎస్.జడ్.సి. సంతృప్తిని వ్యక్తం చేసింది. ప్రభుత్వ మొండి వైఖరి పట్ల ఆయన చాలా అసంతృప్తిని వ్యక్తం చేశారు. మాయం చేసిన సీతన్న ఆచూకీనైనా ప్రభుత్వం చేత చెప్పించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇలా విప్లవోద్యమం పక్షాన, పీడిత ప్రజల పక్షాన జీవితకాలమంతా దృఢంగా నిలబడి మేధోరంగంలో విశేషమైన కృషి చేసిన ఆర్.ఎస్.రావు మరణం వలన సమాజానికి ఎనలేని నష్టం వాటిల్లింది. ఆ నష్టాన్ని పూడ్చే బాధ్యత మేధావులూ, విద్యార్థులూ, విప్లవోద్యమ కార్యకర్తలు తదితరులందరిపైనా వుంది. ఆయన చేసిన కృషిని మరింత ముందుకు తీసుకుపోవడం, ఆయన కన్న కలలను నెరవేర్చడానికి దృఢంగా ముందుకు సాగడం మాత్రమే ఆయనకు నిజమైన నివాళి అవుతుంది.

# అరుదైన మార్క్సిస్టు మేధావి

# కామ్రేడ్ ఆర్.ఎస్.రావుకు అరుణారుణా జోహార్లు!

2011 జూన్ 17న కామ్రేడ్ ఆర్.ఎస్.రావు కన్నుమూశారు. గుండెపోటుతో మూడు వారాల క్రితం ఢిల్లీలోని గంగారాం ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ మరణించారు. అసాధారణమైన మేధో సంపత్తితో, మొక్కవోని నిబద్ధతతో మార్క్సిజానికీ, ప్రత్యామ్నాయ రాజకీయ రంగానికీ ఎనలేని సేవలందించిన కామ్రేడ్ ఆర్.ఎస్.రావుకు 'క్రాంతి' వినమ్రంగా నివాళులర్పిస్తోంది. ఆయన జీవిత సహచరి డాక్టర్ ముదునూరి భారతికీ, ఇతర కుటుంబ సభ్యులకూ, బంధు మిత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది. ఈ సందర్భంగా విప్లవోద్యమంతో ఆయనకున్న అనుబంధాన్నీ, విప్లవోద్యమానికి ఆయన అందించిన తోడ్పాటునూ వినమ్రంగా స్మరించుకుంటోంది.



ఆర్.ఎస్.రావుగా ప్రఖ్యాతి గాంచిన రేగులగడ్డ సోమేశ్వర రావు 1937 అక్టోబర్ 22న విశాఖ జిల్లాలోని చోడవరంలో పుట్టారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి అర్థశాస్త్రంలో మాస్టర్ డిగ్రీ చేశారు. తొలుత ఆయన పూనాలో గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్‌లో పని చేశారు. 1967–69 మధ్య కలకత్తాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేశారు. 1969లో మళ్లీ పూనాకు వచ్చారు. 1974లో సంబల్‌పూర్ యూనివర్సిటీలో అర్థశాస్త్ర విభాగంలో అధ్యాపకులుగా చేరి, 1997లో రిటైర్ అయ్యేదాకా కొనసాగారు.

నక్సల్బరీ వెల్లువ అన్ని తరగతుల ప్రజలను విశేషంగా ప్రభావితం చేసింది. మేధావి వర్గం అందుకు మినహాయింపు కాదు. ఆర్.ఎస్.రావు అందుకు అతీతుడు కాదు. నక్సల్బరీ సమయంలో కలకత్తాలోనే వుండడం అనేది ఉద్యమాన్ని దగ్గరగా అర్థం చేసుకోవడానికి ఆయనకు ఉపకరించి వుంటుంది. అంతకు ముందే మార్క్సిజాన్ని చదువుకున్న ఆయనను, 'నక్సల్బరీ' క్రియాశీల మార్క్సిస్టు మేధావిగా తీర్చిదిద్దింది. ఆయన మార్క్సిజానికి చేసిన సేవలు ప్రశంసనీయమైనవి. జీవితమంతా మార్క్సిజాన్ని ఎత్తిపడుతూ, మార్క్సిస్ట్ సంవిధానాన్ని అవలంబిస్తూ పలు రచనలు, ప్రసంగాలు, సంభాషణలు, వాదనలు చేశారు. పూనాలో వున్నప్పుడు మేధావులూ, విద్యావేత్తలూ, పరిశోధకులూ, కార్మికులూ, విద్యార్థులతో సన్నిహిత సంబంధాల్లో వుంటూ తత్వశాస్త్రంపై చర్చలు చేసేవారు.

నక్సల్బరీ మార్గాన్ని బలంగా నమ్మిన ఆయన ఏ నిర్మాణంలో ప్రత్యక్షంగా లేనప్పటికీ విప్లవోద్యమ నిర్మాణాలను గౌరవించారు, తుదిశ్వాస విడిచే వరకూ వాటికి బాసటగా నిలిచారు. సైద్ధాంతికంగా ఆ నిర్మాణాలకు ఎనలేని సేవలందించారు.

నక్సల్బరీ పంథా మన దేశాన్ని అర్ధ వలస, అర్ధ భూస్వామ్య సమాజంగా చేసిన విశ్లేషణను కొందరు తప్పు పడుతుంటారు. ఆర్.ఎస్.రావు విప్లవోద్యమం చేసిన ఈ సూత్రీకరణకు వకాల్తాదారు అయ్యారు. ఈ విశ్లేషణ ఎంత వాస్తవికమైనదో నిరూపించడానికి 1970లోనే ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ఒక వ్యాసం రాశారు. అప్పటి నుండి మొదలుకొని ఎన్నో సందర్భాల్లో ఈ విశ్లేషణకు బలాన్ని చేకూర్చే రచనలు చేశారు, వాదనలు వినిపించారు. ఆయన మరణించేనాటికి ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో అర్ధ వలస అర్ధ భూస్వామ్య సూత్రీకరణను సమర్థించే పత్రం తయారు చేసే కృషిలో వున్నారు.

మన దేశంలో వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ సంబంధాలు ప్రవేశించాయని రివిజనిస్టులూ, కొంతమంది మేధావులు చేసే సూత్రీకరణలను ఖండిస్తూ ఆయన ఒక వ్యాసం రాశారు.

ఆంధ్ర ప్రదేశ్‌లో చంద్రబాబు పాలనలో విరుచుకుపడిన తీవ్ర నిర్బంధ సమయంలో కొందరు మేధావులు 'పీస్ ఇనీషియేటివ్' పేరుతో శాంతిని నెలకొల్పడానికి చేసిన ప్రయత్నాల్లో ఆర్.ఎస్.రావు పాత్ర కీలకమైనది. విప్లవోద్యమం చర్చలు ఎందుకు చేయాలో ఆయన అద్భుతంగా వివరించారు. చర్చలు చేయడం విప్లవోద్యమ

*(మిగతాది 43వ పేజీలో...)*